చదువు
రూ॥ 180/-
పేజీలు: 210

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


జూబ్లీహిల్స్ నివాసంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ సినీ నటుడు చిరంజీవి

సంపుటి 08, సంచిక: 244 | సోమవారం | 4-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఇసి తటస్థత ప్రశ్నార్థకంగా మారింది

'ఎస్ఐఆర్'పై పార్లమెంటులో చర్చ జరగాల్సిందే : గౌరవ్ గొగోయ్ డిమాండ్

5లో



5లో

## దేశంలో 20శాతం రైలు డ్రైవర్ల కొరత

తప్పుడు పద్ధతుల్లో పనిగంటల తారుమారు



## ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కలకలం

బర్త్‌డే పార్టీలో నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో పాజిటివ్

ఆరుగురు ఐటి ఉద్యోగుల అరెస్టు

12లో

# గోదావరి జలాల తరలింపు సాగనివ్వం



- సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వల్లే బనకచర్లకు బ్రేక్
- కృష్ణా జలాల వినియోగంలో గత పాలకులు పూర్తిగా విఫలం
- ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి వల్లనే బనకచర్లకు బ్రేక్ పడిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల నిర్మాణం ద్వారా గోదావరి జలాల తరలింపును సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ కృష్ణా, గోదావరి జలాలను వినియోగించుకోవడంలో గత పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టారని భట్టి ఆరోపించారు. గోదావరిలో మిగులు జలాలు ఎక్కడ ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి 13 టిఎంసిల నీటిని తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఈ నీటి దోపిడీ కొనసాగితే 30 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందని భట్టి స్పష్టం చేశారు. గోదావరి నదిపై ఎస్ఆర్ఎస్‌పి, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల ప్రాజెక్టులను నిర్మించామని గతంలోనే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను ఖమ్మం జిల్లాలో చేపట్టామని భట్టి గుర్తు చేశారు. గోదావరిపై ప్రాజెక్టులను పూర్తి చేస్తే నీరు సముద్రంలో కలిసే ప్రసక్తే లేదని ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్లే మిగులు జలాలపై వాదన కొనసాగుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి బయటకు రాకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు బిఆర్‌ఎస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి లు బనకచర్లపై సమర్థవంతంగా వాదనలు వినిపించారని అయినా ఆంధ్రప్రదేశ్ నాయకులు ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ తెలివిగా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలోని నీటి ప్రాజెక్టులు పూర్తయి నిల్వ అవసరాలు తీర్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల వ్యవహారంలో ముందుకెళ్లాలని తరువాయి 2లో



# ఎందాకైనా పోరాడతాం

- గోదావరిని రాయలసీమకు తీసుకెళ్తానని కెసిఆర్ చెప్పడం వల్లే బనకచర్లకు బీజం
- రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే ప్రాజెక్టుకు ఇప్పుడు బ్రేక్ పడింది
- గోదావరిలో రాష్ట్ర వాటా 968 టిఎంసిల నీటిని సంపూర్ణంగా వినియోగించుకొనేలా ప్రాజెక్టు చేపడతాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/పెద్దపల్లి

ఎపి విభజన చట్టానికి బనకచర్ల ప్రాజెక్టు పూర్తిగా వ్యతిరేకమని, ఆ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్తానని కెసిఆర్ గతంలో అన్నారని, అప్పుడే బనకచర్లకు బీజం పడిందని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు ప్రజల్లో తప్పుడు సంకేతాలిస్తున్నారన్నారు. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాల మేరకే బనకచర్ల అనుమతులను టిడబ్ల్యుసి, గోదావరి నదీ యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిలిపివేసిందన్నారు. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న 968 టిఎంసిల నీటి వాటా సంపూర్ణంగా వినియోగించు కునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్గాం మండలంలోని గోలివాడ వద్ద రామగుండం తరువాయి 2లో

భావజాలం నుంచి ఆదాయం వరకు

# కశ్మీర్‌లో సరికొత్త సోషల్ మీడియా గేమ్!

భద్రతాసంస్థల విచారణలో గుట్టురట్టు

**శ్రీనగర్ :** కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సరికొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. కొంతమంది యువతలో సైద్ధాంతిక విశ్వాసంతో కాకుండా వేర్పాటువాదులను, ఉగ్రవాదులను కీర్తించే అనుచరులను సంపాదించడానికి, ప్రకటనదారుల నుండి డబ్బు సంపాదించడానికి సోషల్‌మీడియాను ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహంగా ఉపయోగించే కొత్త ధోరణి చోటుచేసుకుంటున్నదని భద్రతాసంస్థలు కనుగొన్నాయి. ఈ నేపథ్యంలో తీవ్రవాద ప్రక్రియను ఎదుర్కోవడానికి, సోషల్ మీడియా సైట్‌లను ట్రాక్ చేయడానికి శ్రీనగర్ పోలీసులు అన్ని రకాల ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అటువంటి ఖాతాల వెనక ఉన్నటువంటి కొంతమంది యువకులను అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ 'కార్యనిర్వాహక విధానం' (మోడస్ ఆపరాండి) గురించి కనుగొన్నారు. విచారణ సమయంలో నిషేధిత 'హిజ్బుల్ ముజాహిదీన్'కు చెందిన హతమైన ఉగ్రవాది బుర్హాన్ వని వంటి రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించడం అనేది అధిక, చురుకైన అభిమానులను సంపాదించడానికి ఒక ప్రణాళిక అని యువకులు తరువాయి 12లో

ఇసి అధికారాలను

# దుర్వినియోగం చేస్తోంది

- రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోంది
- రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలి : చిదంబరం



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై తీవ్ర వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చిదంబరం ఎన్నికల సంఘంపై మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బిహార్ ఓటర్ల సవరణ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోందని మాజీ హోంమంత్రి అన్నారు. బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా, తమిళనాడులో 6.5 లక్షల మందిని ఓటర్లుగా చేర్చడం ఆందోళనకరమైనదని, చట్టవిరుద్ధమని చిదంబరం తరువాయి 12లో



# హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటలే ప్రయాణం

- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మిస్తాం
- 6న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ఈ అంశాన్ని చర్చిస్తాం
- హైదరాబాద్‌ను అభివృద్ధిచేశామన్న కెటిఆర్ ఉప్పల్‌లో ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేదు?
- రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్/ఎల్.బి.నగర్

హైదరాబాద్ నుండి విజయవాడకు రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మిస్తామని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ నెల 6న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ అంశాలపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్ ఎల్.బి.నగర్ నుండి పెద్ద అంబర్‌పేట వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను మంత్రి ఆదివారం పరిశీలించారు. వనస్థలి పురం జంక్షన్ వద్ద క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షిం చారు. ఈ సందర్శనలో మంత్రి వెంట ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆర్‌డిసి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు తనకు తెలుసని, గతంలో తాను ఎంపిగా ఉన్నప్పుడే రోడ్ల అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుమారు తరువాయి 2లో

ఓ లిల్లీపుట్ నేతతో నల్లగొండలో

# బిఆర్‌ఎస్ నాశనం

- నాపై అనుచిత వ్యాఖ్యల వెనుక పార్టీ పెద్దనాయకుడి హస్తం
- బిఆర్‌ఎస్‌తో సంబంధం లేని వ్యక్తికి ఊతమిచ్చి వ్యాఖ్యలు చేయించినట్టు ఆధారాలున్నాయ్
- ఆ లిల్లీపుట్ నేత ఎన్నడూ ప్రజాఉద్యమాలు చేయలేదు
- ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్

తనపై వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ రాష్ట్రం బాధపడిందని, కానీ బిఆర్‌ఎస్ నాయకులు స్పందించలేదని, తనపై ఒక వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యల వెనకాల బిఆర్‌ఎస్‌కు చెందిన ఒక పెద్ద నాయకుని హస్తం ఉన్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్‌ఎస్‌కు సంబంధం లేని వ్యక్తికి ఊతమిచ్చి తనపై వ్యాఖ్యలు చేపించినట్టు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బయటపడుతుందన్నారు. కింది స్థాయికి దిగజారి ఒక మహిళపై వ్యాఖ్యలు చేయించారని, రాజకీయం చేయవచ్చని, కానీ ఇంత నీచంగా అని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ నల్లగొండ జిల్లాల్లో బిఆర్‌ఎస్‌ను నాశనం చేసిన ఒక లిల్లీపుట్ నాయకుడు తన గురించి 'ఆమె ఎవరు'..? అని మాట్లాడుతున్నారని, ఆ నాయకునికి ప్రోత్సాహం ఇస్తున్నదెవరో ప్రజలు ఆలోచిస్తారని, నల్లగొండలో ఒక్క సీటు కూడా రాలేదని, ఆయన సీటు కూడా సావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా తరువాయి 2లో



రేవంత్‌రెడ్డి, రాధాకృష్ణ పదాలనే

# ఎమ్మెల్సీ కవిత వల్లెవేస్తున్నారు

- నల్లగొండలో 20 ఏళ్ల ఉద్యమాలకు, ఎన్నికల విజయాలకు నాదే బాధ్యత
- ప్రస్తుత ఓటమికీ నేనే బాధ్యుడిని
- మాజీమంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

కెసిఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వారు, బిఆర్‌ఎస్‌ను ఖతం చే యాలని చూస్తున్న రేవంత్ రెడ్డి,రాధాకృష్ణ ఏం మాట్లాడుతున్నారో కవిత కూడా అదే మాట్లా డుతున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితకు ఉన్న జ్ఞానానికి తన జోహార్లు అని అన్నారు. కవిత ఉపయోగించిన పదాలను రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఉపయోగించారని, వాళ్ళు ఉపయోగించిన తరువాయి 2లో



# కాలువలో పడిన కారు

11 మంది మృతి, మరో నలుగురికి గాయాలు

యుపిలోని గోండా జిల్లాలో ఘటన

**గోండా :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆదివారం గోండా జిల్లాలోని సరయు కాలువలో ఓ కారు అదుపు తప్పి పడిపోవడంతో 11 మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బాధితులు సిహాగావ్ గ్రామం నుండి ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయంలో పవిత్ర జలం అర్పించడానికి వెళుతుండగా బెల్వా బహుతా సమీపంలో ప్రమాదం జరిగిందని ఇటియాథోక్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కృష్ణ గోపాల్ రాయ్ చెప్పారు. కారులో డ్రైవర్ సహా 15 మంది ఉన్నారన్నారు. గ్రామస్తులు, రెస్క్యూ బృందాల తరువాయి 12లో

# గ్రానైట్ పరిశ్రమ కుదేలు!





- అంతర్జాతీయంగా మార్కెట్ మందగమనం
- కార్మికుల కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- ఆందోళన బాటలో యాజమాన్యాలు, కార్మికులు
- జీవో 14 ఉపసంహరించాలని డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ

రాష్ట్రంలో వేలాది కార్మికులకు ఉపాధి జీవనాధారంగా ఉన్న గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అంతర్జాతీయంగా గ్రానైట్ మార్కెట్ మందగమనంలో పడిపోయింది. ఇతర దేశాలకు తగ్గిన ఎగుమతులతో పాటు ఖనిజ రాయల్టీల పెంపు, ఉత్పత్తికి మించిన వ్యయం, ప్రభుత్వ ముడుపుల భారంతో పరిశ్రమ కుదేలవుతోంది. ప్రభుత్వం ఈ యేడాది జులై 8న జారీ చేసిన జీవో నెంబర్ 14 ద్వారా సీనరేజస్ చార్జీలను మరో 20 శాతం పెంచడంతో గ్రానైట్ క్వారీ పరిశ్రమలో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారాల్లో ప్రొడక్షన్ హాలిడేలు, ఫ్యాక్టరీలు మూత పడుతున్న నేపథ్యంలో తరువాయి 2లో

ధర్మస్థలలో అసహజ మరణాల

# రికార్డులు మాయం

ఆర్‌టిఐ చట్టం ద్వారా వెలుగులోకి



**న్యూఢిల్లీ :** ధర్మస్థల ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరి కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటు చేసుకున్న అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ విషయం ఆర్‌టిఐ చట్టం ద్వారా ఆదివారం బహిర్గతమైంది. 2000 నుంచి 2015 మధ్య బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు, యువతులు, బాలికలకు చెందిన రికార్డులన్నీ గల్లంతయ్యాయి. ఈ మేరకు ఆర్‌టిఐ కార్యకర్త జయంత్ ఆదివారం వెల్లడించారు. ఇదే సమయంలో అనుమానాస్పద మరణాలపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన గుర్తు చేశారు. అయితే తాను వందకు పైగా మహిళలు, యువతుల మృతదేహాలను పూడ్చిపెట్టానంటూ ఒక పారిశుద్ధ్య కార్మికులు ప్రకటించిన వేళ.. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు మాయం కావడం తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## బ్యాంకాక్‌లో వేలాదిమంది ప్రదర్శన

**బ్యాంకాక్:** న్యాయస్థానం సస్పెండ్ చేసిన ప్రధానమంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్ర తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు. పొరుగున కాంబోడియాతో సరిహద్దు ఘర్షణలకు దిగి సైనికులు మరణాలకు ఆమె కారకురాలయ్యారని ప్రదర్శకులు విమర్శించారు. ఆమె వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. జులై చివరివారంలో థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య సరిహద్దు వివాదం తలెత్తడంతో ఐదు రోజుల ఘర్షణల్లో 35 మంది సైనికులు మరణించారు. మరో 2.60 లక్షలమంది సరిహద్దు సమీప గ్రామాలు ఖాళీచేసి వెళ్ళిపోయారు. ఈ పరిణామాలకు పేటోంగ్‌టార్న్ షినవత్ర కారకురాలని ప్రదర్శకులు తీవ్రంగా తప్పుపట్టారు. తీవ్రమైన ఎండలు ఇబ్బంది పెడుతున్నాగానీ లెక్కచేయకుండా బ్యాంకాక్ మ్యూజియం నుండి వేలాదిమంది ప్రజలు దేశభక్తియుత గీతాలు ఆలపిస్తూ ఈ ప్రదర్శన ప్రారంభించారు. పేటోంగ్‌టార్న్‌తో పాటు ఆమె తండ్రి మాజీ ప్రధానమంత్రి తక్షిణ్ షినవత్రను కూడా దేశ ప్రస్తుత పరిస్థితులకు కారకులని విమర్శించారు. కాంబోడియాతో సరిహద్దు ఘర్షణలకు షినవత్ర కుటుంబం ప్రధాన కారణమని, వారికి దేశాన్ని పాలించే అధికారం లేదని నినాదాలు చేశారు.

## పాక్‌లో చమురు నిక్షేపాలు లేవు

### అవన్నీ బలోచిస్థాన్ రిపబ్లిక్ దేశ వనరులు
### ట్రంప్‌కు బలోచ్ నేతల బహిరంగ లేఖ



**క్వెట్టా :** పాకిస్థాన్‌లో అసలు చమురు, అరుదైన ఖనిజ వనరుల నిక్షేపాలు లేవని, ఈ ఖనిజ వనరులన్నీ రిపబ్లిక్ ఆఫ్ బలోచిస్థాన్‌కు చెందినవని ఈ విషయంలో అమెరికాను పాకిస్థాన్ పూర్తిగా తప్పుతోవ పట్టించిందని బలోచ్ నాయకుడు మిర్ యార్ బలోచ్ ఆదివారం డోనాల్డ్ ట్రంప్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. బలోచిస్థాన్ రిపబ్లిక్ ఎవ్వరికీ అమ్ముడుపోవడానికి, అమ్మకానికీ సిద్ధంగా లేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకోసం బలోచ్ నిధులను తమ నిధులుగా తప్పుతోవ పట్టించారన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో వేలాదిమంది అమెరికా సైనికులు మరణించడానికి కారకులైన అల్‌ఖైదా, ఇతర ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదులను, సైన్యాలను ఏకంచేసి వారికి కొమ్ముకాసింది పాకిస్థాన్ ప్రభుత్వమే అనే విషయం మరచిపోవద్దని బలోచ్ హెచ్చరించారు. లక్షలకోట్లు డాలర్ల విలువచేసే భూగర్భ వనరులను దుర్వినియోగం చేసేవిధంగా ఎలాంటి వ్యూహాత్మక తప్పిదాలకూ అమెరికా పాల్పడవద్దని కూడా ఆయన హెచ్చరిక చేశారు. పశ్చిమ,దక్షిణ ఆసియా ప్రాంతంలో ఎంతో చరిత్రాత్మకమైన భూభాగం బలోచిస్థాన్. ఈ ప్రాంతం చరిత్రలో ఇరాన్,పాకిస్థాన్,ఆఫ్ఘనిస్థాన్ దేశాలుగా ఆవిర్భవించింది. పాలనాపరంగా బలోచ్ రాష్ట్రం పాకిస్థాన్‌లో అంతర్భాగంగా ఉంది. వీరంతా పశ్చిమ ఇరానిక్ బలోచ్ భాష మాట్లాడతారు. అసలు లేని చమురు నిక్షేపాలను ఉన్నాయంటూ పాకిస్థాన్ సర్వసైన్యాధిపతి ఆసిఫ్ మునీర్‌తోపాటు ఆ దేశ దౌత్యవర్గాలు కూడా మిమ్మల్ని తప్పుతోవ పట్టించారని, మీతో ఆ దేశం వాణిజ్య ఒప్పందం చేసుకుని తప్పుతోవ పట్టించిందని ఒక బహిరంగ లేఖలో ట్రంప్‌కు మిర్ యార్ బలోచ్ హెచ్చరిక చేశారు. జులై 29వ తేదీన భారత్‌పై 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ కొద్దిగంటల తర్వాత పాకిస్థాన్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారు. అమెరికా దిగుమతి చేసుకునే పాకిస్థాన్ సరుకులపై 19 శాతం సుంకాలు విధించారు. పాకిస్థాన్ తీర ప్రాంతాల్లో సామూహికంగా భారీ ఎత్తున చమురు నిల్వల క్షేత్రాలున్నాయని, ఆ దేశంలో మూడు చమురు నిల్వల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం సందర్భంగా ట్రంప్ ప్రకటించారు. దీనిపై బలూచిస్థాన్ నాయకుడు మిర్ యార్ బలోచ్ బహిరంగ లేఖద్వారా ట్రంప్‌కు పైవిధంగా హెచ్చరిక చేశారు. ప్రపంచంలో చాలా అరుదుగా లభించే చమురు నిల్వలతోపాటు, లిథియం, యురేనియం, కాపర్ వంటి ఖనిజాలన్నీ పాకిస్థాన్‌కు సంబంధించినవికాదనీ, బలోచిస్థాన్ దేశానికి సంబంధించినవని మిర్ యార్ బలోచ్ స్పష్టం చేశారు. విస్తారంగా చమురు, ఇతర విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్న విషయం నిజమే కావచ్చున కానీ ఆ నిక్షేపాలన్నీ బలూచిస్థాన్ రిపబ్లిక్‌కు చెందినవేతప్ప పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందినవి కావని ఆయన స్పష్టం చేశారు. ''మీరు ఉన్నాయనుకుంటున్న భూగర్భ వనరులన్నీ పంజాబ్‌లో ఉన్నాయనీ, ఈ ప్రాంతం అంతా నిజమైన పాకిస్థాన్ దేశమని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

# సిడ్నీలో 'మార్చ్ ఫర్ హ్యూమానిటీ'

### పాలస్తీనాకు మద్దతుగా లక్షమంది భారీ ప్రదర్శన

**సిడ్నీ:** గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణ దాష్టీకాలను, ఆకలిలో ప్రజలను మాడ్చేసే కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆస్ట్రేలియా నగరం సిడ్నీలో లక్షమంది ప్రజలు ''మార్చ్ ఫర్ హ్యూమానిటీ'' పేరుతో భారీ ప్రదర్శన జరిపారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు, ఆస్ట్రేలియా ఎడిటర్, అమెరికా సైనిక గూఢచారి కార్యకలాపాల విశ్లేషకుడు జూలియన్ అస్సాంజ్,విదేశాంగశాఖ మాజీ మంత్రి బాబ్ కార్, ప్రభుత్వ ఎంపీ ఎడిక్ హ్యూసిక్ సహా అనేకమంది ప్రముఖులు ఈ భారీ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన నిర్వహించడానికి ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు ఒకరోజు ముందుగా అనుమతి మంజూరు చేసింది. ఈ విధంగా అనుమతి ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని పాలస్తీనా అనుకూల నిర్వాహకులు వ్యాఖ్యానించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజలు లెక్కచేయకుండా ఈ ప్రదర్శనలో పాల్గొని పాలస్తీనా ప్రజలపట్ల తమ సంఘీభావాన్ని ప్రకటించారు. పాలస్తీనా ప్రజలకు న్యాయం చేయాలని, వారి స్వయంప్రతిపత్తిని, సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని వారు కోరారు. చిన్న పిల్లలను, మహిళలను, వయోజనులను పస్తులుపెట్టి చంపడం, తుపాకీలతో ఆహార కేంద్రాలవద్ద వారిని కాల్చి చంపడం వంటి అమానుష చర్యలను తక్షణం నిలిపివేయాలని ప్రజలు నినాదాలు చేశారు. సిటీ సెంటర్‌లోని లాంగ్ పార్కు నుండి ప్రజలు మధ్యాహ్నం ఒంటి గంటలకు ఒక సముద్ర ప్రవాహంలా బయలుదేరారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సిడ్నీలోని హార్బర్ బ్రిడ్జిపై ప్రదర్శన చేశారు. అమెరికా కాన్సొలేట్ వద్ద ప్రదర్శన ముగించాలని ప్రదర్శకులు భావించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని కూడా ప్రదర్శకులు తీవ్రంగా తప్పుపట్టారు. అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. హార్బర్ బ్రిడ్జి సెంటర్‌ను ఉదయం 11.30 గంటలకే పోలీసులు పూర్తిగా రాకపోకలు జరగకుండా ప్రదర్శకుల నిమిత్తం మూసివేశారు. ఈ ప్రదర్శనలో దాదాపు 90,000 మందికిపైగా పాల్గొని ఉంటారని పోలీసులు అంచనావేశారు. ఈ భారీ ప్రదర్శన నా ఊహలకు మించిపోయిందని ఒక ప్రదర్శకుడు ఈ సందర్భంగా వ్యాఖ్యానించాడు. ప్రజల భద్రత రీత్యా ఈ ప్రదర్శనను నిలిపివేసేందుకు ప్రదర్శనకు నాయకత్వం వహించినవారితో పోలీసులు సంభాషణలు చేశారు. తదుపరి వివరాలు తెలియాల్సి ఉంది.




### గాజాలో ఆహార కేంద్రంపై కాల్పుల్లో 44 మంది మృతి

గాజాలో అనేకచోట్ల ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో ఆదివారం నాడు 44 మంది మరణించారు. వీరిలో 22 మంది ఆహార కేంద్రాలవద్ద మరణించారు. ఆహారం కోసం ప్రజలు తీవ్రస్థాయిలో ఎగబడుతున్నారు. ప్రతిముగ్గురులో ఒకరు తీవ్ర ఆకలితో బాధపడుతున్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఆహారం లభించడంలేదు. ఒకవైపు ఆకలిచావులు విపరీతంగా పెరిగిపోతుండగా మరోవైపు అంతర్జాతీయస్థాయిలో ప్రపంచ దేశాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా యూరప్ దేశాలు కూడా బెంజిమన్ నెతన్యాహూ వైఖరి కారణంగా ఇప్పుడు ప్రధానంగా పాలస్తీనా ప్రజలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసే పరిస్థితులు వచ్చాయి. ట్రంప్ కూడా గాజాలో ప్రజలు ఆకలి మరణాలకు గురవుతున్నారని నమ్ముతున్నారని వాషింగ్టన్ అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ పరిస్థితుల్లో గగనతల మార్గంలో కొన్ని దేశాలు ఆహారం సరఫరా చేస్తున్నప్పటికీ ఆ పరిమిత సరఫరాలు ప్రజల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీంతో ఆకలిబాధలు తట్టుకోలేక ప్రజలు గాజాకు వస్తున్న ఆహార సహాయ వాహనాలను మధ్యలోనే అడ్డుకుని మీదపడి దోచుకుపోతున్నారు. ఇప్పటివరకూ గాజాలో మృతులసంఖ్య 61వేలకు చేరువలో ఉంది. ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన 22 నెలల్లో ఇజ్రాయెల్ సైనికులు 18,500 మంది పాలస్తీనియన్లను అరెస్టు చేశారు.



## రష్యా—చైనా నావికుల సీ—2025 ఉమ్మడి సైనిక విన్యాసాలు



**వ్లాడివోస్టోక్ :** రష్యా—చైనా నౌకాదళాలు ఉమ్మడిగా బహుముఖ సైనిక విన్యాసాలను (సీ—2025) ఆదివారంనాడు ప్రారంభించాయి. రష్యా వ్లాడివోస్టోక్ సమీప సముద్ర జలాల్లో ఈ విన్యాసాలు ప్రారంభమైనట్లు చైనా నావికాదళ నిపుణుడు ఒకరు ఆదివారంనాడు చెప్పారు. ఈ విన్యాసాలలో భాగంగా నావికులకు మరింత ఎక్కువమందికి జలాంతర్గాముల నిర్వహణలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించినట్లు పిఎల్ఏ న్యూస్ మీడియా సెంటర్‌కు ఆయన చెప్పారు. రష్యాకు సమీపంలో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శుక్రవారంనాడు ఆ దేశ నౌకాదళానికి ఆదేశాలు ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఉక్రేన్ విషయంలో ఒత్తిడి పెంచడంకోసం ఆయన దూకుడు చర్యలకు పాల్పడ్డారు. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్దెదేవ్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడిన ట్రంప్ జలాంతర్గాములను మోహరించాలని ఆదేశించిన నేపథ్యంలో చైనా—రష్యా నౌకాదళాల ఉమ్మడి విన్యాసాలు ప్రారంభం కావడం ఒక కీలక పరిణామం. ఐతే ఈ విన్యాసాలు రష్యా—చైనా మధ్య సాధారణంగా జరిగే వార్షిక సహకార ప్రణాళికలో ఒక భాగమేనని చైనా రక్షణమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి సీనియర్ కల్నల్ ఝాంగ్ ఝియావో గాంగ్ ఆదివారం నాడు రోజువారీ పత్రికాగోష్ఠిలో చెప్పారు.2012 నుండి ప్రతి సంవత్సరం ఈ వార్షిక విన్యాసాలు జరుగుతున్నాయి.ఈ విన్యాసాల ద్వారా తదుపరి రెండు దేశాల నావికులమధ్యా మరింత సహాయం, ఆదానప్రదానాలు పెరుగుతాయని ఆయన ఆశించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఈ సైనిక విన్యాసాలు ప్రారంభమయ్యాయి. మొదట పోర్టు నుండి రష్యా టగ్ బోట్లు, రెస్క్యూ షిప్‌లు, చైనా 052 డి గైడెడ్ క్షిపణి విధ్వంసక వ్యవస్థలు, రష్యాకు చెందిన జలాంతర్గాముల విధ్వంసక నౌకలు లోతైన జలాల్లోకి విన్యాసాల నిమిత్తం తరలివెళ్ళాయి. తర్వాత ఉమ్మడి ప్రణాళిక ప్రకారం రెండు దేశాలకు చెందిన నావికులు తారుమారై ఏకమైపోయి విన్యాసాలు నిర్వహించారు. సముద్రాంతర ప్రాంతాలలో సంచరించేటప్పుడు ఎదురయ్యే కొన్ని పరిస్థితుల్లో కావాల్సిన సమాచారాన్ని రెండు దేశాల నావికులు ఇచ్చిపుచ్చుకున్నారు. వాటి గురించి చర్చించారు. నట్టనడిసముద్రం మధ్యలో గగనతల కార్యకలాపాలను నౌకా కార్యకలాపాలను అనుసంధానంచేసే ప్రక్రియలపై కూడా విన్యాసాలు నిర్వహించారు. జలాంతర్గాముల రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించారు. రెండు దేశాల నావికులూ ఉమ్మడిగా జలాంతర్గాములను ప్రతిఘటించే విన్యాసాలు ప్రాక్టీస్ చేశారు.

## పరిశ్రమ కుదేలు!

(మొదటి పేజీ తరువాయి)

రాయల్టీ పెనుభారం నిర్ణయాన్ని ఉపసహరించుకోకుంటే గ్రానైట్ పరిశ్రమ అంటే వెలుగు వెలిగిన కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలో దివాలా తీసే పరిస్థితి వస్తుందంటూ యాజమాన్యాలు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 297 గ్రానైట్ లీజులు ఉండగా వీటి పరిధిలో 977 హెక్టార్లలో గ్రానైట్ వెలికి తీస్తున్నారు. క్వారీల నుంచి 100 నుంచి 150 కోట్ల విలువ చేసే 50 వేల నుంచి 70 వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను వెలికి తీసి చైనాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలోని బావుపేట, కాజీపూర్, కమాన్‌పూర్, ఒద్యారం, ఆచంపల్లి గ్రామాల్లో కటింగ్ అండ్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న గ్రానైట్ 50 వేల క్యూబిక్ మీటర్లు విదేశాలకు ఎగుమతి అవుతుండగా 20 వేల క్యూబిక్ మీటర్లు మాత్రం స్థానికంగా ఉన్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లకు వినియోగిస్తున్నారు. దేశంలోని సుమారు 8 రాష్ట్రాలకు చెందిన ప్రజలు వివిధ విభాగాల్లో కార్మికులుగా పని చేసేందుకు వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. 2014లో 300 మేరకు క్వారీలు నడవగా ప్రస్తుతం 60 క్వారీలు మాత్రమే పనిచేస్తున్నాయి. క్వారీలు అన్ని ఉత్పత్తి చేసినప్పుడు 24 లక్షల టన్నుల గ్రానైట్ ఎగుమతి కాగా ఇప్పుడు ఈ క్వారీల నుంచి 10 లక్షల టన్నుల గ్రానైట్ మాత్రమే ఎగుమతి అవుతోంది. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ జులై 8న విడుదల చేసిన జీవో నెంబర్ 14 ప్రకారం బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ మైనింగ్‌పై సీనరేజస్ చార్జీలను 20 శాతం పెంచింది. దీని ప్రకారం కలర్ గ్రానైట్ గ్యాంగ్సా రేటు రూ.1128/రూ.2990 నుంచి రూ.1354/రూ.3588కి పెరిగింది. బ్లాక్ గ్రానైట్ గ్యాంగ్సా రేటు రూ.1361/రూ.3900 నుంచి రూ.1633/రూ.4680కి పెరిగింది. ఫలితంగా ఒక్క మీటర్ క్యూబ్ గ్రానైట్‌పై రూ.1435 అదనపు భారం పడుతుంది.

**నిర్వహణలో అదనపు భారం**

2022లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 18, 21 ద్వారా 30 శాతం రాయల్టీ పెంచిన నేపథ్యంలో ఇప్పటి వరకు మొత్తంగా 88 శాతం భారంగా మారిందని వాపోతున్నారు. రాయల్టీపై అదనంగా 40 శాతం వసూలు చేస్తున్న పర్మిట్ ఫీజు పరిశ్రమపై మరింత భారం మోపుతోంది. కాగా ఇది ఇతర రాష్ట్రాల్లో అమలు లేకపోవడంతో తెలంగాణలోని పరిశ్రమలు పోటీ పడలేక కుదేలవుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న 20 శాతం డిఎంఎఫ్ చార్జీలను ఎపి, ఒడిశా, కర్నాటకలో 10 శాతానికి పరిమితం చేయడంతో ఇక్కడి పరిశ్రమకు మార్కెట్ భారంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన సీనరేజ్ పన్ను కలుపుకుని అమ్మకం ధరలో 65 శాతానికి పైగా ఖర్చవుతోందని వాపోతున్నారు. వరుసగా ఎదురవుతున్న నష్టాలను భరించలేక ఇప్పటికే చాలా క్వారీలు మూతపడ్డాయని, క్వారీ నిర్వాహకులు అప్పుల్లో కూరుకుపోయారని , ప్రభుత్వం వెంటనే పునరాలోచించి పెరిగిన చార్జీలను తగ్గించాలని కోరుతున్నారు.

**ఉపాధిపై తీవ్ర ప్రభావం**

ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రస్తుతం ఉన్న పన్నులు తగ్గించి 10 శాతం మేరకు మాత్రమే పన్నులు వసూలు చేస్తుండడంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బయ్యర్లు అక్కడికి వెళ్లి గ్రానైట్ బ్లాక్స్ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో పన్ను మినహాయింపు ప్రాంతాల వైపు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 14ను తక్షణం ఉపసంహరించాలని, జీవో నెంబర్ 4 (2023) ద్వారా ఇచ్చిన రెండు సంవత్సరాల ఉపశమన గడువును మరింత పొడిగించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. పర్మిట్ ఫీజును పూర్తిగా రద్దు చేసి రాయల్టీ, సీనరేట్ చార్జీలు 40 శాతం వరకు తగ్గించాలని కోరుతున్నారు. ఆంధ్రా, ఒడిశా, కర్నాటకలో అమలులో ఉన్న మాదిరిగా డిఎంఎఫ్ చార్జీలు 30 శాతం నుంచి 10 శాతానికి తేల్చాలని డిమాండ్ చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడి వలస కార్మికులు, కూలీలు, ట్రాన్స్‌పోర్టర్లు, మెషినరీ టెక్నీషియన్లు, ముడిసరుకుల సరఫరాదారులు వేలాది మంది జీవిస్తున్నారు. తాజా నిర్ణయాలతో పరిశ్రమలో ఉపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని యజమానులు వాపోతున్నారు.

**పరిశ్రమలు నడిపేదెలా?**

**విజయ భాస్కర్, క్వారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

ప్రభుత్వం పెంచిన రాయల్టీతో పరిశ్రమలను మూసి వేసుకునే పరిస్థితి వచ్చింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ రాయల్టీ ఫీజు పెంచడంతో బయ్యర్లు సైతం రావడం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 14, 16 వల్ల గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ మరింత కష్టంగా మారింది. ఇప్పటికే అనేక సార్లు పెంచగా ఇబ్బందుల మధ్య పరిశ్రమలు నడిపిస్తున్నాం. పరిశ్రమలు మూతపడితే అనేక మంది ఉపాధి కోల్పోయే అవకాశముంది. ప్రభుత్వం వెంటనే జీవోను ఉపసంహరించుకుని పరిశ్రమలను కాపాడాలి.

## తరలింపు సాగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని 95 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ కార్డును కూడా అమలు చేస్తున్నామన్నారు. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందిస్తున్నామన్నారు. ముదిగొండ మండలంలో 84 శాతం ఇండ్లకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని 22500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. 104 సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నామని మహిళలకు 21వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. రానున్న మూడేళ్లలో మరో రూ. 80వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. అంతకు ముందు ముదిగొండ మండలం కమలాపురంలో 10వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ నిర్మాణానికి పెద్దమండవ గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నాగార్జున సాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందక నష్టపోతున్నామని తెలిపిన భట్టివిక్రమార్క సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ఎండి లక్ష్మి , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, సిపి సునీల్ దత్, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వల్లెవేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

పదాలనే ఆమె వల్లె వేస్తున్నారని జగదీష్ రెడ్డి ఆదివారం తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో 25ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, ఎన్నికల విజయాలకు తనదే బాధ్యత అయితే, ప్రస్తుత ఓటమికి కూడా తానే బాధ్యుడనని అన్నారు. ఏదైనా అంతిమంగా పార్టీనే ఫైనల్ అని, వ్యక్తులుగా ఏదో చేస్తామంటే వారి భ్రమ అని, కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారని, కానీ తాను అలా కాదని, పార్టీకి సైనికుడినని తెలిపారు. తాను ఈ మధ్య కాలంలో కెసిఆర్‌ను 50 సార్లు కలిశానని, వారి గురించి మాట్లాడటం వృధా అని చెప్పానని, బనకచర్ల, వ్యవసాయరంగానికి సంబంధించిన అంశాలపైనే తాను కెసిఆర్‌తో చర్చించామని జగదీష్ రెడ్డి తెలిపారు. కెసిఆర్ లేకపోతే ఎవ్వరూ లేమని, అందులో ఎటువంటి సందేహమూ లేదని స్పష్టం చేశారు. తాను చావుతప్పి కన్నులొట్టబోయినట్టుగా గెలిచానని, కానీ కొంతమంది అది కూడా గెలవలేదు కదా?,అని ఎద్దేవా చేశారు. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని, తాను చూసి ఉంటే స్పందించేవాడినని జగదీష్ రెడ్డి తెలిపారు.

## ఎందాకైనా పోరాడతాం

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు,ప్రభుత్వ సలహా హర కర వేణుగోపాల్ ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణారావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అక్కడ అంబేద్కర్ చౌరస్తాలోని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుల కృషి మేరకు రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు కోటీ పది లక్షల రూపాయలు మంజూరు చేశామని ,రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా 75 కోట్లు ఖర్చు చేసి అంతర్గాం, ముర్మూరు, బ్రాహ్మణ పల్లి ,ఎల్లంపల్లి సోమనపల్లి, మద్దిరాల, తొట్యాలపురం మొదలగు గ్రామాలకు, 17 ఎల్ ద్వారా కుక్కల గూడూరు, నిట్టూరు గ్రామాలకు మొత్తం 13 వేల పైగా ఎకరాలకు నీరు చేరుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మంథని నియోజకవర్గం, పెద్దపల్లి జిల్లాకు ఒక ఎకరాకు నీరు అందించలేదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెడ్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం లక్ష కోట్లు వృథా చేసిందని అన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టు 38 వేల కోట్లతో నిర్మించి ఉంటే నేడు గోదావరి పరివాహక ప్రాంతంలో కరువు ఉండేది కాదని, గత ప్రభుత్వం దోపిడి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని తెలిపారు. 3 బ్యారేజీలు ఫౌండేషన్ బలహీనంగా ఉందని, అక్కడ నీరు నిల్వ చేస్తే 44 ఊర్లు , భద్రాచలం కొట్టుకొని పోతాయని ఎన్.డి.ఎస్.ఏ రిపోర్ట్ అందించిందని అన్నారు. 3 బ్యారేజీల మరమ్మతు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని,వ్యవసాయ శాఖ, నీటీ పారుదల ప్రాజెక్టు సమన్వయంతో 3 బ్యారేజీలు నిరూపయోగంగా ఉండగా గత సంవత్సరం రికార్డు స్థాయిలో 2 కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని అన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు నాయకులు ఇచ్చిన హామీల అమలు మేరకు ఉమ్మడి జిల్లా మంత్రిగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. రేషన్ కార్డులు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ పంపిణీ చేస్తామని అన్నారు.

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో లక్షాధికారుల చేయాలని లక్ష్యంతో పని చేశామని, నేడు మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. బండ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో అనేక ధర్నాలు చేశామని అన్నారు. ప్రస్తుతం గత ప్రభుత్వాల తప్పిదాలను సరి చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం రైతులు అధిక ఆదాయం సంపాదించాలనే లక్ష్యంతో ఆయిల్ పామ్ విస్తరణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ,రైతు ఆదాయ వనరులు పెంచే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని రావాలని, రామగుండం ప్రాంతంలో ఎన్టిపిసి, సింగరేణి, ఆర్.ఎఫ్.సి.ఎల్, కేశారాం సిమెంట్ వంటి పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడ ప్రైవేట్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేస్తామని,రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ప్రతి నీటి చుక్కను ఉత్తర తెలంగాణ ప్రాంతాలు వాడుకునేలా ప్రణాళికలు చేయాలని అన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే కోరిక మేరకు స్థానిక బస్ స్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17ఎల్, 27 ఎల్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యం అవుతుందని అన్నారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజల చిరకాల వాంఛ రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రామగుండం ప్రాంతంలో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మించాలని కోరారు. స్థానికంగా ధాన్యం నిల్వ చేసేందుకు అదనపు గోడౌన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 2 గంటలే ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

రూ. 650 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. కెటిఆర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని చెబుతున్నారని, అయితే ఉప్పల్ నారపల్లి ఫ్లైఓవర్‌ను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పదేళ్ల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని, బంగారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణను చేసిందని దుయ్యబట్టారు. ప్రజలే దేవుళ్లుగా మారి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని ఆయన అన్నారు.

**బిసి రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు**

బిసి రిజర్వేషన్ల గురించి కెసిఆర్ కుమార్తెకు ఏం సంబంధం అని ప్రశ్నించిన మంత్రి, గత పదేళ్లు బిసిల గురించి ఎందుకు మాట్లాడలేదని బిఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. ఎవరెవరికి ఎంత ఇవ్వాలో వారికే ఇస్తామనేది తమ ఇందిరమ్మ ప్రభుత్వ విధానమని చెప్పారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.

## చట్టం చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్లమెంటులో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి, చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ ధర్నాకు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రిజర్వేషన్ల విషయంలో సిఎం ఏకపక్షంగా వ్యవహరించకుండా అందరినీ కలుపుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైన ఒత్తిడి పెంచే విధంగా ఐక్య పోరాటాన్ని చేపట్టాలని జాన్‌వెస్లీ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన ఆధారంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపిస్తే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదని ఆరోపించారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ వద్దకు పంపిస్తే ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు పార్లమెంటులో రిజర్వేషన్లకు అనుకూలంగా వ్యవహరించకపోతే వారు తమ పదవులకు రాజీనామా చేసే విధంగా ఒత్తిడి పెంచేలా ఆందోళనా కార్యక్రమాలకు పూనుకోవాల్సి వస్తుందని జాన్‌వెస్లీ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ నాశనం

(మొదటి పేజీ తరువాయి)

చివరి నిమిషంలో అనుకోకుండా గెలిచిన సీటు అని కవిత ఎద్దేవా చేశారు. ఎన్నడూ ప్రజా ఉద్యమాలు చేయలేదని, కెసిఆర్ లేకపోతే ఆ లిల్లీపుట్ నాయకుడు ఎవరని ప్రశ్నించారు. మనలో మనకు అయోమయం ఉన్నప్పుడు ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడవచ్చునా అని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు చేపట్టనున్న 72 గంటల నిరాహారదీక్షకు అనుమతి ఇవ్వాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనపైన వ్యాఖ్యలు చేపించే కుట్రకు పాల్పడిన ఆ నాయకుడు తన (కవిత) వద్ద పది మందిని పెట్టి ఇక్కడ జరిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తీసుకుంటున్నానని చావు తెలివితేటలను ప్రదర్శిస్తున్నారని, కానీ అక్కడ (బిఆర్ఎస్) ఏం జరుగుతుందో కూడా తనకు సమాచారం వస్తుందని, ఏ సమయంలో ఎవరిని కలిశారు..? అన్నీ తనకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తనను ఒంటరి చేసి ఏదో చేయాలనుకుంటున్నారన్నారు . సిఎం రమేష్ స్వయంగా బయటికి వచ్చి మాట్లాడడం, తాను కెసిఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడం ఈ రెండింటికీ అవినవభావ సంబంధం ఉన్నదని భావించే పరిస్థితి వస్తుందన్నారు. తన తండ్రి కెసిఆర్‌కు అంతరంగిక రాసిన ఉత్తరాన్ని బయటపెట్టి, పార్టీలోని అంశాలను బహిర్గతం చేసింది ఎవరు?, తనను మాట్లాడేందుకు ఫోర్స్ చేసి, ఇప్పుడు దాని చుట్టూ డ్రామాలు ఆడుతున్నారని కవిత మండిపడ్డారు.

ఉద్యమంలో తమను బంధించినవారే.. బిఆర్ఎస్‌లో పదవులు పొందారు...

నిన్న గాక మొన్న పార్టీలోకి వచ్చిన ఒక చిన్న పిలగాడు కూడా ఎటుపడితే అటు మాట్లాడుతున్నారని, 'అసలు మీరేవరు..?తెలంగాణ ఉద్యమంతో మీకు సంబంధం ఏమిటి..?, బిఆర్ఎస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత బిఆర్ఎస్‌లో చేరి. పదవులు పొంది, ఉల్టా తమపైనే మాట్లాడుతారా? తాము ఉద్యమించిందే మీ మీద కదా?' అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిలగాడు చిన్న పిలగాని తరహాలోనే ఉండాలని, పెద్దవారి విషయంలో తల దూర్చవద్దని హితువుపలికారు. తాము ఉద్యమాలు చేసి బతుకమ్మ తీసుకుని వెళ్తుంటే తమను బంధించిన వారే, బిఆర్ఎస్ అధికారంలోనికి రాగానే తమ పార్టీలో చేరి, పదవులను అనుభవించారని, అలాంటి వారు తమపైనే వేలు ఎత్తి చూపిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారికి పదవులు ఇచ్చారు కాబట్టే తెలంగాణ వాదులు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అవినీతి కాంగ్రెస్ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలి: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 20 నెలల అసమర్థ, అరాచక, అవినీతి పాలనకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. రానున్న ఉప ఎన్నికల్లో అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలు కూడా ఆగిపోతాయని, కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న మోసాలు, కుంభకోణాలను ప్రజలు అంగీకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ భావించి, అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిలిపివేస్తుందని కెటిఆర్ ఆరోపించారు. జూబ్లీహిల్స్ దివంగత ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా మరోసారి జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ జెండా ఎగురవేద్దామన్నారు.



తెలంగాణ యూనివర్సిటీల అభివృద్ధిలో కాంట్రాక్ట్ అధ్యాపకుల పాత్రపై ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చేయూత

### జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క


**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహిళల అభ్యున్నతి కోసం సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబనతో ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి అనసూయ సీతక్క మహిళలకు పిలుపునిచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం విస్తృత స్థాయిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. మోసా, చందూర్ మండల కేంద్రాలలో నూతనంగా నిర్మించిన సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదివారం ప్రారంభోత్సవాలు చేశారు. అదేవిధంగా మోస్రాలో జనరల్ ఫంక్షన్‌హాల్, చందూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ బాలరాజ్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి లబ్దిదారులకు రేషన్ కార్డుల మంజూరి పత్రాలు, స్వయం సహాయ మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సును కాంక్షించే ప్రభుత్వమని, అందుకే అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వసతులతో కూడిన మండల కార్యాలయాల సమీకృత భవన సముదాయాలను నిర్మించటంతో నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇల్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో అమలవుతున్నాయన్నారు. పోడు పట్టాలను ఇప్పటికే అర్హులను గుర్తించి పంపిణీ చేశామని ఇంకను కొంత మంది అర్హులు మిగిలి ఉన్నందున వారికి కూడా పోడు పట్టాలు అందించేందుకు చొరవ చూపాలని పోచారం మంత్రిని కోరగా సీతక్క సానుకూలంగా స్పందించారు. కార్యక్రమాల్లో సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, డీపీఓ శ్రీనివాస్‌రావు, పంచాయతీ రాజ్ ఈఈ శంకర్, సంబంధిత శాఖల అధికారులు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల చైర్మన్లు, ప్రజలు పాల్గొన్నారు.



## పేదలందరికీ సంక్షేమ ఫలాలు

### రేషన్‌కార్డుల పంపిణీలో మంత్రి వివేక్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అంధించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఆధునికరణ కోసం రాష్ట్రంలో రూ.25 కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. పది వేల మంది ఉపాధాయులను నియమించి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ఎన్నికల్లో హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే ప్రజలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గానికి మొదటి విడతో 35 వందల ఇల్లు మంజూరైనప్పటికి అధిక సంఖ్యలో లబ్దిదారులున్నందున రెండవ విడతలో పేర్లు వచ్చిన స్వంత స్థలం ఉన్న వారందరికి ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. రానున్న కాలంలో ఇల్లు లేని పేదలందరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ నియోజక వర్గంలో పది వేల ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేయగా, ఇప్పటికి 8 వేల ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే గజ్వేల్ నియోజక వర్గంలో నాలుగు వేల రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గజ్వేల్ మాజీ ఎంఎల్ఎ,డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ హమీద్, ఆర్డీఓ చంద్రకళ, డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డి,మాజీ అధ్యక్షులు ఎలక్షన్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మాజీ అధ్యక్షులు భూంరెడ్డి, ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సిపిఐ నాయకులు దయానందరెడ్డి, నాయకులు మునీర్, గాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాష, కరుణాకర్, భానుప్రకాష్ రావు,ఆజీస్ తదితరులు పాల్గొన్నారు.




**రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి**

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జగదేవ్‌పూర్ మండల రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంత్రి వివేక్ వెంకటస్వామికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఆదివారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి మండల రేషన్‌డీలర్లు పలు సమస్యలను వివరిస్తూ మెమోరాండం అందజేశారు. కాంగ్రెస్‌పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్‌డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంపు, పర్మినెంట్ ఆథరైజేషన్, హెల్త్ కార్డులు, రేేన్‌దుకాణాల నిర్వహణకు ప్రభుత్వ భవనాలు కేటాయించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షకార్యదర్శులు రమేష్, అన్నపూర్ణ నర్సింలు, డీలర్లు మునీర్, సత్యం పరమేశ్వర్, రాజేందర్, ఎల్లారెడ్డి, ఈదిరెడ్డి, సురేష్, వెంకటేష్, అశోక్, అనంతం, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు త్వరలోనే 'హెల్త్ కార్డులు'

### ప్రతి మూడు నెలలకూ 'ఆరోగ్య సమీక్షలు'
### సెప్టెంబర్ 5 నుంచి అన్ని గురుకులాల్లో ఒకే రకమైన భోజనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో ఆహారం, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు తీసుకుంటుంది. నాణ్యమైన ఆహారం విషయంలో ఇప్పటికై 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్, పారదర్శక టెండర్' విధానాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, త్వరలోనే గురుకుల విద్యార్థులకు 'హెల్త్ కార్డ్'లు ఇవ్వనుంది. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖతో పలుమార్లు సంప్రదింపులు జరిపింది. ప్రస్తుతం గురుకులాల్లో చేరుతున్న విద్యార్థులలో కొందరికి ఇదివరకే రక్తహీనత, లాంటి పలు సమస్యలు ఉంటున్నాయని, అలాంటి వారు గురుకులాల్లో చేరిన తర్వాత ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుందని, సదరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేలోపే పరిస్థితులు విషమిస్తున్నాయని సంక్షేమ శాఖ గుర్తించింది. దీంతో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి హెల్త్ కార్డులను ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి విద్యార్థి బరువు, హెమోగ్లోబిన్ స్థాయి, బిఎంఐ వంటి వివరాలను ఆ 'హెల్త్ కార్డ్'లో పొందుపర్చనున్నారు. ఇలాంటి ఆరోగ్య సమస్యలను త్రైమాసికం సమీక్షించి, ఆహారం అలవాట్లతో ఆరోగ్యంలో వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సంక్షేమ శాఖ నిర్ణయించింది. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు రక్త హినత సమస్య ఉన్నదనే విషయం తల్లిదండ్రులకు కూడా తెలియదని, అందుకే గురుకులాల విద్యార్థుల ఆరోగ్యం విషయంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావించింది.




**సెప్టెంబర్ 5 నుంచి అన్ని గురుకులాల్లో ఒకే రకమైన ఆహారం**

సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న లక్షలాది విద్యార్థులకు రుచికరమైన, పరి శుభ్రమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించే ఉద్దేశంతో చేపట్టిన 'సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్, పారదర్శక టెండర్ పక్రియ' అమలును వేగవంతం చేసింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్ల టెండర్ పక్రియ ముగిసింది. సెప్టెంబర్ 5 నుంచి కొత్త కాంట్రాక్టర్లు ఆహార ఇతర వస్తువులను సరఫరా చేయనున్నారు. అన్ని గురుకులాల్లో ఒకే రకమైన నాణ్యమైన, పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందనుంది. రాష్ట్ర స్థాయిలో అవసరమైన అన్ని పదార్థాలను కూడా ఒకే ప్రమాణం, ఒకే రేటుకు కొనుగోలు చేసి, జిల్లాల వారికి పంపించనున్నారు. తద్వారా నాణ్యమైన సరఫరా సజావుగా, సమయానికి జరుగుతుందని సంక్షేమ శాఖ భావిస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వారీగా వేర్వేరు సరఫరాదారులపై ఆధార పడే విధానంతో నాణ్యత వ్యత్యాసాలు, రవాణ లోపాలు, రేట్ల భేదాలు ఉండేవని, కొన్నిసార్లు సరఫరా ఆలస్యం జరిగి, పదార్థాల నాణ్యత తగ్గిపోవడం వంటి సమస్యలు వచ్చేవని అధికారులు తెలిపారు. సరఫరా చేసే ఏజెన్సీలు నాణ్యత, పరిమాణం, సమయపాలన తప్పని సరిగా పాటించాలని, ఇందుకు డాష్‌బోర్డ్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.అలగు వర్షిని స్పష్టం చేశారు.

**నిబంధనలు ఉల్లంఘించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు**

ఆహార నాణ్యత కోసం స్టీమ్ కుకింగ్ తప్పనిసరి చేశారు. వండిన పదార్థాలను స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలలోనే నిల్వ చేయాలని, ప్లాస్టిక్, అల్యూమినియం పాత్రలకు పూర్తిగా నిషేధించాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రతి నెలా యాదృచ్ఛికంగా ఆహార నమూనాలు సేకరించి, గుర్తింపు పొందిన ఫుడ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇది వరకే సంక్షేమ శాఖ హెచ్చరించింది.

### ప్రతి పౌరుడు సాయుధ బలగాల..
## త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'మన వీరులకు వందనం ఆపరేషన్ సింధూర్' పేరిట దేశ భక్తిని చాటి చెప్పే ఒక ప్రత్యేక కార్యక్రమం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ)లో జరిగింది. అఖిల్ భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఎబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, దేశ సేవలో తమ ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగానికి, ధైర్యసాహసాలకు ఘన నివాళి అర్పించింది. ప్రత్యేకించి పహెల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లలోని అనేక ఉగ్రవాద శిబిరాలపై భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్‌పై ఈ కార్యక్రమంలో ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, డిఆర్‌డిఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి, ఏబిఆర్ఎస్ఎమ్ జాతీయ సంయుక్త సంఘటనా కార్యదర్శి గుంథా లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ దేశ యువతతో పాటు ప్రతి పౌరుడు సాయుధ బలగాల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి అనేది ఒక నినాదం కాదని, అది ఒక జీవన విధానమన్నారు. డాక్టర్ జి.సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఉపయోగించిన సుదూర డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ వంటి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రశంసించారు. నేడు భారత్ సాంకేతికంగా బలమైన, ఆత్మనిర్భర్ దేశమని ఆయన అన్నారు. గుంథా లక్ష్మణ్ ఏబిఆర్ఎస్ఎమ్ పాత్రను వివరిస్తూ, ఈ సంస్థ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) 2020కి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శౌర్య గీతం, సెల్యూటింగ్ ది సోల్జర్స్, ఏ సాంగ్ ఆఫ్ సాక్రిఫైస్ అనే థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ పాటకు బల్లెపల్లి మోహన్ సంగీతం అందించి, గానం చేయగా, సాహిత్యాన్ని అగరం వసంత (హోసూరు), రమణ వనమాల అందించారు. పాటలోని తెలుగు భావాన్ని చెక్కుచెదరకుండా ఆంగ్లంలోకి అనువదించి గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ డాక్టర్ వంగీపురం శ్రీనాథ చార్యులు అందించారు. రవి వర్మ పోతేదార్ ఈ పాటకు మెలోడీ సమన్వయం చేశారు.

## తప్పుదోవ పట్టిస్తున్నారు!

### ఎపి మంత్రి నారా లోకేష్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బనకచర్లపై ప్రాంతీయతత్వం రెచ్చగొడుతున్నారని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలను తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. నీటి లభ్యతపై సరైన అవగాహన లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ నికరజలాలు, మిగులు జలాలు, వరద జలాల గురించి లోకేష్ ముందు తెలుసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ట్రిబ్యునల్ నిర్ణయం ప్రకారం తెలంగాణకు 968 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 531 టిఎంసిల నికర జలాలు కేటాయించిన తర్వాతే మిగులు జలాలు, ఆ తర్వాత వరద జలాల గురించి ఆలోచించాలని స్పష్టం చేశారు. వరద జలాల లభ్యతపైన ప్రాజెక్టుల నీటి వినియోగం పూర్తయిన తర్వాతే వరద జలాలు లెక్కలోకి వస్తాయన్నారు. ఈ విషయం తెలియకుండా ప్రజలను మభ్యపెట్టి, ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసే విధంగా లోకేష్ ప్రయత్నిస్తున్నారని మంత్రి ప్రభాకర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, ట్రిబ్యునల్ నిర్ణయించిన విధంగా తెలంగాణకు ఉన్న నీటి హక్కులను ఒక్క చుక్క కూడా వదులుకోమని ఆయన తేల్చి చెప్పారు. నీటికి సంబంధించిన అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య గతంలో నెలకొన్న పరిస్థితులు మళ్లీ తీసుకురావడం మంచిది కాదని ప్రభాకర్ అన్నారు. ప్రజలను మోసం చేసే విధంగా తప్పుడు సమాచారం ఇవ్వద్దని మంత్రి హితవు పలికారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చాకే అభివృద్ధి అవుతుందని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. జనహిత పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆర్మూర్‌లో పాదయాత్ర చేసిన తర్వాత పివిఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాకే మెరుగైన అభివృద్ధి జరుగుతుందన్నారు. అర్గుల్ గ్రామానికి పెట్టింది పేరని, ఇక్కడి నుంచి అర్గుల్ రాజారాం మంత్రిగా వ్యవహరించారన్నారు. నాణ్యమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, రైతులకు ఇస్తుందని చెప్పారు. రైతులకు 20 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదవాడి కళ అని పేదవాడి కలను తీర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో నాయకులు మీనాక్షి నటరాజన్, సంపత్‌కుమార్, షబ్బీర్ అలీ, సీతక్క, సుదర్శన్ రెడ్డి, సురేష్, భూపతిరెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ కళాశాలలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

### ఘటనాస్థలంలో సూసైడ్ నోట్ లభ్యం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నయీమ్‌నగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి శివాని (16) ఎంపిసి మొదటి సంవత్సరం విద్యార్థినీ కళాశాల ప్రాంగణంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందించకుండా కళాశాల యాజమాన్యం నేరుగా వరంగల్ ఎంజి ఎం ఆసుపత్రి మార్చురీకి తరలించింది. ఈ చర్యపై శివాని కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులలోనూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాగా ఘటనాస్థలంలో ఒక సూసైడ్ నోట్ లభించింది. అందులో కళాశాలలో చేర్చే ముందు ఒక్కసారి ఆలోచించాల్సింది అంటూ.. ఆ చదువు నాకు అర్థం అవుతలేదు అని, తన తల్లిదండ్రులు ఇంత ఫీజ్ కట్టి చదువిస్తున్నా నాకు సరైన మార్కులు రావడం లేదని శివాని తన మనోవేదనను వ్యక్తం చేసింది. ఈ కార్పొరేట్ విద్యా విధానమే తన చావుకు కారణం అని ఆ లేఖలో స్పష్టంగా తెలియచేసింది. అంతేగాక ఈ లేఖతో మరింత అనుమానాలు ముదిరాయి. పూర్తి విషయాలను వెలికితీసేందుకు పోలీసులు విచారణ ప్రారంభించారు. కళాశాల యాజమాన్యం నుంచి ఇప్పటివరకు అధికారిక స్పందన రాలేదు.




**విద్యార్థి ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు....**

విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఈ ఘటనపై సీరియస్‌గా స్పందిస్తూ, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, వారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ప్రాణాలతో చెలగాటమాడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో శివాని మృతదేహాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థిని చావుకు కారణమైన విద్యాసంస్థ పర్మిషన్ రద్దు చేసి, కాలేజీని మూసివేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు.

## శృతి మించిన వైద్య దోపిడీ

### ఆరోగ్యశ్రీ ఉన్నా అక్రమ వసూళ్లు
### ఆరోపణలు వస్తేనే చర్యలు
### 'ప్రసూన'పై చర్యలకు జంకెందుకు...?

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరంలో వైద్య దోపిడీ శృతిమించుతుంది. కొన్ని ఆసుపత్రులు ప్రభుత్వ నియమ నిబంధనలను తోసిపుచ్చి తాము చెప్పిందే చట్టమన్న రీతిలో వ్యవహరిస్తున్నాయి. ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై స్పందిస్తున్నారు తప్ప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మిగిలిన సమయాల్లో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఖమ్మం ఆసుపత్రుల్లో కొన్నింటి పరిస్థితి దొరికితే దొంగ దొరకకపోతే దొర అన్న చందంగా తయారైంది. కొన్ని ఆసుపత్రులు పదే పదే పొరపాట్లు చేస్తున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఖమ్మంలోని ప్రసూన ఆసుపత్రి ఆరోగ్యశ్రీ పథకం ఉన్న అదనంగా డబ్బులు వసూళ్లు చేశారన్న ఆరోపణపై ఎవరో ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించలేని స్థితి. వైద్యంలో శృతి మించిన దోపిడీ జరుగుతున్నా దీనిని అరికట్టే వారు ఎవరన్న బాధితుల ప్రశ్నకు సమాధానం లేకుండాపోతుంది. ఇప్పుడు ఆసుపత్రి నిర్వహణ, వైద్యం అతిపెద్ద లాభసాటి వ్యాపారంగా మారింది. వైద్య వృత్తిని పవిత్రంగా సేవాభావంతో నిర్వహించేవారు. ఇప్పుడు వైద్యం కాసులు కురిపించే వృత్తిగా మారడంతో ఇప్పుడు ఆసుపత్రులను అడ్డుగా పెట్టుకుని వ్యాపారాలు నిర్వహించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. కొందరు వైద్యులైతే మానవత్వాన్ని మరిచిపోతున్నారు. ఎలా వీలైతే అలా డబ్బు గుంజే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో సిఎంఆర్ఎఫ్ నిధుల్లో అక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో ఖమ్మం పరువు తీసిన కొన్ని ఆసుపత్రులు ఏదో ఒక రకంగా అనుమతులు తెచ్చుకుని మరల అదే రీతిలో కొనసాగిస్తున్నారు. తాజాగా మార్వెల్ ఆసుపత్రి నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు కాజేసి ఇప్పుడు మూసివేతకు గురైంది. ఇంకా బయటకు రావాల్సిన ఆసుపత్రులు కొన్ని ఉన్నాయన్న ప్రచారం జరుగుతుంది. అవసరం ఉన్నా లేకున్నా ఆపరేషన్లు చేయడం, పరీక్షలు నిర్వహించడం చేస్తున్నారు. దీనిని నియంత్రించడం ఎలా అన్నది ఒక సమాధానం లేని ప్రశ్నగా మారింది. మారిన ఆహారపు అలవాట్లు, ప్రకృతి తీరు, వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యాధుల బారినపడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో సామాన్యులు వైద్య సాయం పొందటం తలకు మించిన భారంగా మారింది. ఆసుపత్రులను కాసుపత్రులుగా మార్చి కోట్లు గడిస్తున్నా అక్రమార్కులపై ఎక్కడో ఒక చోట చర్యలకు ఉపక్రమించకపోతే భవిష్యత్తులో రోగాల బారినపడిన పేద, మధ్యతరగతి ప్రజలు బతికే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు సైతం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని ఆసుపత్రుల్లో ఆర్ఎంపిలు చెప్పిన వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలపైన విచారణ జరగాల్సి ఉంది. మొత్తంగా వైద్యాన్ని సామాన్యుల దరికి చేర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రభుత్వ పరంగా వైద్య సాయం అందిస్తూ ప్రైవేటు వైద్య దోపిడీని నిలువరించాల్సిన బాధ్యత తమదేనన్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నకిలీ బిల్లులు, అక్రమ వసూళ్లకు పాల్పడిన ఆసుపత్రులను సీజ్ చేయడంతో పాటు వైద్యులను వైద్య వృత్తి నుండి బహిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



OFFICE OF THE DISTRICT COORDINATOR RAJIV AAROGYASRI HEALTH CARE TRUST KHAMMAM

Dated: 01.08.2025




## 'ఎంజాయ్ పేరుతో గంజాయి, డ్రగ్స్ సేవించొద్దు' సిడి ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామాలు, పట్టణాలోని కళాశాలలు, పాఠశాలలో గంజాయి, డ్రగ్స్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహా మండలి సభ్యులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఎంజాయ్ పేరుతో గంజాయి, డ్రగ్స్ సేవించవద్దు' అనే పాటల సీడిని హైదరాబాద్, రవీంద్రభారతిలోని తన చాంబర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నదని, యువతను సక్రమమైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ మత్తులో కూరుకుపోయి, పెద్ద చదువులు చదవాల్సిన విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై పాటలు రాసిన రచయిత పల్లె నరసింహను, పాటను పాడిన కళాకారులను మంత్రి జూపల్లి అభినందించారు.



## ప్రశాంతంగా ముగిసిన నీట్ పిజి పరీక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నీట్ పిజి పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంచ నీయ సంఘటనలకు చోటు చేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. ఆదివారం ఎస్‌వి ఇంజనీ రింగ్ కళాశాల నందు జరుగుతున్న నీట్ పిజి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం లోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నందు 179 మంది అభ్యర్థులకు గాను 171 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయ్యారని, అలాగే కోదాడ సన ఇంజనీరింగ్ కళాశాలలో 50 మంది అభ్యర్థులకు గాను 44 మంది హాజరయ్యారని, 6గురు గైర్హాజరైనట్లు తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయలత, తహసిల్దార్ కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కేటా యిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని సర్వేనేగూడెం, జనంపల్లి, ఇస్కిల్ల, కక్కిరేణి గ్రామంలో మంజూరైన ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముత్తిరెడ్డిగూడెం, జనంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం జనంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ గార్డెన్ అండ్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.





## గోపాల మిత్రల వేతనాలు విడుదల

### మంత్రి శ్రీహరిని కలిసి ధన్యవాదాలు తెలిపిన గోపాల మిత్రలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న గోపాల మిత్రల వేతనాలు ప్రభుత్వం విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేసిన గోపాలమిత్రలు మంత్రి వాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి గోపాల మిత్రల సంఘం అధ్యక్షులు మారబోయిన రవీందర్ ముదిరాజ్‌తో కలిసి గోపాల మిత్రలు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఆరు నెలల వేతనాలు గోపాల మిత్రల ఖాతాల్లో జమచేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిగతా వేతనాలు కూడా సరైన సమయంలో అందించి గోపాల మిత్రల జీవితాల్లో వెలుగులు నింపాలని, కుటుంబ పోషణ భారం కాకుండా ప్రభుత్వం ప్రతినెల వేతనాన్ని యధావిధిగా వేయాలని అన్నారు. గోపాల మిత్రలకు శాశ్వత ఉద్యోగ భద్రత, 10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం, స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతిభ కనబరిచిన గోపాల మిత్రలకు అవార్డులు అందించాలని మంత్రిని కోరారు. ఈకార్యక్రమంలో గోపాల మిత్రలు పల్స మహేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రాఘవేందర్‌గౌడ్, రమేష్, యాదగిరి, వెంకోజి, వెంకటేష్ పాల్గొన్నారు.

## క్రీమిలేయర్ ఎత్తివేయాలి : దూళిపాల



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బిసిల విద్యా,ఉద్యోగ రిజర్వేషన్‌లపైనున్న క్రీమిలేయర్‌ను ప్రభుత్వం ఎత్తివేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాల ధనుంజయ్ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలని, హైకోర్టు,సుప్రీం కోర్టుల జడ్జీల నియామకంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టాలని అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అయ్యేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్,రైతుసంఘం రాష్ట్ర సమితి సభ్యులు జక్కుల రమేష్,బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమరాజు వెంకట్ జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్‌క్లబ్ అభివృద్ధికి కృషి

### వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పబ్లిక్ క్లబ్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్‌క్లబ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ భూమిపూజలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేను కార్యదర్శిగా ఉన్నప్పుడు 51 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి పబ్లిక్ క్లబ్‌కు నెలకు మూడు లక్షల రూపాయల ఆదాయ మార్గం వచ్చే విధంగా చేశామన్నారు. గత సంవత్సరం ఇదే తారీఖున కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశామని, గత పాలకవర్గం చేసిన అవినీతిని తప్పిదాలను సరిచేయడానికి 6నెలల సమయం పట్టిందని, త్వరలో 365 రోజులు సూర్యాపేట పట్టణ ప్రజలకు, పబ్లిక్ క్లబ్ సభ్యులకు అందుబాటులో ఉండేలా స్విమ్మింగ్‌పుల్ నిర్మాణం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, పబ్లిక్ క్లబ్ ఉపాధ్యక్షుడు మద్రు హనుమంతరావు, కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు శెనగాని రాంబాబు, బత్తిని వెంకటేశ్వర్లు, ఫరిదోద్దిన్ అహ్మద్, పోలేబోయిన నర్సయ్య, గవ్వ కేశవరెడ్డి, రాచకొండ శ్రీనివాస్, నిమ్మల వెంకటేశ్వర్లు, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వం పంపిన అధికారుల నిర్లక్ష్యంతో నిరీక్షణ

**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధాప్య వికలాంగులు ఒంటరి మహిళలు వంటి పెన్షన్లు నెల చివర వారం కు నా బడ్జెట్ నిధులు మంజూరు చేస్తుంది. అధికారులు పోస్ట్ ఆఫీస్ వాళ్లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్య ధోరణి ప్రభావంతో పింఛన్ల కోసం నిత్యం పడిగాపులు కాశ పరిస్థితి ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఆశయాన్ని అధికారులు నీ రగారిస్తున్నారు. అనడంలో సందేహం లేదు. నెలకు 2016 రూపాయలు వస్తే టీఫిన్ కళ్లు సీసా మందు. వృద్ధులు నిత్యము ఉండేవారు. నెల చివర వచ్చిందంటే దారులు బాకీ ఇవ్వమని ఒత్తిడి చేస్తుంచారు. ఇంట్లో కుమారుని కుమార్తెను అడగాలంటే ఇష్టము ఉండదు నీ పెన్షన్ పైసలు వస్త వి కదా అని ఎదురు ప్రశ్ని చేస్తారనేది ఉంది. వృద్ధులు మౌనంగా ఉండిపోతారు. వికలాంగులు పనిపాటలు చేయలేరు వచ్చిన పెన్షన్లతోనే కాలం చెల్లిస్తారు. ఒంటరి మహిళలు ప్రభుత్వం ఇచ్చే 2016 రూపాయలు పొదుపు సంఘాల్లో ఉంటుంది పోదువుగా ఉపయోగించుకొని కుటుంబ పోషణ తదితర బాధ్యతలు తీసుకొని వంటి ఖర్చులు వాడుకుంటారు. ఇలా ప్రతి వారికి అందించే సహాయం ఎంతో ప్రయోజనకరంగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల పరిధిలోని బొంకూరు గ్రామం పంచాయతీ కార్యాలయం ముందు పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు కాస్తున్నారు. ప్రతినెల పింఛన్ డబ్బుల కోసం ఫింగర్స్ ప్రింట్ ముఖం దృశ్యమే కండ్ల దృశ్యం వంటివి రానప్పుడు పెద్ద సమస్యగా ఏర్పడింది. సెక్రెటీ బాధ్యతలతో మెలిగి ఫోటో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది ఇదంతా తిరుకాసుగా ఎందుకురా భగవంతుడా అని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తే ఎత్తేస్తున్నారు.



# కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు

### మునుగోడు నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడొద్దు
### ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** డబ్బుల కోసం కాంట్రాక్టర్ల కోసం నిర్మించింది కాళేశ్వరం ప్రాజెక్టు అని తుమ్మిడిహట్టి వద్ద నీరు లభ్యత ఉన్నా కూడా అది కాదని మేడిగడ్డ వద్ద నిర్మించారన్నారు. కాళేశ్వరంలో డిజైన్ లోపం, అశ్రద్ధ, నిర్లక్ష్యం, అవినీతి చోటుచేసుకుందన్నారు. కారకులు ఎంతటి పెద్ద వారైనా సరే ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం బంగారు గడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరవ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది సేవా కార్యక్రమం అని రాజకీయాలతో సంబంధం లేదు అని అన్నారు.మునుగోడు నియోజకవర్గం లో పేదలకు కంటి సమస్య అనేది ఉండకుండా చూస్తామని అన్నారు. రాబోయే కాలంలో మునుగోడు లోనే కంటి ఆసుపత్రి నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉచిత కంటి ఆపరేషన్ లు నిర్వహిస్తాం అని తెలిపారు.ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.గొర్రెల స్కాము, లిక్కర్ మాఫియా, గ్రానైట్ మాఫియా, ఇసుక మాఫియా, భూమాపియా లకు పాల్పడిన వారిని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొరిమి ఓంకారం, మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, వైస్ చైర్మన్ పాలు వెంకట్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పల్లె వెంకన్న, సిపిఐ జిల్లా నాయకురాలు మాజీ జెడ్పిటిసి మాధగోని విజయలక్ష్మి,ఎండి సుజావుద్దీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భూతరాజు ఆంజనేయులు, తలారి నరసింహ పాల్గొన్నారు.



## అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు : ఎమ్మెల్సీ నెల్లికంటి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి ఉద్యోగి నిబద్ధత అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల మననలు పొందుతారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పోలగోని యాదయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవం పట్టణంలోని రత్న ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సన్మాన మహోత్సవంలో ఎమ్మెల్సీ సత్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ప్రతి ఉద్యోగికి బదిలీలు,పదవి విరమణ సహజమని తాము పనిచేసే చోట ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడు వారిని ప్రజలు ఎప్పుడు గుర్తుపెట్టుకుంటారని గుర్తు చేశారు.బీసీ సంక్షేమ అధికారి యాదయ్య తనకు చిరకాల మిత్రుడన్నారు. తెలంగాణ జర్నలిస్టుల పోరం నాయకులు పల్లె రవికుమార్ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన యాదయ్య రాబోయే రోజులలో సామాజిక సేవా కార్యక్రమంలో ముందు భాగంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, నగరికంటి కాశయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, మునుగోడు మండల కార్యదర్శి చాపల శ్రీను, సూరిగి చలపతి, కైలాష్ తదితరులు ఉన్నారు.

# సాగర్‌కు స్వల్ప ఇన్ ఫ్లో... గేట్లు మూసివేత

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి వస్తున్న వరద ప్రవాహం బాగా తగ్గిపోవడంతో ఆదివారం అధికారులు ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేశారు. గత కొన్ని రోజులుగా రెండు లక్షలకు పైగా ఉన్న ఇన్ ఫ్లో క్రమంగా తగ్గుతూ ఆదివారానికి 48082 క్యూసెక్కులుగా ఉండటంతో మొత్తం గేట్లను మూసివేశారు. ఆదివారం ఉదయం 8 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల హఠాత్తుగా వరద ప్రవాహం తగ్గిపోవడంతో రెండు గేట్లకు కుదించారు ఆ తరువాత వెంటనే మొత్తం గేట్లను మూసివేశారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 585.90అడుగులుగా ఉన్నది. కుడి ఎడమల కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 48082 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.





### గేట్లు మూసివేయడంతో పర్యాటకులు నిరాశ

ఆదివారం సెలవు రోజు కావడంతో సాగర్ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులతో సాగర్ పరిసర ప్రాంతాలలో పర్యాటకుల సందడి నెలకొంది. గత నాలుగు రోజులుగా 26 గేట్ల ద్వారా కొనసాగించిన నీటి విడుదల ఆదివారం మొత్తం గేట్లను మూసివేసిన కూడా పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్థానికంగా ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాం తాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. అయితే ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేయడంతో పర్యాటకులు నిరాశతో వెను తిరుగుతున్నారు.

## హరిజన కుటుంబాల భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని గోపాల్‌పురం గ్రామంలో నిరుపేద హరిజన(25) కుటుంబాలకు చెందిన భూమిని కాపాడి పేద దళితులకు అట్టి భూమిని కేటాయించి పట్టాలు అందచేయాలని కోరుతూ ఆదివారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు మండల సీపీఐ నాయకులు, హరిజన కుటుంబాల సభ్యులు మెమోరాండం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య మాట్లాడుతూ గోపాల్ పురం గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వేనెంబర్లు 8/3/1నుంచి 9/ఉలో సుమారు 1ఎకరం 20 గుంటల భూమి కలదని, అట్టి భూమి కాలిగా ఉండటం వలన బూ కబ్జా దారులు కన్నువేసి భూమిని చేజిక్కుంచుకోవాలని చూస్తున్నారని అన్నారు. కావున ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున అట్టి భూమిని కాపాడి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ పరంగా సర్వే చేయించి ఒక్కో కుటుంబానికి 100 గజాల చొప్పున నివాస పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కాశబోయిన పెద్దులు, హరిజన కుటుంబ సభ్యులు రాములు, సురేష్, సావిత్రి, యాదమ్మ, కనకయ్య, యాదగిరి, రవి, నర్సయ్య, రేణుక, రాములమ్మ, సుకునమ్మ, సునీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించం

### జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బీసీ రిజర్వేషన్ల విషయంలో బిజెపి నాయకుల మాటల్లో స్పష్టత లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఆదివారంపట్టణంలోని రత్న ఫంక్షన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,బిజెపి నాయకులుఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీసీ జాబితాలో ముస్లింలను కలిపారన్నా వంకతో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు తమ వైఖరి మార్చుకోకపోతే వారి పర్యటనలను ఆడుకుంటామన్నారు.బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఆగస్టు రెండో వారంలో సడక్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ల విషయంలో చర్చించడానికి బిజెపి నాయకులు రావాలని సవాల్ విసిరారు .హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలోకి వచ్చిన కూడా ఏమీ లేదని, సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నైనా చర్చించుకుందాం అని సవాల్ విసిరారు. అవసరమైతే హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చర్చ పెడదామన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీ కూడా బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓసిఐ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కాసోజు విశ్వనాథం,నేలపట్ల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాడపల్లి సాయిబాబా,నాయకులు చోల్లెటి రమేష్, గోపాలకృష్ణ, ఆదినారాయణ,కేసబోయిన శంకర్ ముదిరాజ్, నల్ల మధు యాదవ్, లాలయ్య, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

# బ్యాటరీల దొంగలు అరెస్ట్




**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ):** మోటర్ సైకిల్, ట్రాక్టర్, ఆటో,లారీల బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కనగల్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని చండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఆది రెడ్డి వెల్లడించారు. ఆదివారం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం కనగల్ మండల పరిధిలో మోటర్ వాహనాలు ట్రాక్టర్, ఆటోలలో బ్యాటరీలు దొంగతలనాకు పాల్పడుతున్నారనీ ఫిర్యాదుతో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కనగల్ ఎస్.ఐ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహన తనిఖీ లు నిర్వహిస్తుండగా నల్లగొండ నుండి దేవరకొండ వెళ్తున్న ఆటో మోటర్ సైకిల్స్ తనిఖీ చేయగా ఆటోలో 20 బ్యాటరీలు, మోటర్ సైకిల్స్ దొంగలించినదిగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకొనీ విచారించడం జరిగిందని తెలిపారు. ఏ1 నిందితుడు నల్లగొండ పట్టణం గొల్లగూడెం చెందిన సముద్రాల కృష్ణ, ఏ 2 షైక్ టిప్పు సుల్తాన్ జూన్ 27న కనగల్ మండల పరిధిలోని కె.బి తండా గ్రామానికి చెందిన కోమటిరెడ్డి కరుణాకర్ రెడ్డి రోడ్డు ప్రక్కన గల వ్యవసాయ క్షేత్రం వద్ద తన మోటర్ సైకిల్స్ ను పార్క్ చేసి, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే వరకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనము తీసుకెళ్లారని కనగల్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తుండగా ఆదివారం కనగల్ పోలీసులు నల్లగొండ దేవరకొండ రహదారిపై కనగల్ ఎక్స్ రోడ్ వద్ద వాహానాలు తనిఖిలు నిర్వహిస్తుండగా నల్లగొండ వైపూ నుండి దేవరకొండ వైపు కి వెళ్ళు చున్న బజాజ్ ఆటో మోటార్ సైకిల్ గల వాటిని నడుపుతున్న వారు అనుమానస్పధముగా వెనుకకు తిప్పుకొని వెళ్ళు చుండగా వారిని కనగల్ పోలీసులు వారని పట్టుబడి చేసి తనిఖీ చేయగా వారి వద్ద నుండి మోటార్ సైకల్ ట్రాక్టర్, ఆటొ బ్యాటరీ లు 20 దేవరకొండ కు తరలిస్తుండగా ఆ రెండు వాహనాంలో నడుపుతున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన సబ్ ఇన్స్పెక్టర్ కె రాజీవ్ రెడ్డి,ఎస్ఐ రవీందర్ రెడ్డి పిసిలు పి వెంకన్న ,శేఖర్, బి సురేశ్,హెచ్ రమేశ్,వెంకట్ రెడ్డిలను సిఐ ఆదిరెడ్డి అభినందించారు.

# నాణ్యత నవ్వులపాలు

### మూడునెలలకే పగుళ్లు


**ప్రజాపక్షం/మోతె:** మండలంలో చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులు గుత్తేదారులకు వరంగా మారాయి. రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు నేతలు గుత్తేదారులుగా అవతారం మిత్తి ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో గుత్తేదారులకు ఆడిందే ఆట పాడిందే పాట మాదిరిగా మారిపోయాయని నాలుగు కాలాలపాటు మన్నిగ ఉండాల్సిన బిటిరోడ్డు మూడు మాసాల్లోనే పగుళ్లు వస్తున్నాయి. నాణ్యతలేని పనులు కారణంగా ప్రజాధనం పక్కదారి పడుతుంది. ఎన్ హెచ్365 రోడ్డు నుండి భిక్యతండా లింకు రోడ్డు వరకు సిఆర్ఆర్ నిధులు నుండి సుమారు 1.50 లక్షల రూపాయలతో చేపట్టిన బిటిరోడ్డు మూడు నెలల్లోనే మూడు ముక్కలుగా మారింది. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతను తుంగలో తొక్కారు. నిర్మాణ సమయంలో రోడ్డు త్వరగా గట్టిపడేలా రసాయనాలు వాడటంతో పాటు టెండర్లు ఒప్పందం ప్రకారం వాడకం తక్కువ శాతం వాడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులతో కుమ్మక్కై గుత్తేదారు సంస్థ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యత నిర్ధారణ సంస్థ సైతం తమ పాత్ర పాదర్శకంగా నిర్వహించడంలేదని ప్రజలు వాపోతున్నారు. గుతేత్దారులు అందిస్తున్న కమిషన్లకు తలొగ్గి నాణ్యత ఉన్నట్లు దృవీకరణపత్రాలు జారీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత గుత్తేదారు సంస్థతో పాటు పర్యవేక్షించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 60500 విలువగల సిఎం రిలిఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, రైతులకు రుణమాణి, రైతు బరోసా, రైతు బీమా, పంటల బీమా పథకాలతో రైతన్నలను ఆదుకుంటుందన్నారు. ప్రాణపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు ఆర్థికసాయం అందిస్తుందని పేర్కొన్నారు. వైద్య చికిత్స కోసం ఆర్థికసాయం అవసరమైన వారికి గుర్తించి న్యాయం జరిగేలా చూడటం ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికి సిఎం రిలిఫ్ పండ్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, తండు శ్రీను, వల్దాస్ ఉపేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మూడో రోజుకు చేరిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. భద్రతా దళాలు ఉగ్రవాదుల చుట్టూ ఉచ్చు బిగించాయి. ఉదయం నుండి అడపాదడపా కాల్పులు జరుగుతుండగా, ఎన్‌కౌంటర్ మూడవ రోజుకు చేరుకుందని ఒక అధికారి తెలిపారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి భద్రతా దళాలు డ్రోన్‌లతో సహా అన్ని మార్గాలను ఉపయోగిస్తున్నాయని ఆయన అన్నారు. దక్షిణకశ్మీర్ జిల్లా అఖల్‌లోని అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించారు. శుక్రవారం ప్రారంభమైన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ప్రారంభ కాల్పుల తర్వాత, ఆ రోజు రాత్రి ఆపరేషన్ నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కార్డన్‌ను బలోపేతం చేసి ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలించారు. శనివారం ఉదయం కాల్పులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అధికారులు తెలిపారు.

# ఏడాది కావొస్తున్నా.. 'న్యాయం ఎండమావేనా'?

### కోల్‌కతా ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీలో 'హత్యాచార' బాధిత యువ డాక్టర్ తల్లిదండ్రుల నిర్వేదం

### పోలీస్, సిబిఐ మీద విశ్వాసం సన్నగిల్లింది.. ఇక న్యాయ వ్యవస్థపైనే మా ఆశ

### మాకు లభించింది న్యాయం కాదు, ఒక కపట నాటకమని తండ్రి ఆరోపణ



**కోల్‌కతా :** 'మా కూతురుకు న్యాయం జరుగుతుందా?' అని కోల్‌కతాలోని ఆర్‌జి.కర్ మెడికల్ కాలేజీలో 'హత్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్ తల్లితండ్రులు గాయపడ్డ, బాధాతప్తహృదయాలతో ఏడాదికాలంగా న్యాయం కోసం వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు. తాళం వేసిన సెమినార్ రూమ్‌లో యువ మహిళా డాక్టర్ అత్యాచారం, హత్యకు గురైన దారుణ సంఘటన పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్నే కాకుండా యావత్ భారతదేశాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే. హత్యాచారానికి గురైన కూతురు జ్ఞాపకాలు ఏడాదిపాటు నిద్రలేని రాత్రులు వెళ్లదీస్తున్నారు తల్లిదండ్రులు. ఆమె తండ్రి మాట్లాడుతూ తమ కూతురుకు న్యాయం జరగడం ఇప్పుడు కేవలం న్యాయ వ్యవస్థపైనే ఆధారపడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. 'మాకు పోలీస్, సిబిఐ మీద ఉన్న విశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. సిబిఐ రాజకీయంగా, ఇతరవిధంగా రాజీపడిందనేది మాకు అర్థం అయ్యింది. కోల్‌కతా పోలీసులు చెప్పినట్లుగా వారు చిలుకపలుకులు పలుకుతున్నారు' అని హత్యాచార బాధితురాలి తండ్రి 'పిటిఐ'కి చెప్పారు. గత ఏడాది 2024 ఆగస్టు 9న 26 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ మృతదేహాన్ని హాస్పిటల్ ఎమర్జెన్సీ బిల్డింగ్ నాలుగ వ అంతస్తులోని చెస్ట్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ సెమినార్‌హాల్‌వద్ద కనుగొన్నారు. అత్యంత దారుణమైన గాయాలతో కూడిన ఆమె మృతదేహంరాష్ట్రప్రభుత్వ హాస్పిటల్‌లో లభ్యం కావడం పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. హత్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్‌కు న్యాయం జరగాలని ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌కు చెందిన విద్యార్థులు డాక్టర్లు, పౌర సమాజానికి చెందిన వారంతా భారీసంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఎలుగెత్తారు, ఆందోళనలు నిర్వహించారు. యావత్ దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు,డాక్టర్లు ఆమెకు న్యాయం జరగాలని మద్దతుపలుకుతూ ఆందోళనలు నిర్వహించారు. ఏడాది తర్వాత ఇప్పుడు హత్యాచార బాధితురాలి కుటుంబం మాట్లాడుతూ న్యాయం అనేది అంత చిక్కకుండానే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తోంది. 'అది కేవలం హత్యకాదు. తెలివైన మహిళ ఒక హాస్పిటల్ లోపల కూడా సురక్షితంగా ఉండదు' అనే ఒక సందేశాన్ని తెలియజేస్తోందని హత్యాచారానికి గురైన యువ మహిళా డాక్టర్ తండ్రి చెప్పారు. ఆమె అత్యాచారం, హత్య కేసులో సంజయ్‌రాయ్ అనే వ్యక్తి అరెస్ట్ చేయబడి, జీవిత ఖైదు విధించబడింది. కానీ బాధితురాలి కుటుంబం, అనేక హక్కుల కార్యకర్తలు ఇంకాఈ కేసు ముగియలేదని గట్టిగా పట్టుబట్టుతున్నారు. 'మొదటి రోజు నుండీ మేం చెబుతున్నాం. ఒక వ్యక్తి కంటే ఎక్కువ మందే ఉన్నారు. ఆమె చాలా బలిష్టురాలైన మహిళ. ఒక సురక్షిత భవనంలోపల ఒకే ఒక్క పురుషుడు అత్యాచారం, హత్యకు పాల్పడ్డారనడానికి ఆస్కారమే లేదు. తొలినాళ్లలో జరిగినవి అన్నీ కప్పిపుచ్చడం అనేవి పెద్ద హస్తాలు ఉన్నాయనే విషయం వెల్లడిస్తోంది' అని హత్యాచార బాధిత యువ మహిళా డాక్టర్ యొక్క తల్లి కంటతడిపెట్టారు. సాక్ష్యాలను నాశనం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని బాధితురాలి తండ్రి ఆరోపించారు. 'శ్మశానవాటికలో మూడుమృతదేహాలు ఉన్నాయి. అయినప్పటికీ మా ముందే కూతురు మృతదేహాన్ని దహనం చేశారు. ఎందుకీ తొందర? ఆధారాలను తడుడిచిపెట్టడానికి చర్యలు తీసుకున్నారు' అని ఆయన ఆరోపించారు. ఆ తర్వాత ఈ కేసుకు సంబంధించి ఆర్‌జి.కార్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, పూర్వపు తలా పోలీస్ స్టేషన్ ఆఫీసర్‌ఇన్‌చార్జి అభిజిత్ మొండల్‌ను కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించారనే అభియోగాలపై ఇద్దరినీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.కానీ 90రోజుల్లో సిబిఐ చార్జిషీట్‌ను దాఖలు చేయడంలో విఫలమైన తర్వాత అభిజిత్ మొండల్ విడుదలయ్యారు.'సిబిఐనినమ్మడంమా మూర్ఖత్వమే అయ్యి ంది. కోల్‌కతా పోలీసులు వారికి ఇచ్చిన వాటినే వారు పునరావృతం చేశారు తప్ప కొత్త పేర్లు లేవు. కొత్త అరెస్టుల లేవు. సమాధానాలు లేవు' అని హత్యాచార బాధితురాలి తండ్రి చెప్పారు. కేసు నిర్వహణ గురించి ప్రశ్నలు లేవనెత్తిన సుప్రీంకోర్టు పరిశీలనను కూడా బాధిత వైద్యురాలి కుటుంబం లేవనెత్తింది. 'ఆ ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. వారు (సిబిఐ) దర్యాప్తు కొనసాగుతోంది అంటున్నారు. అది సరిపోదు' అని ఆయన అన్నారు. 'మేం సాధారణ ప్రజలమే కానీ మూర్ఖులం కాదు. మా కూతురిన ప్రభుత్వ ఆసుపత్రి లోపల తాళం వేయాల్సిన గదిలో అత్యాచారం చేసి హత్యచేశారు. శక్తివంతమైన వ్యక్తుల నుండి రక్షణ లేకుండా అది ఎలా జరుగుతుంది' అని బాధిత యువ మహిళా వైద్యురాలి తల్లి ప్రశ్నించారు 'మాకు లభించింది న్యాయంకాదు. అది ఒక కపటనాటకం.అదిన్యాయాన్నిఅపహాస్యం చే యడం. మేం చనిపోయేవరకూ దర్యాప్తును 10లేదా 20 సంవత్సరాలు లాగుతారు. అది వారి వ్యూహం. తల్లిదండ్రులను, న్యాయం కోరుకునే ప్రజలను అలసిపోనివ్వండి అనేది వారి వ్యూహం' అని హత్యాచార బాధిత యువ మహిళా వైద్యురాలి తండ్రి ఆరోపించారు.

# ఇసి తటస్థత ప్రశ్నార్థకంగా మారింది

### బిహార్ 'ఎస్ఐఆర్' పై పార్లమెంటులో చర్చ జరగాల్సిందే

### గౌరవ్ గొగోయ్ డిమాండ్

### పహల్గామ్‌పై ప్రజలకు హోంశాఖ క్షమాపణ చెప్పలేదు



**గువహటి:** భారత ఎన్నికల సంఘం తటస్థత ప్రశ్నార్థకంగా మారిందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, లోక్‌సభలో ఆ పార్టీ ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ విమర్శించారు. ఎన్నికలసంఘం బీహార్‌లో చేసిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)పై చర్చ జరగాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు కోరతున్నప్పటికీ ప్రభుత్వం తిరస్కరిస్తోందని విమర్శించారు. అదేవిధంగా పహల్గామ్‌లో గూఢచారి వ్యవస్థ వైఫల్యం కారణంగా ఉగ్రవాదుల దాడి జరిగినప్పటికీ కేంద్ర హోంశాఖ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పలేదని విమర్శించారు. అసోం ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడి హోదాలో, ఆ రాష్ట్రపార్టీ విస్తృతకార్యనిర్వాహకసమావేశంలో పాల్గొనేముందుగా గౌరవ్ గొగోయ్ ఆదివారంనాడు గువహటిలోపాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రభుత్వమే నియమించినప్పటికీ ఎన్నికల సంఘం తీరుపై పార్లమెంటులో చర్చించేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన నిలదీశారు. "భారత ఎన్నికల సంఘం తటస్థత మీద సందేహాలు నెలకుంటున్నాయి, ఈ ప్రశ్న దేశ ప్రజల బుర్రలను తొలిచేస్తోంది, అందు వల్లనే ఇంతముఖ్యమైన విషయంమీద పార్లమెంటులో చర్చ జరగాలని మేం కోరుతున్నాం, కానీ ప్రభుత్వం మాత్రం ఏదో విషయాన్ని దాచిపెట్టాలని ప్రయత్నం చేస్తోంది, ఏమిటది? గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ,లోక్‌సభ ఎన్నికల్లోనూ కూడా ప్రభుత్వం ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకుందా?" అని ఆయన ప్రశ్నించారు. బీహార్‌లో సవరించిన ఓటర్ల జాబితాపై పార్లమెంటులో ఎలాంటి దాపరికం లేకుండా బహిరంగంగా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని, కానీ కేంద్ర ప్రభుత్వం ఎందుకని ఏదో విషయాన్ని దాచాలని ప్రయత్నం చేస్తోందని ప్రశ్నించారు. "సామాన్య ప్రజలు దేశంలో తమ ఓటు హక్కుకు సంబంధించిన విషయాలు తెలుసుకోవాలని కోరుకుంటున్నారు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవాలని కోరుతున్నారు, ఈ విషయంపై పార్లమెంటులో ఖచ్చితంగా చర్చ జరగాలని మేం కోరుతున్నాం, కానీ ప్రభుత్వం మాత్రమే ఈ విషయంపై చర్చించలేం అని చెబుతోంది, ఎందుకని?" అని గొగోయ్ నిలదీశారు. "ఎన్నికల సంఘం ఏ ప్రభుత్వ విభాగానికీ సంబంధించినది కాదు, అదొక ప్రత్యేక స్వతంత్ర, తటస్థ వ్యవస్థ అనేది వారి తర్కం, కానీ ఈ తర్కం అర్థరహితం, విడ్డూరమైన విషయం, ఎందుకంటే ఎన్నికల సంఘం ప్రధాన అధికారిని నియమించేదివారే, ప్రధానమంత్రి సారథ్యంలోని కమిటీయే ఎన్నికల ప్రధానాధికారిని నియమిస్తోంది" అన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్ళిన ఓటర్లు ఆ జాబితాలలో ఉండాల్సిన తమ పేర్లు కనిపించడం లేదని, వాటిని తొలగించారని చెప్పిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. ఆపరేషన్ సింధూర్ గురించి కూడా మాట్లాడుతూ, పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన బాధితులకు కేంద్ర హోంమంత్రి కనీస మర్యాద కూడా ఇవ్వలేదు, గూఢచారి కార్యకలాపాల వైఫల్యం కారణంగా పర్యాటకులు మరణించారు, ఈ గూఢచారులు కేంద్ర హోంశాఖ పరిధిలోనే పనిచేస్తారు, కాబట్టి ఇది కేంద్ర హోంశాఖ వైఫల్యమే, కానీ ఈ విషయంపై ప్రజలకు కేంద్ర హోంశాఖ క్షమాపణలు చెప్పలేదు, ఇదీ వాళ్ళ ప్రభుత్వ పనితీరు" అని గౌరవ్ గొగోయ్ విమర్శించారు.కాగా, అసోం కాంగ్రెస్ విస్తృత కార్యనిర్వాహక సమావేశం ఆదివారం ఉదయం గువహటిలో ప్రారంభమైంది. పార్టీ ఎంపీలు, ఎంఎల్ఎలు, సీనియర్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తగిన వ్యూహాన్ని రచించే విషయం సమావేశంలో చర్చించారు. అసోం అసెంబ్లీలో 126 స్థానాలు ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అసోం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. ఈ సమావేశంలో అసోం పరిస్థితులపై ఒక రాజకీయ తీర్మానంతో పాటు ఆర్థిక వ్యవహారాలపై మరో తీర్మానం కూడా చేస్తారు.

# 7న ఇండియా కూటమి విందు సమావేశం




**న్యూఢిల్లీ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంపై వ్యూహాన్ని చర్చించడానికి ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకులు 7న విందు సమావేశం నిర్వహించే అవకాశం ఉందని ఆదివారం వర్గాలు తెలిపాయి. ఎస్ఐఆర్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్‌కు నిరసనగా 8న భారత ఎన్నికల కమిషన్ కార్యాలయానికి మార్చ్ చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు కూడా యోచిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో ఎస్ఐఆర్ అంశంపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ప్రతిపక్షాల విందు సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. చర్చ కోసం ప్రతిపక్షం చేసిన డిమాండ్ పాలక కూటమి నుండి సానుకూల స్పందన రాకపోవడంతో రెండు వారాల పాటు సాగిన పార్లమెంట్ సమావేశాలు దాదాపు తుడిచిపెట్టుకుపోయాయి. ఎస్ఐఆర్ అంశంపై తమ వ్యూహాన్ని చర్చించడానికి ఇండియా కూమిటి పార్టీ నాయకులు 7న విందు సమావేశం నిర్వహిస్తారని, ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక ప్రకటించబడినందున, అనేక మంది ప్రతిపక్ష నాయకులు తాము ఉమ్మడి అభ్యర్థిని కూడా నిలబెట్టవచ్చని సూచించినందున ఈ సమావేశం జరుగుతుందని వర్గాలు తెలిపాయి.

## 301 నగరాల్లో నీట్ పిజికి 2,42,000 మంది అభ్యర్థులు హాజరు

**న్యూఢిల్లీ :** వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సులలో ప్రవేశం కోసం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) నిర్వహించే నీటి పిజి పరీక్షకు ఆదివారం 2,42,000 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 301 నగరాల్లో, 1,052 పరీక్షా కేంద్రాలలో కంప్యూటర్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌పై ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఒకే షిఫ్ట్‌లో నిర్వహించిన అభ్యర్థుల సంఖ్యా పరంగా భారతదేశంలోనే అతిపెద్ద కంప్యూటర్ ఆధారిత పరీక్ష. అక్రమార్గాలను కట్టడి చేసేందుకు పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు ఎన్‌బిఇఎంఎస్ వివిధ వైద్య కళాశాలలు, గుర్తింపు పొందిన ఆసుపత్రుల నుండి 2,200 కంటే ఎక్కువ మంది అధ్యాపకులను నియమించింది. అన్ని పరీక్షా కేంద్రాలలో తగినంత శాంతిభద్రతలు, సైబర్ భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూసేందుకు ఎన్‌బిఇఎంఎస్ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలకు లేఖ రాసింది. ఈ విషయంలో జిల్లా పరిపాలన, పోలీసుల నుండి కూడా సహాయం కోరింది. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి సైబర్ స్కామ్‌ను నివారించడానికి, ఎన్‌బిఇఎంఎస్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) నుండి సహాయం తీసుకుంది. ఈ పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మోసం జరగకుండా నిరోధించడానికి దాదాపు 300 మంది సైబర్ కమాండోలు వివిధ పరీక్షా కేంద్రాలకు, ముఖ్యంగా సున్నితమైన వాటికి వెళ్లారని అధికారులు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల నుండి స్వీకరించబడిన ప్రత్యక్ష సిసిటివి ఫీడ్‌ను రియల్ టైమ్ పద్ధతిలో నిరంతరం వీక్షించడానికి ఎన్‌బిఇఎంఎస్ తన కార్యాలయంలో 200 మందికి పైగా సిబ్బందిని నియమించింది. సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, మెడికల్ కాలేజీల డీన్/డైరెక్టర్ మరియు ఎన్‌బిఇఎంఎస్ గవర్నింగ్ బాడీ సభ్యులు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా పరీక్షా కేంద్రాలను సందర్శించారు. తగిన సంఖ్యలో మొబైల్ సిగ్నల్ జామర్‌లను ఏర్పాటు చేయడం ద్వారా అన్ని పరీక్షా కేంద్రాలలో మొబైల్ సిగ్నల్‌లను బ్లాక్ చేశారు. ఎండి, ఎంఎస్, పిజి డిప్లొమా వంటి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశానికి నీట్ పిజి పరీక్షను నిర్వహిస్తారు.

## ఎయిర్‌లైన్స్ సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి

### హత్యాయత్నం కేసు నమోదు!

**శ్రీనగర్ :** లగేజీ విషయంలో ఓ ఆర్మీ అధికారికి, ఎయిర్‌లైన్స్ సిబ్బందికి మధ్య వివాదం చెలరేగింది. మాట మాట పెరిగి చివరికి చేయిచేసుకునే వరకూ వెళ్లింది. ఈ గొడవలో సిబ్బందికి గాయాలు అయ్యాయి. ఈ దాడిలో గాయపడ్డ సిబ్బంది ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. ఈ ఘటన శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో జరిగింది. విమానయాన సంస్థ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ఆర్మీ అధికారి 16 కిలోల బరువున్న లగేజీతో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఏడు కిలోల బరువు ఉన్న వస్తువులకు మాత్రమే అనుమతి ఉందని అక్కడి సిబ్బందిఆర్మీ అధికారికి తెలిపారు. అంతకు మించిన సామగ్రి ఉంటే వాటికి డబ్బులు చెల్లించాలని కోరారు. అయితే ఛార్జీలు చెల్లించడానికి నిరాకరించిన అతను ఏరోబ్రిడ్జిలోకి ప్రవేశించారు. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించినట్లు గమనించి భద్రతా సిబ్బంది ఆయన్ని వెంటనే గేట్ వద్దకు తీసుకెళ్లారు. అయితే ఈ విషయంపై ఆగ్రహించిన ఆర్మీ అధికారి అక్కడున్న నలుగురు స్పైస్‌జెట్ సిబ్బందిపై దాడికి దిగారు. పిడిగుద్దులు కురిపిస్తూ, కాలితో తన్నడం వల్ల వారికి గాయాలైనట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. దాడిలో ఓవ్యక్తి స్పృహ కోల్పోయి పడిపోయినప్పటికీ, ఆపకుండా తీవ్రంగా తన్నడం వల్ల అతని వెన్నెముకకుగాయమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతంబాధితుడుఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఎయిర్‌లైన్స్ అధికారులు, దాడికి పాల్పడ్డ ఆర్మీ అధికారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. సిబ్బందిపై దాడి చేసిన ప్రయాణికుడిని పౌర విమానయాన నిబంధనల ప్రకారం నోఫ్లై జాబితాలో చేర్చడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పౌర విమానయానమంత్రిత్వశాఖకు లేఖ కూడా రాశామని పేర్కొన్నారు. అయితే సిబ్బందిపై దాడికి పాల్పడ్డ ఆర్మీ అధికారికి సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. సదరు ఆర్మీ అధికారిపై హత్యాయత్నం కేసు నమోదైంది.

## చైనా జె–10 జెట్ ఫైటర్ల సామర్థ్యాన్ని
# చిన్నచూపు చూసిన రాఫెల్ పైలట్లు!

### ఆపరేషన్ సింధూర్‌పై రాయిటర్స్ నివేదిక



**బీజింగ్:** భారతదేశం ఈ ఏడాది మే ఏడో తేదీన చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్థాన్ ప్రయోగించిన చైనా యుద్ధ విమానాలను భారత్ రాఫెల్ యుద్ధ విమానాల పైలట్లు తక్కువగా అంచనావేశారని సరికొత్త నివేదిక ప్రచురితమైంది. చైనా జె–10 యుద్ధ విమానాలకు, భారత్ రాఫెల్ యుద్ధ విమానాలకు మధ్య చీకట్లో గంటసేపు యుద్ధం జరిగిందని, ఈ యుద్ధంలో కనీసం ఒక రాఫెల్ విమానం కుప్పకూలిపోయిందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తాసంస్థ ఒక నివేదికలో వెల్లడించగా, ఈ యుద్ధంలో జె–10 జెట్స్‌ను ఉపయోగించి భారత్‌కు చెందిన ఫ్రాన్స్ తయారీ మూడు రాఫెల్ యుద్ధ విమానాలనుకుప్పకూల్చివేశామనిపాకిస్థాన్ చెబుతున్నదని మరో నివేదికలో రాయిటర్స్ పేర్కొంది.భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన సైనిక చర్యల సందర్భంగా ఐదు యుద్ధ విమానాలు కుప్పకూలిపోయాయని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో భారతదేశం ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందనే విషయం ఇప్పటికీ మిస్టరీగా మిగిలిపోయింది. భారత రక్షణశాఖ దీనిపై ఎలాంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో అంతర్జాతీయస్థాయిలో అనేక కథనాలు వస్తున్నాయి. పాకిస్థాన్‌పై భారత్ చేసిన యుద్ధం చివరకు భారత్–చైనా గగనతల యుద్ధ సామ ర్థ్యాన్ని అంచనావేయడానికి ఒక విశ్లేషణా వేదికగా మారింది. చైనాలోని చెంగ్డూ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ తయారు చేసిన చెంగ్డూ జె–10 ఫైర్‌బ్రాండ్ యుద్ధ విమానాలను పాకిస్థాన్ కొనుగోలు చేసింది. ఈ యుద్ధ విమానం సామర్థ్యాన్ని భారత్ రాఫెల్ పైలట్లు తక్కువగా అంచనావేశారని, అందువల్లనే జె–10 యుద్ధ విమానం నుండి ప్రయోగించిన పిఎల్–15 క్షిపణి రాఫెల్ యుద్ధ విమానాన్ని కూల్చివేసిందని రాయిటర్స్ వార్తాసంస్థ సరికొత్త సమాచారాన్ని సమకూర్చిందని పాకిస్థాన్ ప్రభుత్వ పత్రిక ఆదివారంనాడు తెలియజేసింది. ఆపరేషన్ సింధూర్ తర్వాత రాఫె ల్ యుద్ధ విమానాలు కుప్పకూలాయన్న వివాదంపై ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ యుద్ధ విమానాల కంపెనీ డస్సాల్ట్ ఏవియేషన్ సిఇఓ–ఛైర్మన్ ఎరిక్ ట్రాపియర్ ఫ్రెంచ్ మ్యాగజైన్ 'ఛాలెంజెస్'కు జూన్‌రెండోవారంలో ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. మూడు రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చివేశామని పాకిస్థాన్ చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమని ఆయన కొట్టిపారేశారు. భారతదేశ ప్రభుత్వం రాఫె ల్ యుద్ధ విమానాలపై తమకు ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదని, నిర్దేశిత లక్ష్యాలు సాధించడంలో రాఫెల్ యుద్ధ విమానాలవల్ల ఎలాంటి లోపం జరగలేదని ఇంటర్వ్యూలోఎరిక్ ట్రాపియర్ చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానం కుప్పకూలిపోయిందన్న ప్రచారం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల సైనిక వ్యవస్థలకు ఆశ్చర్యం కలిగించిందనీ, పశ్చిమదేశాల హార్డ్‌వేర్ వ్యవస్థపై సందేహాలు వస్తున్నాయని చైనా పత్రిక పేర్కొంది. దీంతో ఫ్రెంచ్ డస్సాల్ట్ కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలిగే పరిస్థితి వస్తోంది. కానీ ఉద్దేశపూర్వకంగా పాకిస్థాన్ పనిగట్టుకుని రాఫెల్‌పై దుష్ప్రచారం చేస్తోందని భారత ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సార్లు ప్రకటించింది.

## బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం ప్రణాళికలు

### ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలన్న విపక్షాల డిమాండ్‌కు స్పందించని బిజెపి సర్కార్

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు ప్రతిపక్షాలు ఐక్యంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికార పక్షం స్పందించడం లేదు. దీంతో గత రెండు వారాల నుంచి పార్లమెంటులో విపక్షాలు, ప్రభుత్వం మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం లోక్‌సభలో కీలకమైన క్రీడా బిల్లును ఆమోదింప చేసుకునేందుకు సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. క్రీడా సంస్థల పనితీరులో ఎక్కువ పారదర్శకతను కల్పించే జాతీయ క్రీడా పాలసీ బిల్లును లోక్‌సభలో పరిశీలన ఆమోదం కోసం ఎజెండాను తయారు చేశారు. ఈనెల 13 నుండి అమల్లోకి వచ్చేలా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించడంపై హోంమంత్రి అమిత్ షా చేసిన తీర్మానాన్ని రాజ్యసభ సోమవారం ఆమోదానికి జాబితా చేసింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్‌పై రెండు రోజుల చర్చ మినహా, జులై 21న బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రతిపక్ష పార్టీల నుండి తీవ్ర నిరసనలను రే వ్యక్తమవుతున్నందున ఉభయ సభలలో వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి పార్లమెంటు కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయి. గత సమావేశాల్లో తరచుగా వేర్వేరుగా తమ గళాలను వినిపించిన ఇండియా కూటమి పార్టీలు ఓటర్ల జాబితా అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి వ్యతిరేక ఓటర్లను తొలగించడం, ఆ పార్టీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపిస్తున్నాయి. అర్హత కలిగిన ఓటర్లు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించబడతారని నిర్ధారించుకోవడానికి ఓటర్ల జాబితాల సమగ్రతను రక్షించడానికి జాతీయ స్థాయిలో ఈ కసరత్తును ప్రారంభిస్తామని ఇసి చెబుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఇసి 'ఓట్ చోరీ'కి పాల్పడుతోందని (ఓట్లను దొంగిలించడం) ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని నిత్యం తూర్పారబడుతున్నారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చ చేపట్టాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో, ప్రతిపక్షం పార్లమెంటులో తన నిరసనలను కొనసాగిస్తోంది.

# దేశంలో 20శాతం రైలు డ్రైవర్ల కొరత

### తప్పుడు పద్ధతుల్లో పనిగంటల తారుమారు



**న్యూఢిల్లీ:** రైల్వేశాఖలో 20 శాతం రైల్వే డ్రైవర్ల కొరత ఉండటంతో ఉన్న డ్రైవర్ల పనిగంటలమధ్య ఉన్న విరామ సమయం ఎంట్రీలను తప్పుడు పద్ధతుల్లో తారుమారుచేసి దోపిడీ చేస్తున్నారని లోకో పైలట్స్ యూనియన్ విమర్శించింది. ఒకసారి రైలును తీసుకుని డ్రైవర్ బయలుదేరిన తర్వాత తొమ్మిది గంటలకంటే ఎక్కువ సమయం పనిచేయమని అడిగేఅధికారం ఉండదని, కానీ విధుల్లోకి వెళ్ళే ముందు సంతకం పెట్టిన తర్వాత విధులు పూర్తిచేసి సంతకం పెట్టిన తర్వాత విరామం 11 గంటలకంటే ఎంత మాత్రం ఎక్కువగా ఉండకూడదని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ పేర్కొంది. కానీ డ్రైవర్ల చేత చాలా ఎక్కువ గంటలు పనిచేయించుకుని ఆన్‌లైన్ క్రూ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (సిఎంఎస్) ద్వారా పనిగంటల సమయాలను తారుమారు చేస్తున్నారని, డ్రైవర్లు మాత్రం బండి ఎక్కిన తర్వాత 12 నుండి 16 గంటవరకూ విరామం లేకుండా రైలును డ్రైవింగ్ చేస్తున్నారని వారి పనిగంటలను దోపిడీ చేస్తున్నారని యూనియన్ విమర్శించింది. దేశంలో ఉన్న అన్ని రైల్వే జోన్లలోనూ పరిస్థితులు ఇదేవిధంగా ఉన్నాయని విమర్శించింది. అన్ని రైల్వే జోన్లలోనూ 80 శాతం ట్రిప్పులను తొమ్మిది గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలని రైల్వే బోర్డు సేఫ్టీ విభాగం 2021లో జారీ చేసిందని పేర్కొంది. లోకో మోటివ్‌లను నడిపేందుకు భారీ ఎత్తున ముమ్మరంగా కొత్త డ్రైవర్ల నియామకాలకు తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా, లోకోమోటివ్ డ్రైవర్లకు యూరినల్స్ సహా అనేక సదుపాయాలు కల్పిస్తామని రైల్వే మంత్రిత్వశాఖ తొలుత స్పష్టం చేసిందని, ఇంతవరకూ ఎలాంటి సదుపాయాలు ఇవ్వకుండా సిబ్బంది కొరతతో రైల్వే పాలనాయంత్రాంగం నిబంధనలన్నింటినీ ఉల్లంఘిస్తోందని యూనియన్ విమర్శించింది. 900కు పైగా ఉన్న లోకోమోటివ్‌లలో యూరినల్ సదుపాయాలు ఇస్తామని పేర్కొందని, మరో 7000 లోకోమోటివ్‌లలో ఎయిర్ కండిషనర్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చిందిని, ప్రస్తుతం నడుస్తున్న 558 రన్నింగ్ రూములను ఆధునీకరిస్తామని వాగ్దానం చేసిందని యూనియన్ విమర్శించింది. "అనేక రైల్వే జోన్‌లలో, డివిజన్లలో అక్రమ పద్ధతులు అమలు చేస్తున్నారు. తూర్పు మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు మేం ఈ సమస్యలన్నీ తెలియజేశాం, ఆయనకు ఒక మెమొరాండం సమర్పించాం, అనేక సమస్యలపై ఫిర్యాదులు చేశాం, లోకో పైలట్ల పని నిర్వహణలో ఎదురవుతున్న దుస్థితిని వివరించాం, ఒకసారి ట్రిప్పు పూర్తయిన తర్వాత బ్రేక్‌కు సంబంధించి జరుగుతున్న మోసాలను వివరించాం, కానీ జరుగుతున్న అక్రమ పద్ధతుల గురించి మేం చేసిన ఆరోపణలకు తూర్పు మధ్య రైల్వే నుండి మాకు ఎలాంటి స్పందనా రాలేదు, కానీ విధులు పూర్తిచేసిన తర్వాత విధుల్లో ప్రవేశించేటప్పుడు తప్పుడు పద్ధతులలో విరామకాలాన్ని వక్రీకరించేవిధంగా ఆన్‌లైన్‌లో ఎలాంటి తారుమారు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇ సి ఆర్ ధన్‌బాద్ డివిజన్ నుండి ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొంది. బండి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తప్ప విరామ సమయంల్లో సంతకాలు తీసుకోకూడదని అందరికీ ఆదేశాలు జారీ అయ్యాయి, ఒకవేళ సిబ్బంది లాబీలోనే గనుక ఇలాంటి తప్పుడు పనులు జరిగితే తక్షణం వాటిని ఆపేయాలని, అలాంటి ఘటనలు కనిపిస్తే, చాలా కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన సర్కులర్ జారీ అయ్యిందని ఎఐఎల్‌ఆర్ఎస్ఎ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ రౌత్ చెప్పారు. 12 గంటలకంటే ఎక్కువ సమయం పనిచేసినప్పుడు కాంట్రాక్టు సిబ్బందికి 45 నిమిషాల నుండి రెండు గంటలపాటు నోటి మాట ద్వారా సీనియర్ అధికారుల నుండి విరామం ఇస్తున్నారని, కానీ నెలవారీ సిబ్బంది పనిగంటల చార్టులు సమర్పించినప్పుడు మాత్రం అదనంగా పనిచేసిన పని గంటల సమయాన్ని లెక్క కట్టకుండా భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని రౌత్ విమర్శించారు. ఈ విధమైన అక్రమ, ఎంతమాత్రం సురక్షితంకానీ డ్యూటీ బ్రేక్స్‌కు నోటిమాట ద్వారా ఇచ్చే అనుమతులను అమలు చేస్తున్నారని, సిఎంఎస్ డేటా ఎంట్రీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, నోటిమాట ద్వారా అనుమతులు ఇచ్చే అధికారులు మాత్రం ఆ సమయాన్ని కూడా ఆ చార్టుల్లో చేర్చమని వారికి చెబుతున్నారని రౌత్ విమర్శించారు. తప్పుడు సమయాలను నమోదు చేస్తున్నారని విమర్శించారు.

## ఖైదీ నెంబర్ 15528


### రేవణ్ణకు జైలులో నెంబర్ కేటాయింపు

**బెంగళూరు :** అత్యాచారం కేసులో మాజీ ప్రధాని దేవగౌడ మనవడు, మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు శాశ్వత జైలు శిక్ష విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన్ అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అతడికి ఖైదీ నెంబర్ 15528 ను కేటాయించారు. అయితే అతడు శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు.రాత్రిబాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించారన్నారు. వైద్యుల పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు ధీనంగా ఉన్నడని.. అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరో వైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళ్తానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది.ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్నసెల్‌లోఉంచామన్నారు.అతడిని ఉంచి సెల్‌కు భద్రత కల్పించామని చెప్పారు. సాధారణ ఖైదీలకు వలే డ్రస్ కోడ్ ఆయనకు ఉందని తెలిపారు. ఆడ్రస్‌నుప్రజ్వల్‌కుఅందజేస్తామనిస్పష్టం చేశారు.2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలుకు కొద్ది రోజుల ముందు హాసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన కొన్ని అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




# సమాజానికి అద్దం... భవిష్యత్తుకు దీపం..

కొన్ని శతాబ్దాలు సాహిత్యం అంటే వర్ణనకు... వ్యక్తి పూజకు పరిమితైంది. క్రమంగా మార్పులు సంతరించుకుంటూ కొన్నాళ్లు భావ సాహిత్యం హోరులో కొట్టుకుపోయింది. ఆ తర్వాత ప్రగతిశీల సాహిత్యం.. విప్లవ సాహిత్యం... అభ్యుదయ సాహిత్యం వంటి ఎన్నో ప్రక్రియలు తెరపైకి వచ్చాయి. ఇప్పటికీ వస్తునే ఉన్నాయి. వీటిలో అత్యధిక శాతం సమకాలీన సమాజానికి అద్దం పట్టేవిగానే ఉన్నాయి. సమస్యలపై గళం విప్పడంతో తమ బాధ్యత తీరిపోయినట్టు రచయితలు ప్రవర్తించడం మొదలైంది. ఇది ఆహ్వానించతగిన పరిణామమే. కానీ, కేవలం సమస్యలను ఏకరువు పెట్టడం.. దోపిడీని ఖండించడమే సాహిత్య లక్షణం కాకూడదు. భవిష్యత్తుకు దారిచూపే కాంతిదీపమై వెలుగొందాలి. సమస్యను ప్రస్తావించినప్పుడు, పరిష్కారాన్ని చూపడంలోనే ఆ రచన పరిపూర్ణతను సంతరించుకుంటుంది. దోపిడీని ప్రశ్నించమేకాదు... ప్రతిఘటించే మార్గాలను సూచించడం.. మార్గదర్శకం చేయడం వల్లే సాహిత్య ప్రయోజనం చేకూరుతుంది. సమాజంలో సహజన్యాయానికి భంగం కలిగించే ప్రధాన బలగం దోపిడీ వ్యవస్థ అనేది బహిరంగ రహస్యం. ఈ దోపిడీ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థాయిల్లో అనేక రూపాల్లో కనిపిస్తుంది. దీనిని వ్యతిరేకించడానికి ఉద్యమాలు, ఉద్యోగాలు, చట్టాలు, మానవ హక్కుల కమిషన్లు పాటుపడుతున్నాయి. కానీ, మార్పు కోసం పోరాడే చైతన్యాన్ని ప్రజల్లో కలిగించే సాధనం సాహిత్యం మాత్రమే. ఈ నేపథ్యంలో దోపిడీ వ్యవస్థను ఖండించే సాహిత్యం ఎంత అవసరమో, అది సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. దోపిడీలేని భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో చెప్పే బాధ్యత కూడా సాహిత్యానికి ఉంటుంది. ఒక మనిషి మరో మనిషి... ఒక వర్గాన్ని మరో వర్గం శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా, మతపరంగా, జాతీయంగా కబళించే వ్యవస్థ నేడు వేళ్లూనుకున్నదనే నిజాన్ని మనం చూస్తునే ఉన్నాం. ఇది వ్యక్తిగత స్థాయి నుంచీ, అంతర్జాతీయ స్థాయిదాకా విస్తరిస్తున్నది. భూస్వామ్య దోపిడీ లేదా కార్మికుల శ్రమ దోపిడీ.... వర్గవాద దోపిడీ లేదా జాతి ఆధారిత దోపిడీ... వలసవాద దోపిడీ లేదా మతవాద దోపిడీ... విధానం ఏదైతేనేం? మనిషిని మనిషి పీక్కు తినడం. ఈ దోపిడీ వ్యవస్థను కూలదోయడానికి సాహిత్యాన్ని మించిన ఉత్తమ మారంగం, ముఖ్యమైన మార్గం, అద్భుతమైన ఆయుధం మరొకటి లేదు. సాహిత్యం అనేది ఒక కళాత్మక వ్యాఖ్యానమే కాదు. అది సమాజాన్ని అద్దంలా చూపించగల శక్తివంతమైన మార్గం. అంతటితో ఆగిపోకుండా.. భవిష్యత్ మార్గాన్ని చూపించే మార్గదర్శి. సాహిత్యం భావోద్వేగాలకు మాత్రమే కాదు, తాత్వికతకు, యథార్థానికి, ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి ఉపయోగపడాలి. 'సాహిత్యం సమాజాన్ని విముక్తి వైపు నడిపించగలదు' అంటాడు ప్రముఖ రచయిత మునిమోహన్ సేన్‌గుప్త. ఈ సిద్ధాంతం ప్రకారం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాహిత్యం ఒక జాగృతశక్తిగా పని చేస్తుంది. అగమ్యగోచరంగా మారిన బతుకులను మార్పు బాట పట్టిస్తుంది. బాసవన్న, అక్కమహాదేవి, రవిదాస్, కబీర్ లాంటి భక్తకవులు కులదోపిడీ వ్యతిరేకంగా గళం విప్పారు. వాళ్ళ రచనలు మతపరమైన భిన్నత్వాన్ని ప్రశ్నిస్తూ, సమానత్వం అనే భావనను బలంగా ప్రతిపాదించాయి. సమానత్వంతోనే నిజమైన బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని వారి రచనలు ఎలుగెత్తి చాటాయి. ఆంగ్ల సాహిత్యంలో, జార్జ్ ఆర్వెల్, ఫ్రాంజ్ ఫానన్, ఎడ్వర్డ్ సైడ్ వంటి రచయితలు వలస పాలకుల దోపిడీ విధానాన్ని ప్రశ్నించారు. వలసవాదాన్ని ఎండగట్టారు. తెలుగు సాహిత్యం విషయానికి వస్తే, ఎంతో మంది రచయితలు సామాజిక సమస్యలను ప్రస్తావించారు. ప్రజలను ఆలోచింప చేశారు. కానీ, శ్రీశ్రీ వంటి అతికొద్ది మంది మాత్రమే కర్తవ్యబోధ చేశారు. దోపిడీని ఎదిరించి, ఏ మార్గంలో పయనించాలో సూచించారు. సాంకేతికత విప్లవాత్మక మార్పులను సంతరించుకుంటున్న నేటి కాలంలో సాహిత్యం కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదు. బ్లాగ్‌లు, డిజిటల్ కథలు, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలలో చైతన్యం కలిగిస్తోంది. యువ రచయితలు పేదలపై దోపిడీ, కార్మికుల సమస్యలు, మైనారిటీ హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనలను ఆధారంగా చేసుకొని రాస్తున్నారు. కానీ, కొద్ది మంది మాత్రమే ఈ సుడిగుండం నుంచి బయటపడే విధానాలపై తమ ఆలోచనలను వెల్లడిస్తున్నారు. సామాజిక దోపిడీని ఎండగట్టే రిపోర్టింగ్, జర్నలిజం కూడా ఒక రకంగా సాహిత్యమే. జర్నలిస్టులు కూడా ఈ భూమికలో భాగం. ప్రగతిశీల సాహిత్యం... రెవల్యూషనరీ రైటింగ్.. దళితవాద రచనలు.. ఆదివాసీ గిరిజన సాహిత్యం.. స్త్రీవాద సాహిత్యం.. ఇత్యాది విధానాలు ఎన్ని ఉన్నా... దోపిడీలేని వ్యవస్థను నిర్మించడమే వాటి అంతిమ లక్ష్యం. ఇందుకు సమర్థులు. వారే వాస్తవిక మార్గదర్శకులు. సాహిత్యం కేవలం అలంకారశాస్త్రానికి పరిమితమైన కళగా నిలిచిపోకూడదు. అది కాలాన్ని ప్రతిబింబించే అద్దంగా మాత్రమే కాక, కాలాన్ని మలచే హస్తంగానూ ఉండాలి. ఇది సత్యాన్ని, శాశ్వతతను, మార్పును సూచించే సాధనంకావాలి. శాశ్వతమేమీ లేని ఈ ప్రపంచంలో, మార్గం చూపగలిగే శక్తి కలిగిన రచనలు చరిత్రను మలుపుతిప్పుతాయి. ఒక రచయిత కేవలం ఊహలకు స్వేచ్ఛ ఇచ్చినంత మాత్రాన అతని రచన శాశ్వతతను పొందదు. సమాజం పట్ల, మానవుని బాధ్యత పట్ల, భవిష్య తరాలప పట్ల అతని బాధ్యత తీరిందని అనుకోకూడదు. రుగ్మతలపై స్పందించాలి. తప్పును గట్టిగా నిలదీయాలి. వాస్తవాలను ధైర్యంగా నిలబడి చెప్పగలగాలి. మార్పులను సూచించాలి. మార్గనిర్దేశనం చేయాలి. అందుకు భిన్నంగా, కేవలం గతాన్ని ఉల్లేఖించడమో, వర్తమానాన్ని వర్ణించడమో మాత్రమే చేస్తే, అది సాహిత్యం కాదు – అది చరిత్ర రచన. కానీ భవిష్యాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడిన రచనలే సాహిత్యంగా నిలుస్తాయి. ఇలాంటి రచయతలు అందులో కేవలం రాజకీయ వ్యంగ్యంతోనే సరిపుచ్చలేదు. ప్రజలపై అధికారుల నియంత్రణ ఎలా పనిచేస్తుందో వివరించాడు. అధికారం, నియంత్రణ, ప్రజాస్వామ్య హక్కుల మధ్య ఉన్న సున్నిత సంబంధాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్‌ను మార్చుకోవడానికి అనుసరించాల్సిన విధానాలను సూచించాడు. భవిష్య సమాజాన్ని అతను ఎంత చక్కగా పరిశీలించి, దానిని చెరగని రచనగా మలిచారో చూస్తే, భవిష్యనిర్దేశక సాహిత్యం ఎలా ఉండాలో అర్థమవుతుంది. ఆల్డర్ హక్స్‌లే వంటి రచయితలు సాంకేతిక ఆధిపత్యం, జనాభా నియంత్రణ, వైద్య శక్తుల దుర్వినియోగం వంటి అంశాలను భవిష్యపు ప్రమాదంగా చూపించారు. చినూవా అచెబె పాశ్చాత్య వలసవాదంపై తీవ్ర విమర్శలు చేస్తూనే, ఆఫ్రికన్ సంస్కృతిని ఆదరించే మార్గాన్ని చూపించాడు. అక్యూటెర్ డ్యామ్ నూతన వ్యవస్థలపై తీవ్ర విమర్శలతో రచన చేస్తూ భవిష్య భవితవ్యంపై హెచ్చరికలు చేశాడు. ఇలాంటి రచనలు చదువుతుంటే, సాహిత్యం అనేది, సామాజిక శక్తుల మధ్య సంభాషణను కల్పించాలని, ఊహా ప్రపంచాల ద్వారా నిజ జీవితాన్ని పరిశీలించే శక్తిని పెంచాలని అర్థమవుతుంది. అదే సమయంలో వాస్తవాల ఆధారంగా భవిష్య మార్గాన్ని సూచించాలని, ప్రతి పాఠకుడిలో ఆలోచనను పెంచాలని ఈ రచనలు సూచించడాన్ని గమనించవచ్చు. పాశ్చాత్య సాహిత్యంలో యూటోపియా (ఆకాంక్షిత భవిష్య ప్రపంచం), డిస్టోపియా (వికృత భవిష్య యథార్థం), మానవతా తత్వాలు వంటి అంశాలన్నీ కలసి, సాహిత్య ధర్మాన్ని నిర్వచిస్తున్నాయి. భవిష్యత్ మార్గాన్ని చూపుతున్నాయి. ఈ కోవకు చెందిన కొంత మంది యువ రచయితలు సమాజాన్ని సూటిగా తాకే రచనల ద్వారా పాఠకుల ఆలోచనా పటాన్ని విస్తరించించడం ఆహ్వానించదగిన పరిణామం. ఆధిపత్య వ్యతిరేకత, మానవ హక్కుల పట్ల చైతన్యం, మహిళలు, దళితులు, ఆదివాసీల స్వరాలకు ప్రాతినథ్యం, అభివృద్ధి పేరుతో జరిగే విధ్వంసంపై విమర్శ, వ్యక్తిగత అంతర్భావాల స్వేచ్ఛా ప్రకటనల ఆవశ్యకతలను ప్రస్తావిస్తూ, ప్రతిఘటన స్ఫూర్తిని నింపుతూ, భవిష్యత్తుకు మార్గనిర్దేశనం చేస్తూ రచనలు చేయడం ఓ అపూర్వ దృశ్యం. ఇలాంటి రచనలే నేటి అవసరం. ఈనాటి ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికత, ఆధునికత, గ్లోబలైజేషన్ ప్రభావం ఏటా పెరుగుతోంది. ఈ వాతావరణంలో సాహిత్యం తన మార్గనిర్దేశక ధర్మాన్ని కొనసాగించగలదా అనే సందేహం జనించటం సహజం. కానీ, ఈ మార్పులను ఎలా అర్థం చేసుకోవాలి? వాటిలోని మానవీయతను ఎలా కాపాడాలి? అనే ప్రశ్నలు వేసుకున్న తర్వాతే, రచనలు చేస్తే, సమాధానం దానంతట అదే లభిస్తుంది. నిజానికి ఈనాటి యువత అనేక సవాళ్ల మధ్య జీవిస్తోంది. ఉద్యోగం, మానసిక ఒత్తిడి, అనిశ్చిత భవిష్యత్తు, సోషల్ మీడియా ప్రభావం, ఒంటరితనపు బాధ వంటి ఎన్నో సమస్యలు చుట్టుముట్టి వేధిస్తున్నాయి. ఇలాంటి సమయంలోనే, యువతకు దిక్సూచిగా మారే రచనలు అవసరం. పాఠకుడిని ధైర్యపరిచే రచనలే అవసరం. భవిష్యాన్ని అన్వేషించేలా చేసే రచనలు అవసరం. ప్రశ్నించడం నేర్పించే కథలు, శూన్యంలోకి లాగకుండా భావనల నెత్తుటిని కొద్దిగా ఆపగలిగే రచనలే నేటి అవసరం. 'ఒక మంచి రచన కేవలం ప్రశ్నలు సంధించి, సమాధానాలు ఇవ్వడంతో ఆగిపోదు. సమాధానాలను ఆధారంగా చేసుకొని, మంచి భవిష్యత్తును అందిపుచ్చుకునేలా పాఠకుడిని ప్రేరేపిస్తుంది' అంటాడు ప్రముఖ రచయిత హనిఫ్ ఖురేషీ. ఈ మాటల అక్షర సత్యాలు. ఈ లక్షణాలు ఉన్న సాహిత్యం విస్తారంగా రావాలని కోరుకుందాం. వస్తుందని ఆశిద్దాం.




ప్రజలు దోపిడీని సహజంగా తీసుకోకుండా, ప్రశ్నించే స్థితిలోకి తీసుకురావడం, సమకాలీన చరిత్రకు అద్దం పట్టడం ఒక ఎత్తయితే, మరికొంత ముందుకు వెళ్లి, దార్శనికతను ప్రదర్శించి, భవిష్యత్ నిర్మాణాన్ని కళ్ల ముందు ఆవిష్కరించడం మరో ఎత్తు. సాహిత్యం అంటే కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ మాత్రమే కాదని, అది సమాజాన్ని ప్రతిబింబించాలని, విమర్శించాలని, అవసరమైతే దిశానిర్దేశం కూడా చేయాలని అనుకోవడంలో తప్పు లేదు. ఒక రచయిత కాలానుగుణంగా రచించినా, అతని కలం భవిష్యత్ పరకులను ప్రభావితం చేసేలా ఉండాలి. గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని ఆవిష్కరించి, భవిష్యానికి మార్గం చూపే విధంగా సాహిత్యం ఉండాలి. అలా అయితేనే అది శాశ్వతంగా నిలిచే శక్తివంతమైన రచన అవుతుంది. ఈ సమయంలోనే అసలు రచన లేదా సాహిత్యం అంటే ఏమిటి? అనే ప్రశ్న తలెత్తుతుంది. సాహిత్యం కేవలం భావోద్వేగాల ప్రవాహమా? సామాజిక పరిస్థితుల చిత్రణమా? వ్యక్తిగత అనుభవాల కూర్పా? ఈ ప్రశ్నలకు సమాధానం ఒక్కటే. ఇవన్నీ సాహిత్యంలో భాగాలే. సాహిత్యం సమాజానికి మార్గదర్శకత్వం అందించాల్సిన ఒక శక్తి కావాలన్నదే కీలకం. ఈనాటి యాంత్రిక, యాంత్రికతమయిన ప్రపంచంలో, అసమానతల వలయాల్లో, మానవతా విలువలకు ఎదురవుతున్న పరాభవాల్లో , మార్గం చూపించాల్సింది రాజకీయ నాయకులుకాదు.. మత గురువులు అంతకన్నా కాదు. కలం పట్టు గలవాళ్లే గతాన్ని, వర్తమానాన్నీ చర్చిస్తాడు. భవిష్యత్తును ఊహిస్తాడు. బాటలు నిర్మిస్తాడు. మిగతా భాషల్లో మాదిరిగానే తెలుగులోనూ రచయితలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ, సాహిత్యాన్ని చరిత్ర రూపంలో చూసే దృష్టి చాలా మందిలో కొరవడుతున్నది. సాహిత్యం సమాజపు ప్రతిబింబమే కాదు, దాని మలుపు కూడా అనే అభిప్రాయం చాలా తక్కువ మందిలో కనిపిస్తున్నది. సాహిత్యం సమాజానికి అద్దం అన్న మాట చాలామందికి తెలుసు. కానీ అది సమాజానికి మార్గనిర్దేశక శక్తి కూడా కావాలన్న నిజాన్ని చాలా మంది అర్థం చేసుకోవడం లేదు. సమాజంలో మార్పు రావాలంటే, ముందుగా ఆ మార్పు రచనల్లో ఉండాలి. రచయితలో ఆ తపన ఉండాలి. ప్రతి రచనా జమానవ జీవితానికి సంకేత కావాలి. మార్పు కోసం, కొత్త దిశ కోసం, ఉన్నత లక్ష్యాల కోసం, మరొక మెట్టు పైకి తీసుకెళ్లే చోదక శక్తి కావాలి. సాహిత్యం ప్రాంతీయ పరిమితులను దాటినప్పుడే, విశ్వ మానవతకు తోడ్పడే సాధనమవుతుంది. భారతీయ సాహిత్యంలో మాత్రమే కాదు, పాశ్చాత్య సాహిత్యంలో కూడా కొన్ని రచనలు తమ యుగానికి ముందుగానే భవిష్యాన్ని ఊహించాయి. మానవత్వానికి మార్గాలు చూపించాయి. కొన్ని రచనలు చీకటి భవిష్యాన్ని హెచ్చరికగా ఉంటే, మరికొన్ని ఆశాజనక మార్గాలను ప్రతిపాదించాయి. అన్ని విధాలుగానూ దోపిడీ కొనసాగుతున్న ప్రస్తుత కాలంలో, అలాంటి రచనల శ్రేణి పెరగాలి. ఇక్కడ జార్జి ఒర్వెల్ '1984' నవలను ప్రస్తావించుకోవచ్చు.

**— సత్యశ్రీ**

## చదవాల్సిన పుస్తకం


### ఓ పుస్తకం... రాజకీయ దుమారం!

ఒక పుస్తకం సమకాలీన రాజకీయాలపై ఎంతటి ప్రభావం చూపిస్తుందన డానికి 'ది టిరనీ ఆఫ్ మైనారిటీ: వై అమెరికన్ డెమోక్రసీ రీచ్డ్ ది బ్రేకింగ్ పాయింట్' గొప్ప ఉదాహరణ. 2023 జులై 7న తొలిసారి మార్కెట్‌లోకి విడుదలైన ఈ పుస్తకం అమెరికా రాజకీయాలను కుదిపేసింది. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన స్టీవెన్ లెవిట్స్కీ, డేనియల్ జిబ్లాట్ సంయుక్తంగా రచించిన ఈ పుస్తకంలో, మైనారిటీగా ఉన్న ఒక వర్గం, మెజారిటీ వర్గంపై ఏ విధంగా పె త్తనం చెలాయిస్తున్నదో అద్భుతంగా వివరించారు. సాధారణంగా మైనారిటీలపై మెజారిటీ వర్గాలు జులుం ప్రదర్శిస్తాయి. కానీ, అమెరికా, భారత్ వంటి కొన్ని దేశాల్లో మెజారిటీ వర్గాలను సైతం కొన్ని మైనారిటీ వర్గాలు శాసిస్తా యి. నిలువరిస్తాయి. వారి హక్కులను హరిస్తాయి. ఇలాంటి అంశాలనే ప్రధానంగా పేర్కొంటూ, అమెరికా రాజకీయాల్లోని పరిస్థితిని 'ది టిరనీ ఆఫ్ మైనారిటీ' పుస్తకం విశ్లేషిస్తుంది. అక్కడ మైనారిటీ సమూహం అసమాన అధికారాన్ని, ప్రభావాన్ని కలిగి ఉండడాన్ని ప్రశ్నిస్తుంది. ఈ పుస్తకంలో పేర్కొన్న విషయాల ప్రకారం, మెజారిటీ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా,ఈ మై నారిటీ వర్గం ఏకపక్ష నిర్ణయాలతో అన్ని వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకుంటుంది. ఈ ఆధిపత్యం వివిధ మార్గాల్లో వ్యక్తమవుతుంది, ఉదాహరణకు మెజారిటీకి అనుకూలంగా ఉన్న చట్టాన్ని అడ్డుకోవడం లేదా





కోర్టులు లేదా మీడియా వంటి కీలక సంస్థలను నియంత్రించడం వంటి చర్యలకు ఈ ఆధిపత్య మైనారిటీ వర్గం పాల్పడుతుంది. అమెరికన్ రాజకీయ వ్యవస్థ, రాజ్యాం గం, చారిత్రక సందర్భం వంటి అనేకానేక సున్నిత అంశాలు ఈ మైనారిటీ దౌర్జన్యకాండలో మిళితమై ఉంటాయి. అణచివేతను, లైంగిక దౌర్జన్యాన్ని ని రోధించడానికి ఉద్దేశించిన వ్యవస్థలపై మైనారిటీ వర్గాలు పట్టుబిగించడంతో, మెజారిటీ వర్గాలు నష్టపోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలు మంటకలుస్తున్నాయి. అమెరికాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పతనం అంచుకు చేరిందేమోనన్న అనుమానం వ్యక్తం చేస్తుంది. మెజారిటీ వర్గాల్లో ఉన్న అనైక్యతను, ఆర్థిక దుర్బలత్వాన్ని కొన్ని మైనారిటీ వర్గాలు ఏ విధంగా తమకు అనుకూలంగా మార్చుకొని, చివరికి అధికారాన్ని చేపట్టి, పెత్తనం చెలాయిస్తున్నారో ఈ పుస్త కం వివరిస్తుంది. మన దేశంలో మెజారిటీగా ఉన్న బిసిలకు రాజ్యాధికారం ద క్కకుండా, అత్యంత మైనారిటీగా ఉన్న కొన్ని కులాలు ఏ విధంగా పెత్తనం చెలాయిస్తుందో ప్రత్యక్షంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ పుస్తకం విలువ స్పష్టమవుతుంది.

## సంక్లిష్టమైన భాష..




ఆంగ్ల సాహిత్యంలో అత్యంత క్లిష్టమైన భాషా శైలితో కూడిన రచనగా విలియం ఫాక్‌నర్ రచించిన 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరి' (The Sound and the Fury) నవలను ప్రముఖంగా పేర్కోవాలి. ఈ నవల భాష, శైలి, కథన విధానం చాలా సంక్లిష్టంగా ఉంటాయని విమర్శకులు పేర్కొంటున్నారు. తెలుగు లేదా భారతీయ సాహిత్యంలో, ప్రాచీన సంస్కృత నాటకాలు, ఉదాహరణకు భవభూతి రచించిన 'మాలతీ మాధవం' కూడా క్లిష్టమైన భాషా శైలికి ఉదాహరణగా చెప్పవచ్చు, ఎందుకంటే వీటిలో ఉపయోగించిన పదాలు, భావాలు, శైలీ చాలా అధునిక పాఠకులకు క్లిష్టంగా ఉంటాయి. 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరి' విషయానికి వస్తే, ఇది 1929లో ప్రచురితమైంది. ఇది అమెరికన్ సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన నవలల్లో ఒకటి. ఈ నవల కథ మిసిసిప్పిలోని జెఫర్సన్ అనే ఊరిలో నివసించే, ఒకప్పుడు గొప్పగా ఉన్న కానీ, ఇప్పుడు పతనమవుతున్న కాంప్సన్ కుటుంబం చుట్టూ తిరుగుతుంది. ఈ నవల మొత్తం నాలుగు భాగాలుగా ఉంటుంది. మొదటి మూడు భాగాలు ముగ్గురు సోదరులు (బెంజీ, క్వింటిన్, జేసన్) దృష్టికోణంలో కథ నడుస్తుంది. నాలుగో భాగం కుటుంబ సేవకురాలు డిల్సీ దృష్టికోణంలో కొనసాగుతుంది. రచనలో భాషా శైలి, కాలక్రమం చాలా సంక్లిష్టంగా, అసంపూర్ణంగా ఉంటుంది. ముఖ్యంగా బెంజీ భాగం పూర్తిగా స్ట్రీమ్‌ఆఫ్‌కాన్షియస్‌నెస్ (స్వచ్ఛంద ఆలోచనల ప్రవాహం) శైలిలో ఉంటుంది, కాల పరిమితి లేకుండా జ్ఞాపకాల మధ్య తిరుగుతుంది. ప్రధాన పాత్రల్లో, బెంజీ (మానసికంగా వికలాంగుడు), క్వింటిన్ (హార్వర్డ్ విద్యార్థి, కుటుంబ గౌరవంపై మక్కువ), జేసన్ (క్రూరమైన వ్యక్తి. స్వార్థపరుడు), క్యాడీ (కుటుంబాన్ని ప్రభావితం చేసిన సోదరి), డిల్సీ (పరిచారిక). నవలలో కుటుంబ పతనం, కాలం, జ్ఞాపకాలు, నైతిక విలువల పతనం వంటి ప్రధాన థీమ్స్ ఉన్నాయి. శైలి, కథన విధానం, కాలక్రమం కారణంగా ఈ నవల చదవడం చాలా కష్టం. కాగా, ఈ నవలలో ఉపయోగించిన స్ట్రీమ్‌ఆఫ్‌కాన్షియస్‌నెస్, కాలక్రమం లోని అసంపూర్ణత, విభిన్న దృష్టికోణాలు వంటి ప్రయోగాత్మక శైలులు, కథను చెప్పే పద్ధతులపై కొత్త దృష్టిని అందిస్తాయి. పాత్రల లోతు, భావోద్వేగాల విశ్లేషణ: పాత్రల అంతర్గత సంఘర్షణలు, వారి భావోద్వేగాల ప్రతిబింబం చదువరుని లోతైన మానవీయ విశ్లేషణ వైపు నడిపిస్తాయి. భిన్నమైన కథన విధానాలు, భాషా ప్రయోగాలు, కాల పరిమితి లేని కథనం వంటి అంశాలు, మీరు సాహిత్యాన్ని ఎలా చదవాలి, ఎలా రాయాలి అనే దృష్టిలో కొత్త కోణాన్ని పరిచయం చేస్తాయి. సామాజిక, మానవ సంబంధాలపై కొత్త ఆలోచన ఏర్పడుతుంది. కుటుంబ పతనం, వ్యక్తిగత విఫలతలు, సమాజంలో మార్పులు వంటి అంశాలపై లోతైన ఆలోచన కలుగుతుంది. ఈ విధంగా, క్లిష్టమైన శైలిలో రాసిన రచనలను చదవడం వల్ల పాఠకుల సాహిత్య అభిరుచిలో, విశ్లేషణా సామర్థ్యంలో, ఆలోచనా విధానంలో కొత్త మార్పులు వస్తాయి.




## తొలి నవల ఏది?

ప్రపంచపు తొలి నవల ఏది? ఈ ప్రశ్న చిన్నదే గానీ, సమాధానం చెప్పడానికి విస్తారమైన అన్వేషణ అవసరం. ఎంతో మంది సాహితీ చరిత్రకారులు అనేకానేక అంశాలను పరిశీలించి, సమీక్షించి, మధించి, చివరికి జపాన్ రచయిత్రి మురసాకీ శికిబు రచన 'గెంజీ కథ' (ది ఆఫ్ గెంజి)ను తొలి నవలగా ప్రకటించారు. ఇప్పటికీ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. హీయాన్ కాలంనాటి ఈ రచనలో హికారు జెంజీ అనే రాజకుమారుని జీవితం, ప్రేమలు, రాజకీయాలు, సమాజాన్ని ఆధారంగా చేసుకుని కథ ముందుకు వెళుతుంది. షికిబు రచనలు, ముఖ్యంగా ఆమె 'ది ది ఆఫ్ గెంజీ', ప్రపంచ సాహిత్యంపై విప్లవాత్మక ప్రభావాన్ని చూపాయి. ఈ నవలను ప్రపంచంలోనే మొట్టమొదటి మానసిక నవలగా కూడా పరిగణిస్తారు, ఇది సాహిత్యంలో కథన నిర్మాణం, పాత్రల మానసిక లోతు, సాంస్కృతిక వివరాల సమగ్రతను పరిచయం చేసింది. షికిబు రచనల ద్వారా జపనీస్ సాహిత్యం ప్రపంచ సాహిత్య వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందింది, అలాగే మహిళా రచయిత్రుల పాత్రకు ప్రాధాన్యం ఏర్పడింది. 'ది ది ఆఫ్ గెంజీ' లోని భావోద్వేగాలు, సామాజిక, రాజకీయ నేపథ్యాలు ఇతర భాషల సాహిత్య రచనలపై కూడా ప్రభావం చూపాయి. సాహిత్య అనువాదాలు ద్వారా ఈ ప్రభావం మరింత విస్తరించింది. ఆమె రచనలో బౌద్ధ ధర్మ భావాలు, మానవ సంబంధాల లోతైన విశ్లేషణలు ప్రపంచ సాహిత్యంలో సృజనాత్మకతకు కొత్త దారులు చూపించాయి. షికిబు సాహిత్య శైలీ, పాత్రల మానసిక విశ్లేషణలు పాశ్చాత్య సాహిత్యంలో కూడా ఆదర్శంగా నిలిచాయి, తద్వారా నవల రూపంలో కొత్త ప్రమాణాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా, మురాసాకి షికిబు రచనలు ప్రపంచ సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచాయి, నవలల రూపకల్పన, పాత్రల అభివృద్ధి, సాంస్కృతిక ప్రతిబింబాల పరంగా సుదీర్ఘ ప్రభావం చూపాయి. సంప్రదాయ జపనీస్ భాషలో ఉన్న ఈ రచనా కాలాన్ని క్రీస్తుశకం 1020 ప్రాంతం నాటిదని చెప్తారు. సరైన సంవత్సరంపై ఇంకా స్పష్టత లేదు.




## 'ఉలిపికట్టె' కథాకమామీషు

'ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపికట్టెది మరోదారి' అనే తెలుగు సామెత అందరికీ తెలిసే ఉంటుంది. ఈ మాటకు ఉలిపికట్టె, ఉలిపిగొట్టు, ఉలిపిరిగొట్టు అనే రూపాంతరాలున్నాయి. ఈ పదం 'చివరి కట్టె', 'మొండికట్టె', 'కష్టాలన్నీ ఈ కట్టెతోగాని పోవు' వంటి పద ప్రయోగాల్లోని 'కర్ర' అనే పదానికి, ఇందాకటి సామెతలో 'కట్టె' అనే పదానికి సారూప్యం ఎంతమాత్రం లేదు. మానవ శరీరాన్ని 'కర్ర' లేదా 'కట్టె'తో పోల్చడం ఆనవాయితీ. అందుకే, ఆ పదబంధాల్లో వినిపించే కట్టె అనే పదాన్ని శరీరంగా భావించాల్సి ఉంటుంది. ఇక ఉలిపి కట్టె విఃయానికి వస్తే, 'ఉలిపి' అనే పదాన్ని నామవాచకంలో వాడినప్పుడు పొగరుబోతు, దుర్మార్గుడు, పెడమనిషి, కోపదారి వంటి అర్థాలు ఉన్నాయి. అయితే, ఉలిపి అనే చెట్టు కూడా ఉంది. దాని కట్టె ముక్కలను బాణాసంచా తయారీలో ఉపయోగిస్తారు. ఈ కర్ర కాలేటప్పుడు చిటపటలాడుతుంది. ఈ కట్టెముక్కలాగానే మటమటలాడే వ్యక్తిని ఉలిపి (కట్టె/గొట్టు) అని వ్యవహరిస్తారు. దీని రూపాంతరమైన 'ఉలిపిరి'ని చాలా నిఘంటువులు చేర్చలేదు. కానీ 'ఉలిపిరి కాగితం' (ట్రేసింగ్ పేపర్) వంటి సమాసాల్లో తేలికైన, పల్చని, తిన్నగా చినగని మొదలైన అర్థాల్లో వాడుకలో ఉంది. ఎర్రడాలున్న తెల్లమచ్చలనూ,తెలుపుమీద మసరగా ఉండే మచ్చలున్న మబ్బురంగునూ ఉలిపిరి అంటారు. జిల, మంట, చికాకు, బాధ పుట్టించే రోగాన్ని ఉలిపితెగులు అంటారు.

ఈ వారం కవితలు

## అధర్మ స్థలం

అక్కడ ఎవరున్నారని వెళ్తున్నారు
ఆ చోటులో ఏముందని అడుగుతున్నారు
చుట్టూ కళేబరాల నడుమ
ప్రార్థనా మందిరంలో
నిత్య జన సందోహం!
భక్తి పారవశ్యంలో
చుట్టూ చూసే ఆరా తీసే
తీరికా లేదు సమయమూ లేదు !
శ్మశానమా?! కాదు

అత్యాచారాల్లో ఆరితేరిన
మానవుల అలికిడి గాంచలేని
యువతీ యువకులు
అర్ధాంతరంగా చంపబడుతున్నారు
దేహాలు పూడ్చబడ్డాయి ఎక్కడబడితే
అక్కడ రక్షక భటనిలయాల్లో
ఫిర్యాదులకు సైతం
నోచుకోబడని దేహాలవి
బంధుమిత్రులను
నయానా భయానా
ఆ చోటునుండి వెళ్ళగొట్టిన
పెత్తందారీ వ్యవస్థ !
కులమూ లేదు మతమూ లేదు
అంతా పురుషాధిక్య పైత్యంలో
స్థలంలో స్థానభ్రంశం క్షణాల్లో
ఒకటో రోజో రెండో రోజో

గుట్టుచప్పుడు కాకుండా
బొందో దహనమో యథేచ్ఛగా!
వెనుక ఎన్ని హస్తాలుంటేనో
ఇన్ని ఘోరాలు!
ప్రాయశ్చిత్తం ముసుగులో
ఒక విజిల్ బ్లోయర్ వచ్చాడు
అయినా సంఘాన్ని విజిల్ వేసి
లేపే వాడెవ్వడు?
అంతా గాఢ నిద్ర నటన!
నటులున్న సంఘంలో
నాటుకున్న మౌఢ్యాన్ని
తుడిచేసేదెవ్వడు?!
భక్తి నాటకంలో
ఎన్ని ఆకృత్యాలు జరిగాయో
వెలుగులోకి వచ్చేనా?!
తగ్గని జనాల పోటు
పొట్లు పట్టని జనాలు
సిగ్గు! సిగ్గు!!

– గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## 'నడుమంటిన పొట్టకెన్ని తిప్పలో'



ఆకలితో నడుముకు అంటుకున్న
కడుపు కేకలేస్తూ
సత్తు బొచ్చట్టుక్కుని
వణికే కాళ్ళతో దేవురిస్తూ

తిరుగున్న వీథుల్లో
ఆ దైన్యపుబాలలపై
నిర్దాక్షిణ్యంగా బుల్లెట్ల వర్షం
బీట్రూట్ కూరలా
రక్తపుముద్దలు పేరుకుంటున్న చోట

ఆవురుమంటూ పొడుస్తున్న
రాబందుల రెక్కల సవ్వడి
ఎవరిని కదిలించదా
సభ్య ప్రపంచపు పిడికిళ్ళు
బిగిసేదెపుడు

గాజా ఇలా గాజుబొమ్మలా
ఛిద్రమవ్వాల్సిందేనా

అగ్రరాజ్యపుటుగ్రచేష్టకు
శవాలదిబ్బవుతున్నా
చూస్తూనే వుందామా?
కడుపుకింతన్నం తింటున్నాంకదా!

మన తిండిని త్యాగం చేసి
ఆకలిమంటలనార్పలేమా?
ఆలోచించండి బుద్ధిజీవులారా!
ఎవరో ఒకరు అడుగేస్తే
వందడుగులనుసరిస్తాయేమో!
మానవత్వమనేది నిజమే ఐతే.

కపిల రాంకుమార్
9849535033

## ఎందుకో?

పగలు పిలుస్తుంది
తిమిరంతో సమరంచెయ్యమని
అందాలు ఆహ్వానిస్తున్నాయి
వికారాలను విదిలించుకోమని
పూలు ప్రాధేయపడుతున్నాయి
తుంచకుండా పరిరక్షించమని
ఊహలు ఊరుతున్నాయి
మనసును శుద్ధిచెయ్యమని
మెదడు బ్రతిమిలాడుతోంది
అజ్ఞానాంధకారాన్ని పారద్రోలమని
పలుకులు తేనెనుచిమ్ముతున్నాయి
నిస్సారాన్ని నిరోధించమని
ప్రకృతి అర్థిస్తుంది
విచ్ఛిత్తికి పాలుపడవద్దని
నీలిమబ్బు చినుకులుచల్లుతుంది
క్షామకరువులను కట్టడిచెయ్యాలని

– రాజేంద్రప్రసాద్

## ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

సమాచార హక్కుల కమిషనర్ శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ పివి. శ్రీనివాసరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, కృపఉష, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి, ఇతర అధికారులతో ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి అక్కడికక్కడే వైద్యం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆరోగ్య కేంద్రంలోని పరిశుభ్రత, ఔషధ నిల్వలు, రోగులకు అందుతున్న సేవలు, వైద్య సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కుల కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య హక్కు రాజ్యాంగపరమైన హక్కు అని, ప్రతి పౌరుడికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొప్పుల అశోక్, న్యూడెమోక్రసీ నాయకులు కె.నాగేశ్వరరావు, మేకల చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర సారపాక 24వ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర సారపాక 24వ ప్రమాణ స్వీకార కార్యక్రమం కళాభారతి ఆడిటోరియం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటిసి పిఎస్‌పిడి భద్రాచలం యూనిట్ హెడ్ రోటేరియన్ శైలేందర్ కుమార్ సింఘ్ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి, రోటరీ సేవల పట్ల తమ ప్రశంసలు వ్యక్తం చేశారు. గౌరవ అతిథి ఇన్స్టలేషన్ ఆఫీసర్‌గా రోటరీ జిల్లా గవర్నర్ రోటేరియన్ రామ్‌ప్రసాద్ నూతన అధ్యక్షుడు రోటేరియన్ కునిశెట్టి రాంబాబుకి, కార్యదర్శి రోటేరియన్ చాంద్‌బాషాకి, కోశాధికారి, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అయినటువంటి రోటేరియన్స్ జీవన్ కుమార్, సాయిరాం, చంగల్‌రావు, చంద్రశేఖర్ యాగీ, రంజిత్ కుమార్, గోవిందరావు, తిరుపతిరావు, ప్రతాప్ కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, ప్రఫుల్ల కుమార్, మురళీధర్, మహేష్, శివ రామకృష్ణన్, మురళి కృష్ణ, దేవిడ్ ఒలివర్, సౌరవ్ ముఖర్జీ, విశాల్‌చే ప్రమాణ స్వీకారం చేయించి అధికార బాధ్యతలు అప్పగించారు. ఈకార్యక్రమంలో రోటరీ సభ్యులు ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ డివిఎం నాయుడు, శ్యామ్ కిరణ్, భాస్కర్, జయంత్ కుమార్ దాస్, జగదీష్ తమక్ ఉన్నారు.



## మహిళాశక్తిని చాటిచెప్పేవే బోనాల పండుగలు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మహిళాశక్తిని చాటి చెప్పేవే బోనాల జాతరలు, పండుగలని, అనాదిగా తెలంగాణ రాష్ట్రవ్యాపితంగా పెద్ద ఎత్తున బోనాల పండుగలు జరుపుకొని మహిళలకు ఉన్నత స్థానంలో నిలుపుతున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. పట్టణంలోని రైతుబజారులో వ్యాపారుల కుటుంబాలు ఆదివారం నిర్వహించిన శ్రావణమాస బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, స్త్రీలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో మహోన్నతమైన సంప్రదాయమని, అనాదిగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని నేటితరం కొనసాగించడం అభినందనీయమన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ఆచరిస్తూ వాటిని భావితరాలు అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని, ఇలాంటి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచి రాగద్వేషాలను, అంతరాలను దూరంచేస్తాయని, తద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాము, మదన్ లాల్, వేణు, పద్మ, కుమారి, తులసి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించదా?

సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు

**ప్రజాపక్షం/బోనకల్ :** ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించదా అని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రశ్నించారు. అదివారం చిరునోముల గ్రామంలోని 11వ వార్డులో నెలకొన్న సమస్యలను గ్రామస్థులను కలిసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యంగల మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఖమ్మం రోడ్డుగల ఎస్సార్ ఫంక్షన్ హాల్ నుంచి చిరునోముల 11వ వార్డు రమేష్ హోటల్ వరకు విద్యుత్ స్థంబాలను, విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) మండలసమితి ఆధ్వర్యంలో మండల విద్యుత్ అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామని అన్నారు. అనేకసార్లు ప్రజావాణి కార్యక్రమంలో ప్రత్యేక అధికారులను కలిసి సమస్యను విన్నవించామని అన్నారు. అయినప్పటికీ నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వందలాంది మంది చిరునోముల, చోప్పకట్లపాలెం, ముష్టికుంట్ల తదితర గ్రామాల నుండి పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తున్నారన్నారు. కాలినడకన రాత్రి సమయంలో తిరిగి వేళ్లే సమయంలో మహిళలు, వృద్ధులు విద్యుత్ దీపాలు లేక భయాబ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో వైన్స్ ఉండడం వల్ల మహిళలు రాత్రిళ్లు ఇటుగా నడిచే వెళ్లాలంటే ఇబ్బందులు, ఆకతాయిల వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సౌకర్యార్థం వారి ఇళ్లకు సిమెంట్ రోడ్లు, విద్యుత్ స్థంబాలు, దీపాలు ఏర్పాటు చేస్తున్నారే తప్ప, నిజమైన సమస్య ఉన్నచోట సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. ఇప్పటికైనా మండల విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించాలని సిపిఐ మండల సమితి పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బొమ్మినేని కొండలరావు, తోటపల్లి ఆనందరావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.



## కనీస వేతనాన్ని ఇవ్వాలి

ఎఐటియుసి

**ప్రజాపక్షం/కల్లూరు :** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం 18000 చెల్లించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లూరులో ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో కార్మికులకు విభాగాలను బట్టి వేరువేరుగా జీతాలు చెల్లించడం సబబు కాదని అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం కనీస వేతనం 18000 వేయాల్సి ఉండగా అది చెల్లించడం లేదని అన్నారు. చట్టాలను పటిష్ఠంగా అమలుచేయాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తూ హక్కులను కాలరాస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో కార్మికులకు అవగాహన కల్పించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, ఎఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, ఎఐటియుసి నాయకులు వజేర్మియా, ఊడల కృష్ణ, ప్రకాష్, చింత పంటి శ్రీను, జగదీష్, చార్లెస్‌లతోపాటు సునీత, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సత్యనారాయణపురంలో గల టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్ల వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా వారు నివాసం ఉంటున్న వెంచర్లలోని మౌలిక వసతుల సమస్యలపై హాజరైన ప్రజాప్రతనిధులు, అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జెఎసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు,ఆర్టీఏ కమిషనర్ శ్రీనివాసరావు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరుహరినాథ్‌బాబు, సంఘం నాయకులు విజయ్, శ్రీనివాసరావు, సత్యానారాయణ, పుల్లయ్య, రవికుమార్, రాములు, వేలాద్రి, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దారి తప్పుతున్న కౌమారం

కొంపముంచుతున్న ఆన్‌లైన్ పరిచయాలు

హద్దులు దాటుతున్న టీనేజ్ యువత

విష్య సంస్కృతిని నాటుతున్న రీల్స్



**ప్రజాపక్షం/వైరా :** యువతీ, యువకులు మారాం చేస్తున్నారని తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ కొనిపెడుతున్నారు. ఆ ఫోన్‌లో తన స్నేహితులతో కాలక్షేమం చేయడం ప్రారంభిస్తారు. వివిధ వెబ్‌సైట్లతో సంబంధం లేని అనేక అంశాలకు ఆకర్షితులు అవుతున్నారు. చివరకు చదవడం పక్కన పెట్టేసి, ఫోన్ చేతిలో లేకుండా ఉండలేని పరిస్థితికి వచ్చేస్తున్నారు. ఎదిగీఎదగని వయసు, తెలిసీతెలియని మను ఆకర్షణ, ఆపై తప్పటడుగులు వేసి టీనేజ్ తప్పేలా చేస్తుంది. మరోవైపు సామాజిక మాధ్యమాలు కౌమరంపై విషం చిమ్ముతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్, ఓటిటిలు, సీరియల్స్, రీల్స్ విషబీజాలు నాటుతున్నాయి. ప్రేమ పేరిట కొందరు, పరిచయం పేరిట మరికొందరు యువతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్మార్ట్ వల విసిరి, చాటింగ్‌తో మొదలుపెట్టి ముగ్గులోకి దింపుతున్నారు. అవసరం తీరాక కనబడకుండా ముఖం చాటేస్తున్నారు. ఇలా చోటుచేసుకునే దారుణాలు గురించి తెలియక బాలికలు, యువతులు మోసపోతున్నారు. తల్లిదండ్రుల అతిగారబమో, అతి నమ్మకమో, నిర్లక్ష్యమో తెలియదు గాని, యూత్ ట్రాక్ తప్పుతుంది. చివరకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కి బోరున విలపించడం తప్ప చేసేదేమీ లేక చూస్తూ ఉంటున్నారు. ఇలా ఒకటికాదు, రెండు కాదు, నిత్యం పదుల సంఖ్యలో కేసులు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నమోదవుతున్నాయి. పరువుపోతుందని అనుకున్న వారు రాష్ట్రంలో వేలల్లో ఉంటున్నారు. కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్న టీనేజ్ ప్రేమలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక..**

ఇటీవల ఓ యువతి హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హాస్టల్‌లో వసతి పొందుతుంది. కార్యాలయం నుంచి తీసుకొచ్చే ర్యాపిడో డ్రైవర్‌తో ప్రేమలో పడింది. తల్లిదండ్రులు వారించినా వినకుండా డ్రైవర్‌ను పెళ్లిచేసుకుంది. వారిద్దరి మధ్య ఏమైందో ఏమో గాని సఖి కేంద్రాన్ని ఆశ్రయించింది. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేక సోషల్ మీడియా ప్రభావంతో టీనేజ్ యువత ఇలా దారితప్పుతుంది. పిల్లలు అల్లరి చేస్తున్నారని, ఫోన్ ఇస్తే వారి పని వారు చేసుకుంటారని కొనిపెట్టారు.

కొందరు ఉపాధి కోసం, కొంతమంది భార్యాభర్తలు వారి ఉద్యోగ పనుల నిమిత్తం బయటకు వెళుతూ పిల్లలను పెద్దవారి వద్ద ఉంచుతున్నారు.

## అమరుల స్ఫూర్తి
# భవిష్యత్తు ఉద్యమాలకు పునాది



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుది శ్వాస వరకు పేదల పక్షాన నిలిచి ఎర్రజెండా నీడలో హక్కులు, సంక్షేమం కోసం పోరాడి ఒరిగిన అమరుల స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమాలకు పునాది కానుంది. అమరుల ఆశయ సాధనకు కృషి చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించవచ్చు. అమరుల పోరాట స్ఫూర్తిని ప్రస్తుత రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అన్వయించుకుని పోరాటాలకు సంసిద్ధులు కావాల్సిన బాధ్యత, అవసరం ఎంతైనా ఉంది. ఈ తరం స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాల్సిన వ్యక్తులలో దొండపాటి వెంకయ్య ఒకరు. ఆయన మరణించి 47 సంవత్సరాలు గడిచినా ప్రజల మదిలో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారు. రజాకారులకు ఎదురొడ్డి పోరాడిన ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా ఉద్యమ నిర్మాణంలో తనదైన పాత్ర పోషించారు. ఆయన పోరాట పటిమ నేటి తరాలకు ఆదర్శప్రాయం. ఖమ్మం పాత తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో దొండపాటి ప్రధాన పాత్రధారునిగా, సూత్రధారునిగా వ్యవహరించారు. అమ్మపాలెంలో జరిగిన ఖమ్మం పాత తాలూకా కమిటీ సమావేశం ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక మూల మలుపుగా మారింది. ఆ సమావేశం తర్వాత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా దొండపాటి వెంకయ్య సేవలు ఇప్పటికీ పలు గ్రామాల్లో చర్చించుకుంటారు. పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు దివంగత సిపిఐ నేతలు మహ్మద్ రజబ్‌అలీ, చావా వెంకటేశ్వరరావు, కర్నాటి కృష్ణయ్య, గడల సీతారామయ్య, తుళ్లూరి సత్యం, వాసిరెడ్డి వెంకటపతి లాంటి ఎందరో నాయకులతో కలిసి దొండపాటి పనిచేశారు. నల్లమల గిరి ప్రసాద్‌ను ఆదర్శ నాయకునిగా చెప్పుకునే దొండపాటి ఆయన నాయకత్వంలో పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలు గ్రామాల్లో ఎస్సీ, బిసి, అట్టడుగు వర్గాలకు నివాస స్థలాలను సమకూర్చడంలో వెంకయ్య కృషి మరువలేనిది. తరాలు మారుతున్నా వెంకయ్య సేవలు నేటికీ ప్రజలు స్మరించుకుంటున్నారు. అటువంటి వీరులు చూపిన బాటలో పయనించడమే మనం వారికిచ్చే ఘన నివాళి అన్నారు.

**రేపు దొండపాటి వర్ధంతి సభ :**

దివంగత కమ్యూనిస్టు నేత దొండపాటి వెంకయ్య వర్ధంతి సభను ఈనెల ఐదున కొణిజర్లలో నిర్వహించనున్నారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, దొండపాటి రమేష్‌లతో పాటు పలువురు పాల్గొననున్నట్లు మండల కార్యదర్శి గడల భాస్కర్ తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని దొండపాటి వెంకయ్యకు నివాళులర్పించాల్సిందిగా భాస్కర్ కోరారు.

# బుర్ర భద్రయ్య, కోర్స చంద్రయ్య అకాల మృతి బాధాకరం

నివాళులర్పించిన సిపిఐ నేత నరాటి ప్రసాద్, యూసుఫ్



**ప్రజాపక్షం/ములకలపల్లి :** వికేరామారం పంచాయితీ కార్మికుడు బుర్ర భద్రయ్య పార్థివదేహాన్ని సందర్శించి సిపిఐ, ఎఐటియుసి జిల్లా నాయకత్వం ఘనంగా నివాళులర్పించారు. సంజీవ్‌పల్లి గ్రామంలో వికే రామారం పంచాయతీలో గత తొమ్మిది సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీ కార్మికుడిగా సేవలు అందిస్తూ ఆదివారం ఉదయం అనారోగ్యంతో కార్మికుడు బొర్రా భద్రయ్య మృతి చుందాడు. కాగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల మహేష్, బుర్ర భద్రయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరపున రావాల్సిన ఇన్సూరెన్స్ వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. సీతారాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మనానగర్ గ్రామంలో సిపిఐ నాయకుడు కొరసా చంద్రయ్య గ్రామ పెద్ద చనిపోయాడు. కాగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి మొహమ్మద్ యూసుఫ్ కొరసా చంద్రయ్య పార్థివదేహాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ కుటుంబానికి సిపిఐ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకే కుమార్, మడివి అర్జున్, సిపిఐ నాయకులు దొంతుల మాధవ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇది బాత్రూమా? బడ్డీకొట్టా?

నివ్వెరపోతున్న స్వయం సహాయక సంఘాలు



**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరులోని స్త్రీశక్తి భవనంలో గత వారం రోజులు క్రితం స్వయం సహాయక సంఘాల వారికి నూతనంగా నిర్మిస్తున్న రేకుల మరుగుదొడ్డి తో మహిళా సంఘాలు నివ్వెర పోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఆరు నెలల క్రితం మండల పరిధిలోని 46 గ్రామ సమైక్యల వారు లో నుంచి 36 గ్రామ సమైక్యల వారు ఒక్కొక్క గ్రామ సమీకరించి వెయ్యి రూపాయలు చొప్పున మండల సమైక్య ఖాతాలో జమ చేశారు.

మరుగుదొడ్డి నిర్మించకపోవడంతో తర్వాత జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా ఈ విషయంలో సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో పేద మహిళల నుంచి మరుగుదొడ్డి కోసం నేటికీ ఆరు నెలలు గడిచినా మరుగుదొడ్డి నిర్మించలేదని ఎమ్మెల్యే రాగమయి దృష్టికి తీసుకురాగా పేద మహిళల నుంచి వసూలు చేయవద్దని ప్రభుత్వం నుంచి మరుగుదొడ్డి కట్టిస్తామని తెలియపరచగా అయినా లెక్కచేయకుండా గత ఎపిఎం బీరవల్లి రాంబాబు రేకుల షెడ్డు బడ్డీకొట్టువలె ఓ కాంట్రాక్టుకు అప్పగించి నిర్మిస్తున్న సమయంలో ఎంపిడిఒకు కార్మిక సంఘాలు, సిపిఐ దృష్టికి తీసుకురాగా అట్టి మరుగుదొడ్డి అనుమతి లేకుండా కట్టిస్తున్నామంటూ ఆ స్థలం వేరే వారిదంటూ ఎంపిడిఒ నిలుపుదల చేశారు. ఇట్టి విషయమై స్వయం సహాయక సంఘ సభ్యులు మండల ప్రజలు బడ్డీకొట్టు వలె ఉన్న మరుగుదొడ్డిని చూసి నవ్వులపాలు అవుతున్నారు. ఈ విషయమై గ్రామ సమాఖ్యలు చెల్లించిన 36000 రూపాయలు తిరిగి చెల్లించాలని ఈ ఎంపిడిఒ చంద్రశేఖర్‌కు వివోఎలు, మెప్మాఆర్‌పిలు ఫిర్యాదు చేయగా ఎపిఎం సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వెళ్లాడని ఎంపిడిఒ తెలిపారు. చెల్లించనిచో అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు.

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని మీనవోలు కట్టలేరు వద్ద చేపల వేటకు వెళ్లి మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ కోరారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించే గిరిజన కుటుంబాలకు చెందిన వ్యక్తులు పనికి వెళ్లి వచ్చి ఆశతో చేపల వేటకని కట్టలేరు నదికి వెళ్లి నదిలో గల్లంతైన ముగ్గురు తిరిగిరాని లోకాలకు వెళ్లారని అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బంజర గ్రామానికి వెళ్లి మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయ కూలీలకు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు కూలీ బీమా వర్తింప చేసి రూ. 5లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ కూలీ బీమాను వర్తింపచేసి కూలీలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన నిరుపేదలైన గిరిజన కుటుంబాలకు చెందిన బాదావత్ రాజు, భూక్యకోటేశ్వరరావు, భూక్య సాయిరాం కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఆంగోతు వెంకటేశ్వర్లు, నాయకులు బిక్షాలు, వెంకటరామయ్య, దివ్వెల వీరాంజనేయులు, బాధిత కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో ఘనంగా వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ధరింపచేసి తర్వాత భక్తుల దర్శనం కల్పించటం జరిగింది. ఉదయం 8.15గంటలకు స్వామివారి అనుజ్ఞ పొంది యాగశాల యందు పూజాదికములు ప్రారంభించి విఘ్నేశ్వర పూజ, పుణ్యవహాచనం, పంచగ ప్రాశన, రుత్వికరణం, మండపారాధనల అనంతరం ప్రధాన కలశస్థాపన ప్రధానఅర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించారు. ఈసందర్భంగా పూజారి శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వరస్వామికి శ్రావణమాసంలో జరిపే ప్రవితోత్సవం ఎంతో నయన మనోహరంగా నిర్వహిస్తారని తెలిపారు. పూజా కార్యక్రమంలో జరిగే లోపాల నివృత్తి కోసం ఆ పవిత్రోత్సవాలు ఆచరించడం ధర్మమని మహర్షులు తెలిపారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## రామచిలుకకు వైద్య సాయం అందించిన గురుదేవ్ విద్యాలయం



**ప్రజాపక్షం/చర్ల :** అనారోగ్యంతో కదలలేని రామ చిలుకను చూసి వదిలివేయకుండా వైద్య సాయం అందించి అటవీ శాఖాధికారులకు అప్పగించిన ఘటన చర్లలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక గురుదేవ్ విద్యాలయ పరిసరాల్లో ఓ చిలుక నడువలేని స్థితిలో ఉండటాన్ని ఉపాధ్యాయులు గమనించారు. వెంటనే దానిని చేరదీసి దానికి వైద్య సాయం అందించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత దానిని అటవీ శాఖాధికారులకు అప్పగించారు. చిలుక కాలుకు 126 క్రిష్ అనే నెంబర్ అమర్చి ఉండడంతో అది జియో ట్యాగింగ్ అని అనుమానం కలుగడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దానిని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అది పెంపుడు చిలుకని అది జియో ట్యాగింగ్ కాదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఇదే తరహాలో జియో ట్యాగింగ్ కలిగిన ఓ గ్రద్ద చర్ల మండలంలో చక్కర్లు కొడుతుండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది.



## దండికి మున్నూరుకాపు నేతల ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌కు పార్టీలకతీతంగా మున్నూరుకాపు సంఘం జిల్లా నేతలు ఘన సన్మానం చేశారు. ఈమేరకు ఆయనను ఏదులాపురం నివాసంలో ఆదివారం కలిసి సంఘీభావం తెలిపారు. తొలుత ఖమ్మం నగరం నుంచి కార్ల ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా దండి సురేష్‌రాజేశ్వరి దంపతులను పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా ఎర్రజెండా చేతబట్టి బడుగు బలహీనవర్గాల కోసం పేదల పక్షపాతిగా పనిచేస్తున్న దండి సురేష్‌కు సిపిఐ ఇచ్చిన గుర్తింపు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పార నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, కార్పొరేటర్లు తోట రామారావు, చామకూరి వెంకట నరసయ్య, మాటేటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మేకల బిక్షమయ్య, శీలంశెట్టి వీరభద్రం, తాళ్లూరి హనుమంతరావు, ముత్యం ఉప్పల్‌రావు, పాశం వెంకటేశ్వర్లు, ఆళ్ల కృష్ణ, మాధురి మధు, పొన్నం వెంకటేశ్వరరావు, గీత వెంకన్న, దాసరి మధు, 60డివిజన్ల మున్నూరుకాపు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.

**తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అభినందన**

సిపిఐ జిల్లా కార్యదర్శిగా దండి సురేష్ ఎన్నికపట్ల తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, ఖమ్మం ప్రెస్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు, సంఘం సభ్యులు శెట్టి రజనీకాంత్, హరీష్, రాంబాబు, జగదీష్, బిక్కి గోపి, జీవన్ రెడ్డి, తిరుపతిరావు, సాయి, పాశం వెంకటేశ్వర్లు, మోహన్ పాల్గొన్నారు.



## ధన్యజీవి లాల్‌సింగ్ నాయక్

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/పాల్వంచ :** సేవాలాల్ సేన ఆశయాలను కొనసాగించిన భూక్య లాల్ సింగ్ నాయక్ ధన్యజీవి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. పాల్వంచ మండల పరిధి పాండురంగాపురం గ్రామంలో లాల్ సింగ్ నాయక్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన స్మారక స్థూపాన్ని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాలు శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాబీర్ పాష మాట్లాడుతూ, భూక్యలాల్ సింగ్ నాయక్ ఆశయాలను కొన సాగించాలని అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం మోక్ష లాల్ సింగ్ నాయక్ జ్ఞాపకార్థం ఇల్లందులపాడు తండా ప్రాథమిక పాఠశాల, పాండురంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకాలను రమేష్ రాథోడ్ కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్ హుస్సేన్ నాయక్, హేమల్లీ, అమల మోహన్, రమేష్ రాథోడ్, లీల, రమేష్ నాయక్, బాలినేని సత్యనారాయణ, జానీ జానకి రెడ్డి, భరత్ నాయక్, పూసల విశ్వనాథం, మార్గం అంకయ్య, పిట్టల వెంకన్న, జితేంద్ర, నాలుగు రామనాథం, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

ప్రజాపక్షం/జనగామ : స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ నందు నియోజకవర్గ పరిధిలోని 7 మండలాలు, ఘనపూర్ మున్సిపాలిటీకి సంబంధించిన సమన్వయ కమిటి సభ్యులు, ముఖ్య నాయకుల సమావేశానికి ఎమ్మెల్యే కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 106 మంది సీఎం సహాయ నిధి లబ్దిదారులకు రూ.41లక్షల 89వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కడియం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం తెలంగాణకు అడుగడుగునా అన్యాయం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంతో తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క కార్యకర్త కంకణబద్దులై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన 'కుడా' చైర్మన్



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రం, హంటర్ రోడ్ లోని కుడా ల్యాండ్, భద్రకాళి మాడవీధులు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్స్, వరంగల్ బస్ స్టాండ్ పరిసరాలను ఆదివారం వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుడా పిఒ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై కుడా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులతో అన్నారు. పనుల పురోగతి, నూతన పనులపై అడిగి తెలుసుకున్నారు.

## భద్రకాళీ దేవస్థానాన్ని దర్శించిన సౌమ్య మిశ్రా



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఈ రోజు ఉదయం తెలంగాణా జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యా మిశ్రా, ఐ.పి.ఎస్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన సౌమ్యామిశ్రా కి భద్రకాళి శేషు అయ్యగారు, ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో సౌమ్యామిశ్రాగారి వెంట శుభం ప్రకాష్, ఐ.పి. ఎస్ తదితర పోలీసు అధికారులున్నారు. ఈ రోజు ఆదివారం కూడా కావడంతో భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు.

## అందరికీ బీమా డబ్బులు నేనే చెల్లిస్తా :సొంటి రెడ్డి

ప్రజాపక్షం/నెక్కొండ:నవత ఆటో కార్మికులు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న నవత ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి పి సి సి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ నెక్కొండ నవత ఆటో యూనియన్ డ్రైవర్ల అందరికి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల ప్రమాద భీమా ఇన్సూరెన్స్ గౌరవ అధ్యక్షుడిగా నేనే డబ్బులు చెల్లిస్తానని ఆటో డ్రైవర్ లందరికీ హామీ ఇచ్చారు. దానికి కావలసిన ఏర్పాట్లన్నీ యూనియన్ బాధ్యులు చూసుకోవాలని ఆయన అన్నారు. దీంతో ఆటో డ్రైవర్ల అందరూ రంజిత్ రెడ్డి సేవ భావానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నవత ఆటో యూనియన్ అధ్యక్షుడు మొడెం సురేష్, శ్రీరంగం శ్రీనివాస్, మొడేం రాజు, జెండా రవి, తదితరులు పాల్గొన్నారు.

## నిలువ నీడ కూర్చోడానికి చోటు లేని ప్లాట్ ఫారం




ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లాలోని అతి పెద్ద రైల్వే స్టేషన్గా చెప్పుకునే నెక్కొండ రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులు అంటూ కొనసాగుతున్న చిన్న పనులతో నిత్యం ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు ప్లాట్ ఫారం లలో కూర్చోవడానికి బెంచీలు, వసతి లేక, ఎండ, వర్షం, వస్తే ఎలాంటి రక్షణ లేకుండా ఉండడంతో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతూ రైళ్ల కోసం ఎదురు చూస్తూ చూస్తూ కొందరు వ్యక్తులు ఏకంగా నల్లాల కై నిర్మించిన వాటిపైన వీధి లేక కూర్చుంటున్నారు. గుత్తేదారు తో అధికారులు, చొరవ చూపి త్వరగా పనులు పూర్తి చేయిస్తే కానీ ప్రయాణికుల ఇబ్బందులు తీరవు.

## ఏజెన్సీ ప్రాంతాన్ని వరించిన కార్పొరేషన్ డైరెక్టర్ పదవి

గ్రామీణ అభివృద్ధి డైరెక్టర్‌గా చల్లా నారాయణరెడ్డి

ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ:మండలంలోని సాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చల్లా నారాయణరెడ్డి ని రాష్ట్ర ప్రభుత్వం రూరల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గా నియమించింది గత 40 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీ కీ చేసిన విశిష్ట సేవలకు గుర్తించిన అధిష్టానం ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ డైరెక్టర్ ల పదవులు భర్తీ చేసిన నేపథ్యంలో తాజా మహబూబాబాద్ జిల్లా లోని ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడ మండలానికీ ఒక డైరెక్టర్ పదవి వరించింది.కొత్తగూడ మండలం సాయి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన చల్ల నారాయణరెడ్డి ని రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంత్రివర్యులు సీతక్క చేతుల మీదుగా చల్ల నారాయణరెడ్డి కీ రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క కీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ గుర్తించి నాకు ఇచ్చిన బాధ్యతకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

## ఈతకు వెళ్లి వాగులో మృతి



ప్రజాపక్షం/మంగపేట:మండలంలో ప్రాణ స్నేహితులతో ఈతకు వెళ్లి ప్రాణం పోగొట్టుకున్న ఘటన జబ్బోనిగూడెం శివారులో లో జరిగింది పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. స్నేహితుల దినోత్సవం కావడంతో దంటగాళ్ళతో గౌరారం రాళ్ల గుండ్ల వాగు జబ్బోనిగూడెం గ్రామ శివారులో ఈత కొట్టడానికి బుచ్చంపేట గ్రామానికి చెందిన బూర్గుల అభిషేక్ (22) తండ్రి రమేష్ చదువు ఆపి కూలిచేసుకుంటూ బ్రతుకుని కొనసాగిస్తున్నాడు. ప్రాణ స్నేహితులతో కలసి వాగు లోకి ఈతకు వెళ్లిన అభిషేక్ వాగులోని రాళ్లలో ఇరుక్కొని ప్రమాదవశత్తు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శివనగర్‌లో నీటి సరఫరా బంద్

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వరంగల్ శివ నగర్ ప్రాంతం లో డక్ట్ నిర్మాణ పనులలో భాగం గా పైప్ లైన్ మార్చుతున్న నేపధ్యం లో రెండు రోజుల పాటు (సోమ, మంగళ వారాల్లో) నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా కాశీబుగ్గ సర్కిల్ ఇంచార్జి ఈ ఈ సంతోష్ బాబు నేడొక ప్రకటన లో తెలిపారు. ఇట్టి కారణం గా 34 వ డివిజన్ లోని అన్ని ప్రాంతాల తో పాటు 35వ డివిజన్ పరిధి లోని ఎసి రెడ్డి నగర్ ప్రాంతం లోని మొత్తం ఏరియా తో పాటు నందూర్ బార్ హోటల్ లేన్, గంగా దేవి హోటల్ లేన్, ఎస్సీ వాడ, సిక్కు వాడ లేన్, పెద్ది మల్లా రెడ్డి నగర్ తో పాటు 38వ డివిజన్ కు చెందిన రుద్ర మాంబ నగర్,పోచమ్మ టెంపుల్ లేన్, ఫోర్ట్ రోడ్ ప్రాంతాల్లో రెండు రోజులు (సోమ, మంగళ వారాలు) నీటి సరఫరా జరగదని అట్టి ప్రాంత వాసులు గమనించి బల్దియా కు సహకరించాలని ఇంచార్జి ఈ కోరారు.

# క్రీడల హబ్‌గా వరంగల్

ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 11వ తెలంగాణ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ అండర్ 20లో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ శాసన సభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్ క్రీడలను జెండా ఊపి ప్రారంభించారు. 5000 మీటర్లలో పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన బాల బాలికల క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రానున్న రోజులలో వరంగల్ క్రీడా రంగానికి హబ్ గా మారుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానికంగా ఎమ్మెల్యేలు అందరం ప్రత్యేక దృష్టితో క్రీడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం,క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి ఈ సంవత్సరం నుంచే క్రీడా తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ ప్రభుత్వం విద్యా,వైద్యం,వ్యవసాయంతో పాటు ముఖ్యంగా క్రీడా రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని,క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ అధిక నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రికి క్రీడలంటే మక్కువ ఎక్కువ అని, తమ హయాంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం ఏర్పాటు జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. వరంగల్ వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయం,స్థానికంగా ఎటువంటి అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారులు అశోక్,సారంగం, క్రీడా ప్రతినిధులు,అధికారులు,వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 4న చలో కలెక్టరేట్

సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్



ప్రజాపక్షం/మహబూబాబాద్: ఓసి క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చే సుకోవాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 4న సోమవారం చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జయప్రదానికై పట్టణ సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా పలు కాలనీలలో సెంటర్లలో ప్రచారం నిర్వహిస్తూ బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని రేపు చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వందలాదిగా పాల్గొని కలెక్టరేట్ ను ముట్టడించాలన్నారు. ఓసీ క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, మంద శంకర్, నాంచారి దాసు, సిలువేరు వికాస్, రాగ మల్లయ్య, బేతమల్ల శ్రీనివాస్, తోట రమేష్, బల్లెం శ్రీకాంత్, జడల నటరాజ్, మేక వెంకటేష్, మంద శ్రీనివాస్, వంగూరి నాగేంద్రబాబు, కన్నె రాజు, రాజేందర్, బోళ్ల భద్రయ్య, నాగరాజు, రవి షరీఫ్, గుండోజు రమేష్, నజీర్ దూర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 5న సిపిఐ జిల్లా మహాసభ



ప్రజాపక్షం/ములుగు:ఈ నెల 5వ తేదీన ములుగు జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. ఆదివారం డిఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కులాల పేరుతో మతాల పేరుతో కుతంత్రాలు చేస్తున్నందున మతవాదులను ఎదుర్కొవడానికి ప్రజలు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా 5వ తేదీన ములుగులో జరిగే మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాష, ఆచంట ప్రసాద్, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, నెల్లబోయిన రవి, దర్ర గోపి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల సానుకూల స్పందన

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్: ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బిజెపి, బిఆర్ఎస్‌లు ధర్నా నాటకాలు ఆడుతున్నాయి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం బిజెపికి ఇష్టం లేదు. బిజెపి దివాలాకోరు, చిల్లర రాజకీయాలు చేస్తుంది. తెలంగాణపై చిన్న చూపు చూస్తూ అడుగు అడుగునా అన్యాయం చేస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి. నియోజకవర్గానికి రూ. 900 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చా. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇన్ని నిధులు రాలేదు. రానున్న రోజుల్లో నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎదురులేని పార్టీ కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి పార్టీని బలోపేతం చేసుకుందాం. ఎవరు ఎప్పుడు వచ్చారన్నది కాదు ఎవరు ఎంత పనిచేస్తున్నారనేది ముఖ్యమంత్రి మాజీ ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఎస్ కన్వెన్షన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలు, ఘన్‌పూర్ మున్సిపాలిటీకి సంబంధించిన సమన్వయ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకుల సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 106 మందికి సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ. 41.89 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బిజెపి, బిఆర్ఎస్‌లు బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు వీధి నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ఒకరు ఇందిరా పార్కు దగ్గర మరొకరు కరీంనగర్‌లో ధర్నాలు చేస్తున్నారని, అసలు బిజెపి, బిఆర్ఎస్‌లు ఎందుకు ధర్నా చేస్తున్నాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే దానికి చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్యపెట్టడానికి ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం బిజెపికి ఇష్టం లేదని అందుకే ఇలాంటి దివాళా కోరు రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. తెలంగాణ బిజెపి నాయకులకు, బీఆర్ఎస్‌పై ప్రేమ ఉంటే వెంటనే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. అంతేకాని ప్రజలను తప్పు దోవ పట్టించే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు అడుగు అడుగునా అన్యాయం చేస్తుందని, తెలంగాణపై చిన్న చూపు చూస్తుందన్నారు. మార్కెట్ ఛైర్ పర్సన్ లావణ్య గ్రంథాలయ ఛైర్మన్ రాంబాబు, మాజీ మార్కెట్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మిల్లర్స్ అసోసియేషన్ రూరల్ అధ్యక్షుడు బలిదె వెంకన్న, బేబి శ్రీనివాస్ శిరీష్‌రెడ్డి, సంపత్, బూర్ల శంకర్, దేవస్థాన ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు బాబు, ఎండీ పాషా, సురేష్, నరేందర్, రమేశ్, వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు, రఘునాథపల్లి, లింగాల, ధర్మసాగర్, ఘన్‌పూర్, పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదు

ములుగు ఎస్‌పి శబరీష్ పి ఐపిఎస్



ప్రజాపక్షం/ములుగు:మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానా, జైలు శిక్ష తప్పదని ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ పి ఐపిఎస్ హెచ్చరించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా గత నెలలో 456 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై కేసులు నమోదు చేయడంతో పాటు నిందితులకు శిక్ష విధించడంపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. గడిచిన వారంలో వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 17 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టు ద్వారా అట్టి 17 మందికి 2 రోజుల జైలు శిక్షతో పాటు 2వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, తరచు డ్రంగ్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంగ్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణపైన మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైన కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారికి నిరంతరం కౌన్సిలింగ్‌లు ఇవ్వడం, సూచనలు చేయడం జరుగుతుందన్నారు. అంతే కాక పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళి విద్యార్థులతో మమేకమై పాటించాల్సిన నియమాలు వివరించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

## ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 177మంది చిన్నారులకు విముక్తి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఆపరేషన్ ముస్కాన్ 11వ విడత ద్వారా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న 177 చిన్నారులకు విముక్తి కలిగించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. గత నెల జూలై మొదటి తారీఖు నుండి నెలాకరు వరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ లైన్, కార్మిక శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో బాల కార్మికులు, బడి మానేసిన 177 మంది బాలబాలికలను గుర్తించి వారిని బాలల సంరక్షణ గృహానికి తరలించడం జరిగింది.ఇందులో 149 మంది బాలలు, 28 మంది బాలికలు వున్నారు. బాలల సంరక్షణ గృహానికి తరలించిన వారిలో తెలంగాణతో , ఇతర రాష్ట్రాలకు 97మంది చిన్నారులు ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. ఈ తనిఖీల్లో గుర్తించిన 171 చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించడమైనది పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని. ఎవరైనా చిన్నారులతో వెట్టి చాకిరీ చేయించుకునే యాజమానుల పట్ల కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై బాలల న్యాయ చట్టం అనుసరించి చిన్నారులను పనిలో పెట్టుకున్న యాజమాన్యంకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, 50వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# నిరుపేదలకు వరం.. సిఎం సహాయ నిధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి :అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఒక వరంలా పనిచే స్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మంజూరు నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో నియోజ కవర్గంలోని భూపాలపల్లి, రేగొండ, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాల లబ్దిదారులకు, గణపురం రైతు వేదికలలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను 180 మందికి సుమారు రూ. 57,00,000/ విలువ గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి కొంత ఉపశమనం కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సామాన్యుడి పక్షాన నిలుస్తుందని తెలిపారు. మానవతా దృష్టితో ఈ సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి కులాలు, మతాలు, పార్టీలక తీతంగా నిధులను వేగంగా మంజూరు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని కొనియాడారు. గత ప్రభుత్వం వైద్య రంగాన్ని గాలికి వదిలేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీని పెంచి వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని వివరించారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్యమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రవికుమార్‌కు ఉత్తమ సేవారత్న పురస్కారం



ప్రజాపక్షం / నర్సంపేట : అశోక్ నగర్ గ్రామానికి చెందిన యాట రవికుమార్ ముదిరాజ్ పది సంవత్సరాలుగా కబడ్డీ కోచ్ గా క్రీడారంగంలో ఉచిత సేవలు అందిస్తూ, ఎంతోమంది క్రీడాకారులను అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాట రవికుమార్ ముదిరాజ్ ను అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా వెలాసిటీ జూనియర్ కాలేజీ హనుమకొండ యందు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవారత్న పురస్కారంతో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగంలో నాయొక్క విశిష్ట సేవలను గుర్తించి నాకు ఉత్తమ సేవారత్న పురస్కారాన్ని అందించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ కి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రిజిస్ట్రార్ రామచంద్రంకి ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని క్రీడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, క్రీడారంగంలో సేవ చేయడానికి అవకాశాలు కల్పించిన వరంగల్ జిల్లా యువజన మరియు క్రీడల అధికారిని టివిఎల్ సత్యవాణికి, ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ, వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్‌కి, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 108 అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



ప్రజాపక్షం/ఏటూరునాగారం:చుట్టు చీకటి, దట్టమైన అడవి, సరిగా కాలి నడకకు నోచుకోని గొత్తికోయగూడెం, బురద రోడ్డును దాటుకొని ఎలాగైన వైద్య సేవలు అందించాలనే సహసంతో ముందుకు సాగుతున్న క్రమంలో బురద రోడ్డులో అంబులెన్స్ వెళ్ళ లేని పరిస్థితి, మైలు దూరం నడిచి గర్భిణీ స్త్రీని కుటుంబ సభ్యుల సహకారంతో తీసుకొచ్చి అంబులెన్స్‌లో అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. వివరాల్లోకి వెళితే ఏటూరునాగారం మండలం గుండెంగవాయి గ్రామానికి చెందిన ఆవులం సునీత(30) సంవత్సరాలు పురిటి నొప్పులతో బాధపడుతూ స్థానికుల సహాయంతో 108 కి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అంబులెన్స్ సిబ్బంది పైలట్ కోటి, ఈఎంటి శివలింగం ప్రసాద్‌లు హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్తున్న క్రమంలో బురదమయంగా ఉన్న రోడ్డు అంబులెన్స్ వెళ్ళని పరిస్థితి కాలి నడక మార్గాన మైలు దూరం నడిచి అంబులెన్స్ వద్దకు తీసుకొని పరీక్షించి ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సందర్భంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే పురిటినొప్పులు అధికమవడంతో తక్షణమే స్పందించిన ఈఎంటి శివలింగ ప్రసాద్ ఈఆర్‌సి డాక్టర్ మౌనిక సూచనలతో మధ్యాహ్నం 12.11 గంటలకు సుఖ ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత తల్లిబిడ్డలకు కావాల్సిన చికిత్స అందించి తల్లి బిడ్డలు క్షేమంగా ఉండగా మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జరిగిన విషయాన్ని వైద్యులకు వివరించి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శివలింగం ప్రసాద్, పైలట్ కోటి, గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రమాదం నుండి కపాడిన అంబులెన్స్ సిబ్బందికి గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

# క్రీడ

## నా దృష్టంతా మ్యాచ్‌పైనే

### పనిభారంపై సిరాజ్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత్–ఇంగ్లాండ్ మధ్య చివరిదైన టెస్ట్ మ్యాచ్ రసవత్తరంగా మారింది. భారత్ నిర్దేశించిన 374 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ గెలుపొందాలంటే ఇంకా 324 పరుగులు చేయాలి. అయితే, సిరీస్‌లో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ బౌలింగ్ చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి విశ్రాంతి లేకుండా ఈ ఫాస్ట్ బౌలర్ వరుసగా ఐదు టెస్టు మ్యాచులు ఆడాడు. జట్టుకు అవసరమైన సందర్భాల్లో వికెట్లు తీస్తూ ఆదుకుంటూ వస్తున్నాడు. సిరాజ్ ప్రస్తుతం సిరీస్‌లో అత్యధికంగా 19 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌లలో దాదాపు 160 ఓవర్లు బౌలింగ్ వేసి ఆకట్టుకున్నాడు. అయితే, వరుస మ్యాచుల నేపథ్యంలో విశ్రాంతి తీసుకోవాలని అనిపించిందా? అని సిరాజ్‌ను ప్రశ్నించగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నేను విశ్రాంతి గురించి ఆలోచించను. ఎప్పుడూ మ్యాచ్ గురించి మాత్రమే ఆలోచిస్తాను. దేశం కోసం ఆడటాన్ని నేను ఇష్టపడతాను. నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని నేను కోరుకుంటాను. ప్రణాళిక రూపొందించుకొని వాటిని అమలు చేస్తేనే ఫలితాలు వస్తాయి' తెలిపాడు. ప్రస్తుతం టీమిండియాలో పనిభారం అంశం చర్చనీయాంశంగా మారింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు టీమ్ మేనేజ్‌మెంట్ ఐదు టెస్టుకు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు ఐదు మ్యాచుల్లో మూడు మ్యాచులకు అందుబాటులో ఉంటాడని సెలక్షన్ కమిటీ చైర్మన్ అగార్కర్ సైతం తెలిపాడు.

ఓవల్ టెస్టులో గెలుపొంది సిరీస్ సమం చేయాలనుకున్న భారత జట్టు ఆశలు సన్నగిల్లుతున్నాయి. బౌలర్లు తేలిపోతుండడంతో ఇంగ్లాండ్ విజయానికి చేరువవుతోంది. టాపార్డర్‌ను త్వరగానే

## బ్రూక్ హాఫ్ సెంచరీ..

### సిరీస్‌పై సన్నగిల్లుతున్న టీమిండియా ఆశలు



ఔట్ చేసినా మిడిలార్డర్లో హ్యారీ బ్రూక్ (59 నాటౌట్) అర్ధ శతకంతో మెరిశాడు. జో రూట్ (37 నాటౌట్) సైతం కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. ఈ ఇద్దరూ ఇప్పటికే నాలుగో వికెట్‌కు 92 రన్స్ జోడించారు. దాంతో, ఇంగ్లాండ్ జట్టు లక్ష్యానికి చేరువవుతోంది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు స్కోర్ 199/3. ఇంకా పోప్ సేన విజయానికి 174 రన్స్ కావాలంతే. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఓవల్ టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటర్లు గొప్పగా పోరాడుతున్నారు. భారత జట్టు నిర్దేశించిన 375 పరుగుల ఛేదనలో ఆతిత్య జట్టు ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారు. మూడో రోజు ఓపెనర్ జాక్ క్రాలే(14) ఔటైనా.. ఆ ప్రభావం జట్టుపై పడకుండా చూసుకున్నారు బెన్ డకెట్(54), ఓలీ పోప్(27)లు. నాలుగో రోజు ఈ ఇద్దరూ భారత బౌలర్లను ఉతికేస్తే లక్ష్యాన్ని కరిగించారు. అయితే.. అర్ధ శతకంతో విరుచుకుపడిన డకెట్‌ను ప్రసిధ్ వెనక్కి పంపగా.. కాసేపటికే పోప్ ఇన్నింగ్స్‌కు సిరాజ్ తెరదించాడు.

## ఇక సిఎస్‌కెకు బ్యాటింగ్ సమస్య కాదు


### మహేంద్ర సింగ్ ధోనీ కామెంట్స్



రీతురాజ్ గైక్వాడ్ తిరిగి వస్తే రాబోయే ఐపిఎల్ (2026) సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ మరింత బలపడుతుందని ఆ జట్టు సీనియర్ ప్లేయర్, కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ అభిప్రాయపడ్డాడు. గత సీజన్‌లో కెప్టెన్ గైక్వాడ్ మధ్యలోనే మోచేయి గాయం కారణంగా టోర్నీకి దూరమైన విషయం తెలిసిందే. దాంతో గైక్వాడ్ స్థానంలో ధోనీ సీఎస్‌కే కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన జట్టు బ్యాటింగ్ ఇబ్బందికరంగా ఉన్నది. ముగిసిన గత సీజన్‌లో 14 మ్యాచుల్లో కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో పదో స్థానంలో నిలిచింది. చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఎంఎస్ ధోనీ మాట్లాడుతూ.. చెన్నై జట్టు గైక్వాడ్‌ను కొనసాగిస్తుందని తెలిపాడు. బ్యాటింగ్ ఆర్డర్ గురించి కొంచెం ఆందోళన పడ్డామని.. కానీ ప్రస్తుతం బ్యాటింగ్ ఆర్డర్ స్థిరపడిందని భావిస్తున్నానని చెప్పారు. గాయపడ్డ రీతురాజ్ గైక్వాడ్ తిరిగి వస్తాడంటూ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది చివర్లో మినీ వేలంతో జట్టును మరింత బలోపేతం చేయడానికి ఫ్రాంచైజీ ప్రయత్నిస్తుందని తెలిపాడు. తాము ఈ సీజన్‌లో నిర్లక్ష్యంగా ఉన్నామని తాను చెప్పలేనని.. అయితే, అధిగమించాల్సిన లోపాలు కొన్ని ఉన్నాయని తెలిపాడు. డిసెంబర్‌లో జరగబోయే మినీ వేలంతో ఆ లోపాలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తామని చెప్పాడు. ఏప్రిల్ 8న ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రీతురాజ్ గైక్వాడ్ చివరి మ్యాచ్ ఆడాడు. ఈ సందర్భంగా ధోనీ గత రెండు సీజన్లలో సూపర్ కింగ్స్ ప్రదర్శన ఊహించినదాని కంటే బాగా లేదని అంగీకరించాడు. లోపాలను గుర్తించడం జట్టుకు ముఖ్యమని సీనియర్ ఆటగాడు తెలిపాడు. గత సీజన్‌లో జట్టుకు అంతా ఏమీ బాగా జరుగలేదని.. ఆశించిన మేర ప్రదర్శన ఇవ్వలేకపోయామని చెప్పాడు. కానీ, తప్పిదాల నుంచి నేర్చుకోవడం ముఖ్యమైందని తాను భావిస్తున్నానని.. ఈ సీజన్ బాగా లేదని.. ఎక్కడ తప్పుడు జరిగిందనే ప్రశ్నను ఎదుర్కోవాల్సి ఉంటుందని.. ఇదే ప్రశ్న తాము గత ఏడాది కూడా ఎదుర్కొన్నామని చెప్పుకొచ్చాడు టీమిండియా మాజీ కెప్టెన్.

# ఫోకస్

## ఆరోగ్యం




యావత్ ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మహమ్మారి శాంతించినట్టు కనిపిస్తున్నప్పటికీ, అది మిగిల్చిన గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఎన్నో దేశాలు ఇప్పటికీ ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకోలేదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. ఇది ఒక సమస్యకాగా, కొవిడ్ లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగడం మరో సమస్య. ఒకవైపు ఆర్థికంగా కుంగిపోతే, మరోవైపు ఆరోగ్యం ఇప్పటికీ కుదుటపడక, వైద్య ఖర్చులు భరించలేక ఎంతో మంది అల్లాడుతున్నారు. దీర్ఘకాల కొవిడ్ లక్షణాలను 'లాంగ్ కొవిడ్'గా పేర్కొంటున్నారు.

## వెంటాడుతున్న లాంగ్ కొవిడ్ కష్టాలు

కొవిడ్ ఐదు సంవత్సరాల క్రితం నాటిది. సమస్యలు మాత్రం నిత్యనూతనం. పైగా, కరోనా వైరస్ వివిధ రూపాలను సంతరించుకొని, వేరువేరు వేరియంట్స్‌గా మారి, దాడి చేస్తునే ఉంది. ఇలావుంటే, గల్ఫ్ దేశాల్లో కొవిడ్ కేసులు పెరగడం ఆందోళన కలిగించే అంశం. మన దేశం నుంచి లక్షలాది మంది గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. వస్తున్నారు. దీనితో కొవిడ్ ఇక్కడ కూడా పెరిగే ప్రమాదం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో 'లాంగ్ కొవిడ్' బాధితులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వీరిలో చాలా మంది కొవిడ్ సంబంధిత సమస్యలతోపాటు, దాని సైడ్ ఎఫెక్ట్స్‌తోనూ అల్లాడుతున్నారు. పురుషులు, స్త్రీలు అనే తేడా లేకుండా చాలా మందికి అకస్మాత్తుగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరిగితే, కొంత మందికి బట్టతల వచ్చింది. గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, నరాల బలహీనతలు సరేసరి. సాధారణంగా కొవిడ్ 19 ప్రారంభమైన 3 నెలల తర్వాత, లక్షణాలు కనీసం 2 నెలల పాటు ఉంటాయి. 'లాంగ్ కొవిడ్'లో మాత్రం ఆ లక్షణాలు పదేపదే ప్రత్యక్షమవుతాయి. విపరీతమైన నీరసం, అలసట వేధిస్తుంటాయి. క్రమం లేని హృదయ స్పందనతో కొత్తకొత్త సమస్యలు సృష్టిస్తుంది. దీనిని అరిథ్మియా అని కూడా పిలుస్తారు. మెట్లు ఎక్కడం లేదా కొంత దూరం నడవడం కష్టమవుతుంది. నిద్రలో ఉన్నప్పుడు హఠాత్తుగా శ్వాస ఆడకపోవడం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. చాలా మంది 'లాంగ్ కొవిడ్' హోల్డర్లు కొత్త వ్యాధులు అభివృద్ధి చెందుతున్నాయి. వారికి గతంలో ఎప్పుడూ రాని... ఎటువంటి జన్యు సంబంధాలు లేని వ్యాధులు సోకుతున్నాయి. కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత, ఈ విధంగా కొత్త వ్యాధులు సోకడం అనేది ఆ మహమ్మారి అంతర సమస్యల్లో భాగమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) స్పష్టం చేస్తున్నది. కొన్ని సందర్భాల్లో, ప్రారంభ అనారోగ్యం నుండి లక్షణాలు కూడా అలాగే ఉంటాయి. కాలక్రమేణా లక్షణాలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. కొన్ని సందర్భాల్లో తిరగబెడతాయి. డయాబెటిస్, అల్జీమర్స్, కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడిన వారు కూడా ఉన్నారని డబ్ల్యుహెచ్ఒ నివేదికలు పేర్కొంటున్నాయి.

## విస్తరిస్తున్న టెలిహెల్త్ సేవలు



కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, టెలిహెల్త్ సేవలు ఇటీవలి కాలంలో బాగా విస్తరిస్తున్నాయి. దీని ద్వారా రోగులు క్లినిక్‌లో ఎక్కువసేపు వేచి ఉండకుండా, తక్షణమే వైద్యులను సంప్రదించగలుగుతారు. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో త్వరిత సేవలు అందించడంలో సహాయపడుతుంది. ట్రస్టేడాక్టర్ (Trustedoctor) వంటి డిజిటల్ వర్చువల్ కేర్ ప్లాట్‌ఫార్మ్‌లు అనేక ఫంక్షనాలిటీలు, అపాయింట్‌మెంట్ ఎంపికలు అందిస్తున్నాయి. తద్వారా ప్రత్యేక వైద్య సేవలను మరింత సులభంగా మరియు సమర్థవంతంగా అందించడాన్ని సాధ్యపరుస్తున్నాయి. రోగుల ఆరోగ్య డేటా ఆధారంగా వ్యక్తిగత వైద్య సలహాలు, చికిత్సలు అందించటం ద్వారా ఫలితాలు మెరుగవుతాయి. రోగుల వ్యక్తిగత సమాచారం గోప్యతను కాపాడుతూ, డేటా ఎన్క్రిప్షన్ వంటి టెక్నాలజీలను వినియోగించడం ద్వారా విశ్వసనీయత పెరుగుతుంది. డిజిటల్ షెడ్యూలింగ్, రిమైండర్లు ద్వారా వైద్యుల సమయాన్ని, రోగుల అపాయింట్‌మెంట్‌లను సమర్థంగా నిర్వహించవచ్చు. ఈ మార్గాల్లో టెలిహెల్త్ సేవలు మరింత వేగవంతంగా, నాణ్యతతో అందుబాటులోకి వస్తాయి. అయితే, వైద్యులతో ప్రత్యక్షంగా కలవకపోవడంతో, వారి పట్ల రోగులకు నమ్మకం కుదరదు. అంతేగాక, వైద్యులు, రోగుల మధ్య సత్సంబంధాలు నెలకొనే అవకాశాలు చాలా తక్కువ. ఇలాంటి కొన్ని సమస్యలు తెరపైకి వచ్చినప్పటికీ, టెలిహెల్త్ సేవలు కేవలం మన దేశంలో మాత్రమేగాక, ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరిస్తున్నాయి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్న ప్రభుత్వం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే ప్రజావిశ్వాసాన్ని కోల్పోతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం, మండల కార్యదర్శుల సమావేశం ఆదివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కలవేన శంకర్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్‌పై అచంచలమైన నమ్మకంతో అధికారంలోకి తీసుకువచ్చారని, కానీ ప్రజల ఆశలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం, చేయూత, రాజీవ్ ఆరోగ్య భద్రత, పెన్షన్ వంటి హామీల అమలు గల్లంతైందని విమర్శించారు. గృహజ్యోతి దరఖాస్తులు ఇంకా ప్రారంభించలేదని, మహిళలకు పెన్షన్ రూ.4000 ఇవ్వాలి అన్న మాట ఏమైందని? ఆరోగ్య భద్రత రూ.10 లక్షల భీమా ఎక్కడని? ప్రశ్నించారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిసిన వృద్ధులు, దివ్యాంగులు పెన్షన్ రాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే గడువు పొడిగించాలని, దివ్యాంగులు సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తప్పుపట్టారు. ఇప్పటికయిన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలకు ఎన్నికల హామీలు, సంక్షేమపథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేదంటే గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లాలో జరగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలని కలవేన శంకర్ కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, బోల్లం పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, కారుకూరి నగేష్, లింగం రవి, రేగుంట చంద్రకళ, జిల్లా సమితి సభ్యులు నెన్నెల సమ్మయ్య, బొంతల లక్ష్మీనారాయణ, దేవీ పోచన్న, ఆడేపు రాజమౌళి, కొండు భాణేష్, అందే పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## గోకారం చెరువు పునరుద్ధరించాలి

### జినుకుంటలో లెదర్‌పార్కు ఏర్పాటు

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు బాల్‌నర్సింహ్మ డిమాండ్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండల పరిధిలోని గోకారం చెరువును తక్షణమే పునరుద్దరించాలని, జిల్లాలోగల వనరులను, ముడిసరుకులతో ఈప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చొరవతీసుకోవాలని, బల్మూర్ మండలం జినుకుంట గ్రామశివారులో లెదర్‌పార్కు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌తో కలిసి బాల్‌నర్సింహ్మ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా తృతీయ మహాభలను ఆగస్టు 1,2తేదీలలో నిర్వహించామన్నారు. మహాసభలలో 9 తీర్మాణాలను ఆమోదింపచేయడం జరిగిందన్నారు. పాలెం సమీపంలో పారిశ్రామిక ఇండస్ట్రీపార్కును ఏర్పాటు, జిల్లాలో పలు ఎత్తిపోతల పథకాలద్వారా నీటి సామర్థ్యం పెరగడంతో చేపల పెంపకానికి, మత్స్యసంపద నిల్వకు కోల్డ్‌స్టోరేజ్‌లను నెలకొల్పాలని, కొల్లాపూర్, కల్వకుర్తి ప్రాంతాలలో మామిడి ఆధారిత మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాను విద్యాపరంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, పాలిటెక్నికల్ కళాశాలలను ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలన్నారు. ఈప్రాంతంలోగల ముడిసరుకులు ఖనిజాలు విరివిగా ఉండటంతో సిమెంటు కాగితపు పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. కెఎల్ఐ పథకం చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, ఉపకాల్వలు పూర్తిచేయలేదన్నారు. మాచర్ల జడ్చర్ల, రాయచూర్ జడ్చర్ల ప్రాంతాలకు రైల్వే మార్గం ఏర్పాటు చేయాలన్నారు. పోరాటాలకు పుట్టినిల్లు పాలమూరుగడ్డ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు కేశవులుగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మ, యేసయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పరుషరాములు, సిహెచ్ శ్రీనివాసులు, నాయకులు యూసుఫ్,, శివకృష్ణ, దారదాసు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పిల్లలకు ఉద్యోగావకాశాలు





### సి.కా.వ.యూ(ఎఐటియుసి) ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి మెడికల్ బోర్డు విధానాలతో కార్మికులు ఆందోళనలో ఉన్నారని, హయ్యర్ సెంటర్ పేరుతో నిమ్స్‌కు పంపిన 47 మంది కార్మికులను వెంటనే మెడికల్ బోర్డులో అన్ఫిట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుండి ప్రతి నెల మెడికల్ బోర్డు ద్వారా 85 శాతం అన్ఫిట్ అయ్యేవారని, ఆగస్టు 2024 ఆగస్టులో మెడికల్ బోర్డు కొరకు 52 మందిని హయ్యర్ సెంటర్ పేరుతో అధునాతనమైన వైద్యశాల నిమ్స్‌కు రిఫర్ చేసి పంపించారని, వారి రిపోర్టులను పరిశీలించి, అందులో నలుగురిని మాత్రమే అన్ఫిట్ చేశారని, మరో 30 మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్, ఏడుగురికి సర్ఫేస్ జాబు ఇచ్చి అందులో 47 మందికి అన్యాయం చేశారన్నారు. సింగరేణిలో ఏదో కొత్తగా అవినీతి జరిగినట్లుగా మెడికల్ బోర్డు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంపై ఎఐటియుసి డైరెక్టర్‌తో చర్చించడం జరిగిందన్నారు. వెంటనే 47 మందిని బేషరతుగా అన్ఫిట్ చేసి వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. ఒకపక్క నిరుద్యోగం పెరిగిపోతుంటే, అన్ఫిట్ చేయకుండా ఇన్ వ్యాలిడిటీ పేరుతో కాలయాపన చేస్తూ వారి కుటుంబంలో అటు సర్వీసు ఇటు ఉద్యోగం పిల్లలకు రాక అయోమయ పరిస్థితిలో కార్మిక వర్గం ఉందన్నారు. వెంటనే 47 మందిని అన్ఫిట్ చేసి ఉద్యోగాలు కల్పించాలని లేనిపక్షంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాజ్‌కుమార్ హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, జి.శ్రీనివాస్, ఎం.విజేందర్, తాళ్ల పోశం తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల మహాసభ అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ సిపిఐ కార్యాలయంలో పైడిపల్లి శశి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరై యుగేందర్ మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని పోరాటాలు నిర్వహించింది ఎఐవైఎఫ్ అన్నారు. ఉన్నత చదువులు చదువుకుని నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం యువతను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశ సంపద యువతను పాలకులు విస్మరిస్తున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి నెరవేర్చకుండా యువతను మోసం చేసిందన్నారు. డిగ్రీలు, పిజిలు చేత పట్టుకుని ఉద్యోగాల కోసం తిరిగితే ప్రభుత్వ ఉద్యోగాలు దొరకకపోవడంతో ప్రైవేట్ సెక్టార్లలో ఎంతో మంది యువతీ, యువకులు చాలీచాలని వేతనాలతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజీవ్ యువవికాసం పథకం అందిస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఊరట కలిగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు చెంచల రవి, పైడిపల్లి శశి, మహేష్, శ్యామ్, అజయ్, హరీష్, నవీన్, వెంకట్, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## చట్టాలు నీరుగారుస్తున్న పాలకులు





### సాధికారత, 33శాతం రిజర్వేషన్ అమలుకు పోరాడుదాం

### మహిళా సమాఖ్య కొత్తగూడెం జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మి కుమారి



**ప్రజపక్షం/కొత్తగూడెం టౌన్ :** మహిళా చట్టాల అమలును పాలకులు నీరుగారుస్తున్నారని భారత జాతీయ మహిళా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి ఆరోపించారు. మహిళా సమాఖ్య కొత్తగూడెం పట్టణ శాఖ 3వ మహాసభ ఆదివారం శేషగిరిభవన్‌లో మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, పైడిపల్లి లక్ష్మి, దారా లక్ష్మి, పుట్టి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమాఖ్య జెండాను ఎగురవేసిన అనంతరం ప్రతినిధుల మహాసభలో బలమైన ఉద్యమాలు నిర్మించడంతోనే మహిళలకు, మహిళా చట్టాలకు, హక్కులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల అరికట్టడంలో పాలకులు విఫలం చెందుతున్నారని, బ్రున హత్యలు, ఆడపిల్లల అమ్మకాలు, హింస, వివక్ష వంటి దుశ్చర్యలను అరికట్టేందుకు పాలకులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత సాధన, సమాన హక్కులు, 33 శాతం రిజర్వేషన్ అమలుకోసం మహిళాలోకం ఉద్యమబాట పట్టాలని, మహిళలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలలో మహిళలు, యువతుపై జరిగిన దారుణ హత్యాకాండల నిగ్గు తేల్చాలని లక్ష్మి కుమారి డిమాండ్ చేశారు. మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి, ప్రచార కార్యదర్శి కరీషే రత్నకుమారి, నాయకులు భరిగెల సంపూర్ణ, గోనెమని, సత్తెనపల్లి విజయలక్ష్మి, పాలమూరి ధనలక్ష్మి, పైడిపల్లిపల్లి లక్ష్మి, షాహీన్, కౌసర్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గడ్కోల్ బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు

ప్రజాపక్షం/నిజామాబాద్:సిరికొండ మండలం గడ్కోల్ బ్రిడ్జి వద్ద ప్రయాణం నరకంగా మారిందని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని 'ప్రజాపక్షం'లో రాసిన వార్తకు స్పందన లభించింది. ఎట్టకేలకు ప్రయాణికుల ఇబ్బందులు గ్రహించి చెక్‌డ్యాం వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయటంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా సిరికొండ, హోన్నాజీపేట్, నిజామాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ రోడ్డు ప్రధానం కావటం విశేషం. ప్రయాణీకుల ఇక్కట్లు తెలుసుకుని వార్త రాసిన ప్రజాపక్షం ప్రతినిధిని పలువురు మండల ప్రజలు ప్రశ్నించారు.




## నిర్మల్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు

### ఈనెల 31 వరకు నిషేధాజ్ఞలు



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:జిల్లాలో శాంతిభద్రతలను పెంపొందించేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకు నిర్మల్ జిల్లా ఎస్పి డాక్టర్,జి.జానకి షర్మిల కీలక నిర్ణయం తీసుకున్నారు.ఆగస్టు 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 ఆఫ్ 1861ను అమలులోకి తెచ్చారు.ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ నిబంధనల ప్రకారం,జిల్లాలో సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి లేదా ఇతర ఉన్నత అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు,ఊరేగింపులు ధర్నాలు నిర్వహించడం నిషధం.అంతేకాకుండా,ప్రజలకు ఇబ్బంది కలిగించే జనసమూహాలు, లౌడ్ స్పీకర్లు,డీజేలను ఉపయోగించడం కూడా నిషేధించబడింది. నిషేధాజ్ఞల సమయంలో ఆయుధాలు,కత్తులు,కర్రలు,జెండా కర్ర లు,తుపాకులు,ప్రేలుడు పదార్థాలు వంటి వాటిని కలిగి ఉండటం లేదా ఉపయోగించడంపై పూర్తి నిషేధం విధించారు.ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే,వారిపై 30 పోలీస్ యాక్ట్ 1861కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పిహెచ్చరించారు.ఈ చర్యలన్నీ జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకే ఉద్దేశించబడ్డాయని ఆమె స్పష్టం చేశారు.

## గుడుంబా తరలిస్తుండగా వ్యక్తి అరెస్ట్

### టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుబడిన నిందితుడు



ప్రజాపక్షం /దహెగాం, కాగజ్ నగర్ రూరల్ :నిషేధితమైన గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దహెగాం మండలంలో పట్టుకున్నారు. బిబ్రా గ్రామ శివారులో ఆదివారం ఉదయం టాస్క్‌ఫోర్స్ సి బృంది తనిఖీలు నిర్వహించగా ఈ ఘటన బయటపడింది. ఈ సందర్భ ంగా టాస్క్‌ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్ అందించిన వివరాల ప్రకారం మర్రిపల్లి గ్రామానికి చెందిన దారవత్ తారచంద్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 8 లీటర్ల గుడుంబా (దాదాపు రూ.3,500 విలువ), 380 ఖాళీ పాకెట్లు, ఒక ద్విచక్ర వా హనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల దాడిలో సిఐతో పా టు సిబ్బందిపాల్గొన్నారు. నిందితుడిని దహెగాం పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, న్యాయపరమైన చర్యలు ప్రారంభించినట్లు సిఐ తెలిపారు. నిషేధిత పదార్థాల తయారీ, రవాణా,విక్రయంపై పోలీసులు కఠినచర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

## కెయు దూరవిద్య పిజి, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/బెల్లంపల్లి:బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పిజి కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం (ఎస్‌డిఎల్‌సిఐ) ద్వారా 2025, 26 విద్యా సంవత్సరానికి పీజీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీ ఈ నెల 11గా పేర్కొన్నారు. ఓపెన్ పీజి కోర్సుల్లో ఎంఎ, ఎంఎస్‌సి, ఎంకామ్‌లో అన్ని సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని, అలాగే ఓపెన్ డిగ్రీలో బిఎ, బికామ్, బిఎస్‌సి, కోర్సులకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని చెప్పారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పీజీ కోర్సులకు స్టడీ సెంటర్ కోడ్ నం.770, డిగ్రీ కోర్సులకు స్టడీ సెంటర్ కోడ్ నం.043 ద్వారా www.sdlceku.co.in వెబ్‌సైట్‌లో ఆన్లైన్ దరఖాస్తు చేసి, ప్రింట్‌ఔట్ తో పాటు సంబంధిత సర్టిఫికెట్ల రెండు సెట్లను కళాశాలలో అందించాలన్నారు. వివరాలకు 99592 69975 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. దూరవిద్య ద్వారా డిగ్రీ లేదా పిజి చదవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కో రారు.

## కెజిబివిలో ఒప్పంద ఉపాధ్యాయ నియామకాల దరఖాస్తులు

ప్రజాపక్షం /పెంచికల్‌పేట:కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) పెంచికల్‌పేటలో ఒప్పంద ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేక అధికారిణి కవిత తెలిపారు. తెలుగు బోధన పోస్టుకు ఎంఎ (తెలుగు), బిఎడ్, టెట్ అర్హతలు ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పిఇటి పోస్టుకు బిపిఎడ్, టెట్ అర్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులు అని చెప్పారు. రెండు పోస్టులకు కూడా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులకే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ నుండి 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కెజిబివి, పెంచికల్‌పేటలో దరఖాస్తుతో పాటు తగిన సర్టిఫికెట్లతో ప్రత్యక్షంగా హాజరు కావాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక అధికారిణి కవిత కోరారు.

## 13 వరకూ ఓపెన్ డిగ్రీలో ప్రవేశం పొందేందుకు అవకాశం

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి 2025 26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీలో చేరేందుకు ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉందని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, కోర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పాస్ లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఓపెన్ డిగ్రీలో బి.ఎ, బి.కాం, బి.ఎస్‌సిలో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందాలని తెలిపారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందే అర్హత గల అభ్యర్థులు యూనివర్సిటి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని రెండు సెట్‌ల జిరాక్స్ కాపీలను కళాశాలలో అందజేయాలని తెలిపారు. అదే విధంగా డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసి యూనివర్సిటి పర్మిషన్‌తో అడ్మిషన్‌ను కంటిన్యూ చేస్తున్న 2, 3వ సంవత్సరం (2016 సంవత్సరం నుండి) సెమిస్టర్ విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ విద్య అభ్యసిస్తున్న 2021 22 నుండి 2024 25సంవత్సరం యొక్క 2,3వ సంవత్సరం విద్యార్థులు కూడా తమ ట్యూషన్ ఫీజును ఈనెల 13 వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9160144943, 9494314314 లేదా 9866398678 సెల్‌నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## చలో ఢిల్లీకి తరలాలి

ప్రజాపక్షం/ భీమ్‌గల్:బిసిల కొరకు 42శాతం రిజర్వేషన్ల అమలు కొరకు ఈ నెల 5 నుండి 7తేది వరకు దేశ రాజధాని ఢీల్లీలో టిపిసిసి అధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మినరల డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఓ ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వమిస్తున్నట్లు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు కాంగ్రెస పార్టీ బిసిల తరుపున పోరాడుతుందన్నారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస నాయకలు తరలిరావాలని కోరారు.

## అప్పుల్లో ఉన్నప్పటికీ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం

### అర్హులైన ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు మంజూరు

### రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





ప్రజాపక్షం/గజ్వేల్:కాంగ్రెస్ అధికారంలో వచ్చేనాటికి రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వర్గల్, గజ్వేల్, ములుగు, జగదేవపూర్, మర్కుక్ మండలాల పరిధిలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 10 ఏండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలు రేషన్ కార్డు కోసం ఎదురుచూసినప్పటికీ ఫలితం లేకపోయిందని, అయితే ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి పేదకు సిఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డు మంజూరీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సిద్దిపేట జిల్లాలో 3967 రేషన్ కార్డులు ఇస్తూండగా, 11 వేలకు పైగా అర్హులైన వారికి ఆడింగ్ చేసినట్లు చెప్పారు. దీంతో ఒక లక్ష 85 వేల కిలోల సన్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు చేరిందని అన్నారు. జిల్లాలో 12 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయగా, ఇప్పటికే 8 వేల ఇండ్ల పనులు ప్రారంభమై రూ. లక్ష చొప్పున బిల్లులు పొందుతున్నట్లు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే క్రమంలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీలో భాగంగా పది వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే క్రమంలో రూ. 36 కోట్లతో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జిల్లాలో రెండు లక్షలకు పైగా గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా, నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు చెప్పారు.వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ఏకకాలంలో రూ రెండు లక్షల పంట రుణమాఫీ వర్తింపజేయడంతోపాటు జిల్లాలో 32 లక్షల మంది రైతులకు రూ 3055 కోట్లు రైతు భరోసా కింద ఖాతాలలో జమ చేసినట్లు గుర్తు చేశారు. మహిళలకు 4 కోట్ల ఉచిత బస్సు టికెట్లు అందజేయగా, సన్న బియ్యం పంపిణీకి 12 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తుండగా, సిఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఒసిలు కూడా అందజేస్తూ పేదల ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నట్లు అన్నారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు రూ.900 కోట్ల సిఎంఆర్‌ఎఫ్ నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే మహిళా సాధికారతకు కృషి చేస్తూ రూ. 4 కోట్ల వడ్డీ లేని రుణాన్ని డ్వాక్రా సంఘాల మహిళలకు విడుదల చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర పనులకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, రాష్ట్ర ఎస్‌సికమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సిద్దిపేట డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్‌డిఒ చంద్రకళ, గజ్వేల్, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్లు , నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు ప్రభాకర్ గుప్త, సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పింఛన్లలో రూ.16 కోత?

### పోస్టల్ శాఖపై లబ్ధిదారుల ఆందోళన..



ప్రజాపక్షం/బైంసా:నిర్మల్ జిల్లాలో ఆసరా పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా వచ్చే రూ.2016లో 16 కోత విధిస్తున్నారని పోస్టల్ శాఖ అధికారులపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.దాదాపు జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మందికి పైగా పింఛన్ దారులు ఉన్నారని,వారికి ప్రతి నెలా కేవలం రూ.2000 మాత్రమే ఇస్తున్నారని,మిగిలిన రూ.16ను పోస్టల్ శాఖ వారే ఉంచుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.పింఛన్ల పంపిణీలో జరుగుతున్న ఈ అవకతవకలపై లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం రూ.2016 మంజూరు చేస్తున్నప్పటికీ,తమకు మాత్రం తక్కువ మొత్తం అందడంపై పింఛన్ దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోస్టల్ శాఖ అధికారులు ఈ విషయంపై సరైన సమాధానం ఇవ్వడం లేదని,ఇది పూర్తిగా తమ హక్కులను కాలరాయడమేనని వారు వాపోతున్నారు.

**బైంసా లో మహిళల నిరసన,కలెక్టరేట్ ముట్టడికి హెచ్చరిక..**

ఈ విషయమై బైంసా మండలంలోని దెగాం గ్రామంలో మహిళలు ఆందోళన నిర్వహించారు.ఎప్పటికప్పుడు రూ.2016 పూర్తిస్థాయిలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే,జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.ఈ విధంగా నిరసన తెలపడం ద్వారా ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చి న్యాయం పొందాలని వారు భావిస్తున్నారు.ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు,ముఖ్యంగా జిల్లా కలెక్టర్,పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని,పింఛన్ దారులకు న్యాయం చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సమాచార హక్కు చట్టం వజ్రాయుధం




ప్రజాపక్షం/ఆర్మూర్:పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థి దశ నుండి ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని చెప్పారు. గ్రామ పం చాయతీ మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు కావల్సిన సమాచారం ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని చెప్పా రు. ఈ చట్టం వజ్రాయుధం, రామబాణం లాంటిదని చెప్పారు. దేశ వ్యాప్తంగా పట్టిపీడిస్తున్న అవినీతి అంతం చేసేందుకు చట్టం ఎంతో దోహదపడుతుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ను ండి దరఖాస్తు చేసుకున్న ముప్పై రోజుల్లో ఆ శాఖ నుండి సమాచారం అందకపోతే పై అధికారికి అ ప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. సమాచారం అసంతృప్తి, తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.దరఖాస్తుదారునికి తప్పుడు సమాచారం ఇచ్చినా, అసంపూ ర్తి సమాచారం ఇచ్చినా అధికారికి దినసరి 250 చొప్పున 25 వేల రూపాయలకు మించకుండా తగిన రుసుమును ప్రభుత్వం ద్వారా రాబట్టుకునే అవకాశం ఉందని చెప్పారు. అలాగే సాధించిన విజయాలు వివరంగా తెలిపారు. జీవించే హక్కు భంగం కలిగిన సందర్భాల్లో 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సమాచార హక్కు జిల్లా కన్వీనర్ న్యాయవాది గటడి ఆనంద్, వార్డెన్ షబానా బేగం,విద్యార్థినులుపాల్గొన్నారు.

## జనహిత పాదయాత్రకు జన నీరాజనం

### ఖానాపూర్ నియోజకవర్గంలో కదంతొక్కినపార్టీ శ్రే ణులు..

### అందరినీ ఆప్యాయంగా పలకరించిన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్..



ప్రజాపక్షం/ఖానాపూర్,ఖానాపూర్ రూరల్: ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదివారం రోజు నిర్మల్ జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్రకు అడుగడుగునా నీరాజనం పలికారు.ఖానాపూర్ నియోజకవర్గం సూర్జాపూర్ గ్రామం వద్ద గజమాలతో ఘనస్వాగతం పలికారు.పాదయాత్రలో భాగ ంగా మీనాక్షి నటరాజన్ వెంట టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి అనసూయ సీతక్క,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,పార్టీ శ్రేణులు,ప్రజలు నడిచారు.సుర్జాపూర్ గ్రామ శివారు నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు,స్థానికులు జనహిత పాదయాత్రకు తరలిరావడంతో రహదారులుకిలకిటలాడాయి.మహిళలు, యువకులు,ఉత్సాహంగాపాల్గొన్నారు .ఈ కార్యక్రమంలోటిపిసిసిఅధ్యక్షుడు మ హేష్‌కుమార్ గౌడ్,ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృ ష్ణారావు,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి అనసూ య సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,వేణుగోపాల చారి,శ్రీహరిరా వు,విఠల్ రెడ్డి,ఆత్రం సక్కు, సోయం బాపురావు,రేఖశ్యామ్ నా యక్,నారాయణరావు పటేల్,ఆత్రం సుగు ణ,ఆడే గజేందర్ ,క ంది శ్రీనివాస్ రెడ్డి,ఎంబడి రాజేశ్వర్,తదితరులు పాల్గొన్నా రు.

## అసైన్డ్ భూములు అమ్మడం నేరం

### ప్రభుత్వ ఆసుపత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ...



ప్రజాపక్షం/రామాయంపేట:పట్టాభూములకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన వాటిని పట్టాదారు తిరిగి విక్రయాలు జరుపడం చట్టరీత్యా నేరమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం రామాయంపేట ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు. రామాయంపేట పట్టణంలోని 1597 సర్వే నంబర్‌లో బీడికార్మికు లు పట్టాభూమి కొనుగోలు చేసి ప్రభుత్వం నుండి అసైన్డ్ పట్టాలు పొందినప్పటికి పట్టాదారు తిరిగి విక్రయాలు జరుపుతున్న విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి విలేఖరులు తీసుకెళ్లారు. ఈవిషయంపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప ట్టాలు పంపిణీ చేసినట్టు నిరూపణ అయితే ఎంతటి వా రైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. మెదక్ జిల్లా కేం ద్రం నుండి రామాయంపేట వరకు సైకిల్ ప్రయాణించిన కలెక్టర్ దంపతులు ఈసందర్భంగా ఆసుపత్రి పరిసరాలు , రికార్డులు పరిశీలించారు. ప్రజలు వ్యక్తిగత పరిసరాలు పరిశుభ్రతపై దృష్టి సారిస్తు నీరు నిలువలేకుండా చూసుకున్నట్లయితే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వం వైద్యశాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యాచరణ ద్వారా ముందుకు పోతుందని దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్ట పర్యవేక్షణకు కలెక్టర్ కార్యాలయం లోసిసి కెమెరాల ద్వారా నిఘా పెట్టామన్నారు. వైద్యాదికారులు సిబ్బంది అందరూ కూడా సెలవు రోజుల్లో అం దుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. రామాయంపేట ఆసుపత్రిలో గైనకాలజిస్టు లేకపోవడంతో తక్కువ ప్రసవాలు జరుగుతున్నాయని గు ర్తించడం జరిగిందని తొందర్లోనే గైనగాలజిస్టు పోస్టు భ ర్తీ చేస్తామన్నారు. రహదారులపై ప్రమాదాల నివారణకు పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులతో ఎప్పటికి అప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.వైద్యదికారులతోపాటుసిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు ఇస్తామన్న భరోసా ఏదీ?

### ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కౌలు రైతులు




ప్రజాపక్షం / నందిపేట్ :రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఇస్తామన్న భరోసా ఎక్కడికి పోయిందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపడుతుంది. కానీ కౌలు రైతుల గురించి పట్టించుకోకపోవడం విచారకరం. కౌలు రైతులకు ప్రభుత్వం మామూలు రైతుల మాదిరిగా రైతు భరోసా ఇస్తామని చెప్పి చేతులు దులుపుకుంది. రైతు భరోసా డబ్బులు ఎప్పుడు ఇస్తుందా అని ఎదురు చూస్తుంటే ప్రభుత్వం ఈ విషయమే మరిచిపోయింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఇన్ని నెలలు కావస్తున్నా కౌలు రైతులకు రైతు భరోసా గురించి మాటెత్తడం లేదు. కానీ ఉపాధి హామీలో పనిచేస్తున్న భూమి లేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేరుతో జనవరి నెల 26న సిఎం ఈ పథకాన్ని ప్రారంభించారు. కానీ కౌలు రైతుల గురించి కనీసం మాట ఎత్తలేదు. దీన్ని బట్టి చూస్తే వారితో ఏమి అవసరం లేదని తెలిసిపోయిందని కౌలు రైతులు బాధనువ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రాధాన్యత కౌలు రైతులకు ఇవ్వడం లేదని, వ్యవసాయ భూమి ఉన్న వారినే రైతులుగా గుర్తిస్తు కౌలు రైతులను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కౌలు రైతులే సగానికి పైగా ఉన్నారు. వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ఉన్న రైతులు, భూస్వాములు పంటలు పండించకుండా వాటిని కౌలుకు ఇస్తున్నారు. చాలా గ్రామాలలో కౌలుకు డిమాండ్ ఉంది. చాలా మంది పేద రైతులకు భూములు లేవు. కొందరికి భూములు ఉన్న అందులో పంటలు పండవు. బోరుబావులు వేసినా నీళ్ళు పడకపోవడంతో వర్షధారపు పంటలు వేసుకుంటారు. ఆ పంట చేతికి వస్తుందన్న నమ్మకం లేదు. అందుకే రైతులు కౌలుకు భూములు తీసుకొని పంటలు పండిస్తున్నారు. ఇవన్నీ బాగానే ఉన్న పెద్ద రైతులు అన్న రేటుకే కౌలు చెల్లించాలి. ప్రస్తుతం రెండు పంటలకు ఎకరానికి ఇరవై వేల నుండి ముప్పై వేల రూపాయలు ముందుగానే చెల్లించి పంటలు పండించుకొంటున్నారు. ఈ ఖరీఫ్‌లో కౌలు రేట్లు రైతులు అమాంతంగా పెంచారు. పంట పండినా పండకపోయినా కౌలు చెల్లించాల్సిందే. భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా, బ్యాంకులో పంట రుణాలు, రైతు భీమా వంటి ప్రభుత్వ పథకాలు వారికే దక్కుతాయి. కౌలు రైతులకు ఇవేవి వర్తించవు. వీరు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకొని పంటలు వేసుకుంఆరు. పంట చీడ పీడల వల్ల దిగుబడి తగ్గినా భూ యజమానులకు సంబంధం లేదు. ఎకరానికి పంట ఖర్చు దుక్కి రెండు సార్లు రెండు వేలు, విత్తనాలు 900 నుండి 950 రూపాయలకు పెంచారు. తూకం మడికి వేయి, పొలం దమ్ము రెండు వేలు, నాట్లు వేయడానికి ఆరు వేలు, కాంప్లెక్సు ఎరువులకు మూడు వేలు, పంట కోయడానికి మూడు వేలు, వడ్లు ట్రాక్టర్‌లో తరలించడానికి వేయి రూపాయలు ఖర్చు అవుతాయి. కౌలుకు ఇరవై నుండి ఇరవై ఐదు వేలు పోతే, మిగిలేవి ఐదు నుండి పదివేలు మాత్రమే. కౌలు రైతుల కష్టాలు పట్టించుకొనేవారు లేరు. ప్రభుత్వం రైతు భరోసాలో కౌలు రైతుకు ఎకరానికి పన్నెండు వేలు ఇస్తామని చెప్పింది. కానీ ప్రస్తుతం ఆ విషయమే మరిచిపోయింది. అదే ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని నివేదికలు, ఏగ్రామంలో ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరించి, జనవరి 26 పథకం ప్రారంభించింది. ఎన్నికలలో కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పిన వాస్తవ రూపం దాల్చలేదు. కౌలు రైతులు నామ్‌కే పరిమితం అవుతున్నారు. అందుకే ప్రభుత్వం కౌలు రైతులకు ప్రభుత్వ రుణాలు, పథకాలు ఇస్తు రుణమాఫీ, రైతు బీమా వర్తింపజేయాలి. సన్న, చిన్నకారు రైతుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే వారికి మేలు జరుగుతుంది. ఇచ్చిన హామీని నెరవేర్చవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఏమి చేస్తారో వేచి చూడాలి...



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## స్థాయిని మరిచి మాట్లాడితే సహించేది లేదు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అధికారం కోల్పోయినప్పటికి మాజీ జెడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్థాయికి మించి మాట్లాడుతున్నాడని మారోమారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు జెడ్పిటిసిగా చేసిన శ్రీనివాస్ రెడ్డి కనీస పరిజ్ఞానం లేకుండా సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడని, మరో సారి తమ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నర్సయ్య, బీసి సెల్ అధ్యక్షులు సురేష్, నాయకులు కిరణ్, ఏఎంసి వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మల్లయ్య, రాజం తదితరులు ఉన్నారు.



## ప్లాస్టిక్ వాడితే నిషేధిత చర్యలు



**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీంధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని రెస్టారెంట్లు టిఫిన్ సెంటర్లు మరియు చికెన్ సెంటర్లలో , నిల్వ వుంచిన పదార్థాలు నిషేదిత ప్లాస్టిక్ వాడకంపై పుర అధికారులు తనిఖీ కార్యక్రమం చేపట్టారు. సింగిల్ యూస్, ప్లాస్టిక్ వాడుతున్న రెస్టారెంట్లు చికెన్ సెంటర్లు టిఫిన్ సెంటర్లుకి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారు వినియోగిస్తున్న సింగల్ యూస్ ప్లాస్టిక్ మరియు నిలువ ఉంచిన పదార్థాలను స్వాధీన పరుచుకొని సుమారుగా 13,500 రూపాయలు జరిమానా విధించి బట్ట సంచులను వాడాలని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంధర్ మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేధించాలని లేనియెడల భారీ జరిమానా విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని వారు వెంటనే తీసుకోవాలని, వ్యాపార కార్యకలాపాలలో వెలువడిన చెత్తను తడి, పొడి హానికర చెత్తగా వేరుచేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించారు. లేనిచో యస్‌డబ్ల్యుయం2019 చట్టం ప్రకారం జరిమానా విధించబడునన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌ఫెక్టార్లు బాలే అశోక్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, వార్డ్ ఆఫీసర్లు మధు, రాహుల్, ఎన్విరాల్‌మెంటల్ ఇంజనీర్ జి.మహేష్, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, రమేష్, హేమంత్, జవాన్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలను నివారించేందుకు నిఘా పటిష్ఠం: శ్రీనివాస్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో గంజాయి మొక్కలు పెంచుతున్న నిందితుడిని పట్టుకొని కేసు నమోదు చేసిన పోలీసులు. సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని అందిన సమాచారం మేరకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో నర్సింగాపూర్ గ్రామంలో పోలీసు బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో నిందితుడు మొతుకు రాజు 24 సం,, 4 గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని మొక్కల బరువు సుమారు 241 గ్రాములు ఉందని నిందితుడిని అదుపులోకి తీసుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రకాల అక్రమ కార్యకలాపాలపై నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పట్టుబడిన నిందితుల పై కఠినంగా చర్యలు తీసుకుంటూ నిరంతరం మత్తుపదార్థాల వ్యసనాన్ని నివారించేందుకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గంజాయి సాగు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారి సమాచారం అందించాల్సిందిగా ప్రజలను సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు.

## నెల రోజుల తర్వాత స్వగ్రామం చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం



**ప్రజాపక్షం/మల్యాల:** పొట్ట చేత పట్టుకొని దేశం విడిచి దుబాయ్ కి వెళ్ళిన మల్యాల మండలంకు చెందిన గల్ఫ్ కార్మికుడు నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోగా ఆదివారం రోజున మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. బంధువులు తెలిపిన వివరాలు జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన బూస అంజయ్య (50) ఏడాది క్రితం దుబాయ్ వెళ్ళాడు. జూలై 4వ తేదీన దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బూస అంజయ్య మృతి చెందినట్లు కంపెనీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అంజయ్య చనిపోయిన రోజు నుంచి కుటుంబ సభ్యులు మృత దేహం కోసం ఎదురు చూడగా నెల రోజులకు అంజయ్య మృతదేహం స్వగ్రామం ముత్యంపేటకు చేరుకోవడంతో కుటుంబ సభ్యుల రోధనాలు మిన్నంటాయి.

## మహిళ ఆత్మహత్య



**ప్రజాపక్షం/చొప్పదండి:** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపం చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చొప్పదండి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చిట్యాలపల్లి గ్రామానికి చెందిన రాపల్లి అనసూర్య(65) గత నాలుగు సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శనివారం రాత్రి మనస్థాపంతో జీవితంపై విరక్తి చెంది వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు రాపల్లి అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చొప్పదండి పోలీసులు తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు తిరిగి అప్పగించారు. నేరెళ్లకు చెందిన ఎం.విజయ్ కుమార్ అనే వ్యక్తి మార్చి 19న రెడ్‌మీ8 ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసు సిబ్బంది ఈ ఫోన్ సిఇఐఆర్ టెక్నాలజీ ద్వారా మెదక్‌లో ఉన్నదని కనుక్కుని ట్రేస్ చేసి రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి ఆద్వర్యంలో ఫోన్‌ను బాధితుడు విజయ్ కుమార్‌కు అప్పగించారు. ఈ ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సిఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

### రూ.1 కోటి 3 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
### అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కలనెరవేరుతుందని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలం రెబల్‌దేవ్‌పల్లి, చిన్న బొంకూర్, మియాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ, ఇళ్లకు ముగ్గులు పోసే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ యాసంగి పంటకు సంబంధించి త్వరలోనే సన్న వడ్లకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలను పట్టించుకోకుండా ఇండ్లు మంజూరు చేయలేదని ఎమ్మెల్యే విజయరమణ రావు గారు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దశలవారీగా పదికి పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. అర్హులైన అందరికీ ఇండ్లను మంజూరు చేస్తామని, మలి దశలోనూ అర్హులైన వారిని గుర్తించి ఇండ్లు ఇప్పిస్తామన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ, తిరిగి రుణ సదుపాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ.10లక్షలకు పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోల్లు, సన్న వడ్లకు రూ. 500ల చొప్పున బోనస్, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి అందజేస్తున్నట్టు చెప్పారు. సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను, రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టేందుకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకువెళ్లే వీలుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య దర్శన్, ప్రభుత్వ అధికారులు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్, పన్నాల రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మహిళలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి విడుదల



**ప్రజాపక్షం/రామడుగు:** వర్షాలు లేక అవస్థలు పడుతున్న రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం గాయత్రి పంప్ హౌజ్ ద్వారా రైతులకు సాగునీరు విడుదల చేయించారు. ఈ సంధర్బంగా రైతులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, కోల రమేష్ తదితరులున్నారు.

## ప్రజల పక్షాన పోరాటం సిపిఐ



### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పార్టీ ఏదైనా దేశంలో ఉందంటే అది వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ అని, ప్రజల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ పార్టీ అని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన సిపిఐ నగర సమితి సభ్యుల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆగస్టు 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలు జరుగనున్నాయని, ఇట్టి మహాసభలను రామగుండం నగర సమితి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మొట్టమొదట పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ అని, దున్నే వాడికే భూమి కావాలని, తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘన చరిత్ర సిపిఐ పార్టీ అని ఆయన పేర్కొన్నారు. దేశంలో కార్మికులను దోచుకుంటున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా సమ్మెలు చేయించి ఎనిమిది గంటల పని దినాన్ని అమల్లోకి తెచ్చింది కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి ని సన్మానించిన పార్టీ శ్రేణులు పెద్దపల్లి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శిగా తిరిగి ఎన్నికైన తాండ్ర సదానందం గారిని గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన సిపిఐ నగర సమితి సభ్యుల సమావేశం అనంతరం పార్టీ శ్రేణులు ఘనంగా పూల మాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, మద్ది ఎల్లా గౌడ్, కే.కనక రాజు, తాళ్ళ పెల్లి మల్లయ్య,ఆరేల్లి పోషం, రంగు శ్రీను, ఏం.ఎ.గౌస్, సూర్య,మడికొండ ఓదెమ్మ ,అసల రమ, శనిగరపు చంద్రశేఖర్, సురేందర్, జగన్, పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఆపదకు ఆపన్న హస్తంగా స్నేహితులు ఉంటారని, అభివృద్ధికి చేయూతనిచ్చేది స్నేహితులను చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. నేటి పోటీ ప్రపంచంలో సమయభావం వల్ల చాలా మంది స్నేహితులకు దూరమవుతున్నారని, వారితో సంప్రదింపులను సైతం ఏ రూపంలో జరపకపోవడం అత్యంత విచారకరమన్నారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని కేటాయించి స్నేహానికి మద్దతు తెలపాలని , స్నేహాన్ని పరిరక్షించుకోవాలన్నారు. తరతరాల స్నేహబంధ వైవిద్యాన్ని గొప్పతనాన్ని విశిష్టతను ప్రతి ఒక్కరు పాటించడమే కాకుండా స్నేహబంధంలో ఉన్నటువంటి నైతిక విలువలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలవాలన్నారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డికి ఫ్రెండ్‌షిప్ రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలియజేసి వారి సహకారాన్ని అభివృద్ధికి అందించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## జిఒ నెంబర్ 282ను రద్దు చేయాలి



### కార్మిక శాఖ మంత్రికి సిపిఐ జిల్లా కార్యదర్శి వినతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** కార్మికుల వ్యతిరేక జీవో 282ను రద్దు చేయాలని పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కార్మిక శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో స్థానిక యమ్‌బి గార్డెన్లో శనివారం రోజున డా. వివేక్ వెంకటస్వామి కార్మిక శాఖ మరియు మైనింగ్ శాఖ మంత్రికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరై వారిని షాల్వాతో సత్కరించి సన్మానం చేసిన అనంతరం సదానందం మాట్లాడుతు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను ఒక్కొక్కటిగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాష్టంలో మీరు కార్మిక శాఖ మంత్రిగా ఐనా తరువాత మీ ప్రభుత్వం Go no 282 తీసుకు రావడం జరిగిందని, ఆనాడు 18 గంటల పని దినం కోసం కార్మికుల ప్రాణాత్యాగాలతో 8 గంటల పనిదినాలు సాధించుకున్నా మళ్ళీ ఇలాంటి Go లు తీసుకొచ్చి 10 గంటలు పనిదినాలు కార్మికులు పనిచేయాలని మీరు తీ సుకువచ్చిన Go no 282 రద్దు చేయాలని మంత్రికి వితిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ మంటపానికి రూ.20 లక్షలు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.20లక్షలు అందిస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. స్థానిక పటేల్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ నూతన కమిటీ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శి బండి మహేష్, ఉపాధ్యాక్షులు చల్ల రవి, ముత్తినేని లక్ష్మణ్, కోశాధికారి బుక్క మహేష్, ఇతర కార్యవర్గ సభ్యులను మంత్రి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ సమావేశంలో మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని మున్నూరు కాపు సామాజిక వర్గం ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. పట్టణ మున్నూరు కాపు సంఘం అభివృద్ధిలో తాను పాలు పంచుకుంటానని, కళ్యాణ మండపం నిర్మాణానికి మొదటి విడతగా రూ.20లక్షలు నిధులు అందిస్తానని, దశలవారీగా మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధమని ప్రకటించారు. ధర్మపురి ప్రజల ఆశీర్వాదంతో తాను తెలంగాణ రాష్ట్ర క్యాబినేట్‌లో మంత్రిగా కొనసాగుతున్నానని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరిచి రుణం తీర్చుకుంటానని చెప్పారు. 2027 గోదావరి నది పుష్కరాలకు పెద్దమొత్తంలో నిధులు తీసుకువచ్చి కనీవిని ఎరుగని రీతిలో ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలను చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు చీపిరిశెట్టి రాజేష్, బండి మహేష్, చల్ల రవి, ముత్తినేని లక్ష్మణ్, బుక్క మహేష్, చెరుకు రాజన్న, బండి మురళి, వొడ్నాల రాజన్న, శీలం రాజేష్, సంగి ఆనంద్, సంగి సత్తెమ్మ, సంగి నర్సయ్య, జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఎస్. దినేష్, వేముల రాజేష్, జక్కు రవీందర్, చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

## సిఐడి ఎస్ఐ గుడాటి సుమలతకు ఫొటోగ్రఫీలో స్వర్ణపతకం



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్ 2025లో సిఐడి కరీంనగర్ యూనిట్‌కు చెందిన సబ్ ఇన్స్‌పెక్టర్ గుడాటి సుమలత ఫోటోగ్రఫీ విభాగంలో మొదటి స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ పోటీలు జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్ జిల్లా మమునూరులోని పోలీస్ శిక్షణ కేంద్రంలో , వరంగల్ పోలీస్ కమిషనర్ ఆద్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ సమావేశంలో సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ (8 ఈవెంట్లు), యాంటీ సాబిటేజ్ చెక్ (4 ఈవెంట్లు), డాగ్ స్క్వాడ్ పోటీలు (3 ఈవెంట్లు), కంప్యూటర్ అవేర్‌నెస్ (3 ఈవెంట్లు), ఫోటోగ్రఫీ (1 ఈవెంట్), వీడియోగ్రఫీ(1 ఈవెంట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. నేరస్థలాల ఫోటోగ్రఫీలో ఎస్ఐ గుడాటి సుమలత ప్రదర్శన రాష్ట్రస్థాయిలో అత్యుత్తమంగా గుర్తించబడింది.

## రోడ్డు ప్రక్కన చెత్త కుప్పలు

### తొలగించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేశ్ కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపలి:**సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు ప్రక్కన చెత్త కుప్పలు, రోడ్డు అంతా బురద నీటిలో ఉందని, దీనిపై వెళ్ళే వాహన దారులు, ప్రజలు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఇట్టి రోడ్డు ప్రక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించి, రోడ్డుపై బురద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన ఆర్జీ వన్ యాజమాన్యం ను డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా ఈ రోడ్డు అంతా బురద నీరు ప్రవహించడం వల్ల రోడ్డు పై వెళ్ళే వాహన దారులు జారి పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రక్కన చెత్త కుప్పలు ఉన్నాయని వాటిని తొలగించక పోవడం వల్ల రోడ్డు పై వెళ్ళే వారికి దుర్వాసన వస్తుందని దీని వల్ల వారు అనేక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు పై నిత్యం సమీప గ్రామాలైన జనగామ, సుందిల్ల, ముస్త్యాల కు చెందిన ప్రజలు,గోదావరిఖని లో ఉన్న వివిధ కాలనీలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు విధులకు హాజరు కావడం కోసం జిడికె వన్ ఇంక్లైన్, టూ ఇంక్లైన్, టూఏ ఇంక్లైన్ మరియు 11ఏ ఇంక్లైన్ లకు వందలాది మంది వెళ్తారని ఆయన పేర్కొన్నారు. కనుక సింగరేణి యాజమాన్యం స్పందించి జిడికె వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు ప్రక్కన చెత్త కుప్పలు పోయకుండా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా రోడ్డు పై నీరు రాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇట్టి రోడ్డు పై రాత్రి పూట లైటు లు వెలగడం లేదని వెంటనే లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కక్ష పెంచుకున్నారు... కడతేర్చారు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** గ్రామాలలో జరిగే చిన్న చిన్న భూ సమస్యలు చినికి చినికి గాలి వానలా మారి పంచాయతీలకు దారి తీసి ప్రాణాలు తీసే వరకు కక్షలు పెంచుకుని అంతమొందించిన ఘటనలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వివరాల్లోకి వెళితే మండంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సకినపెల్లి కాశీం అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన నానం చిన్న హనుమండ్లు, నానం రాకేష్‌లకు సంబంధించిన నాలుగు గుంటల విషయంలో తలెత్తిన భూమి వివాదం కాశీం ప్రాణాలను తీసింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కాశీం తన భార్య మృతి చెందినప్పటి నుండి ఇద్దరి కుమారులే చెరో నెల బాగోగులు చూసుకుంటూ ఉంటున్నారని, గత పది సంవత్సరాల క్రితం మృతుని తమ్ముడు ఉషన్న నివాసం ఉంటున్న పక్కనే ఉన్న నాలుగు గుంటల భూమిని నిందితులకు అమ్మగా బాత్రూం విషయంతో తరచు గొడవలు జరిగి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయని, సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో కక్ష పెంచుకున్న నానం హనుమండ్లు రాకేష్‌లు శనివారం రాత్రి దాదాపు 7.30 గంటల ప్రాంతంలో పెద్ద కొడుకు ఇంటి నుండి తన పాత ఇంటికి వెళుతున్న క్రమంలో రోడ్డుపై ఆపి కాశీంపై విచక్షణ రహితంగా కర్రలతో కొట్టగా తలపై బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడని, కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రీల్



## సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ పోస్టర్ విడుదల

సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 కర్టెన్ రైజర్ ఈవెంట్ హైదరాబాద్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. సీనియర్ నటులు మురళీ మోహన్, నిర్మాత కేఎస్ రామారావు, ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, రామసత్యనారాయణ, డైరెక్టర్స్ అనిల్, డా.సురేష్ బాబు, తదితరుల ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా అతిథులు చేతుల మీదుగా సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 ఫంక్షన్ డేట్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నటులు మురళీ మోహన్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా అవార్డ్స్ ఈవెంట్ చే స్తున్న ఏకైక మేగజైన్ సంతోషం. సౌత్ ఇండియా లో ఫిలింఫేర్ తప్ప మరో మేగజైన్ ఏదీ కూడా ఇంత సుదీర్ఘ కాలం అవార్డ్స్ ఫంక్షన్స్ చేయలేదు. పెద్ద పెద్ద మీడియా సంస్థలు పెట్టిన అవార్డ్స్ ఫంక్షన్స్ కూడా సక్సెస్ కాలేదు. కానీ సురేష్ ఒక్కడు ఎంతో కష్టపడి 24వ సారి ఈవెంట్ చేస్తున్నాడు. తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. ఏపీలో త్వరలో ఫిలిం అవార్డ్స్ ఇవ్వబోతున్నారు. సూర్య చంద్రులకు గ్రహణం పట్టినంత మాత్రాన వారికేం కాదని అన్నారు. నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ ఒక సినిమా ఈవెంట్ చేయాలంటే ప్రభుత్వాలకే పదేళ్ల టైమ్ పట్టింది. అలాంటిది ఒక్కడు, సామాన్యుడు సురేష్ కొండేటి 24 ఏళ్లుగా దిగ్విజయంగా సంతోషం అవార్డ్స్ ఫంక్షన్ చేస్తుండటం మామూలు విషయం కాదు. నేను ఆ టైమ్‌లో సురేష్ కు ఏదో ఒకటి చేయాలని ఎఫ్ఎన్ సీసీ కల్చరల్ కమిటీ అడిషనల్ ఛైర్మన్‌గా నియమించాను. కానీ ఏ రోజు సురేష్ బాధపడటం నేను చూడలేదు. నవ్వుతూనే ఉన్నాడు. ఈ 24వ అవార్డ్స్ ఈవెంట్ కూడా సక్సెస్ ఫుల్‌గా చేయాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, నిర్మాత ఏడిద రాజా, వి.వి.కె. హౌసింగ్ ఇండియా ప్రై వెట్ లిమిట్ అధినేత వల్లూరు విజయకుమార్, సూర్య సెమ్ డైరెక్టర్ అనిల్, డా.సురేష్ బాబు, సంతోషం అధినేత సురేష్ కొండేటి పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై హీరో పాట



డ్రగ్స్‌పై యువతకు అవగాహన కల్పించాలని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపునకు స్పందించిన హీరో కృష్ణసాయి పలు ప్రచార చిత్రాలను రూపొందిస్తున్నారు. కృష్ణ సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్మాణంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు?' అనే సందేశంతో రూపొందించిన ప్రచార వీడియోను హీరో కృష్ణ సాయి పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో కృష్ణ సాయి మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్య పూరిత గీతాన్ని రూపొందించాం. గవర్నర్లు, పోలీస్ విభాగంతో పాటు, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రశంసలు వెల్లువెత్తాయి.

## ఇది అదృష్టంగా భావిస్తున్నా

### 'సక్సెస్ మీట్'లో నిర్మాత అల్లు అరవింద్



హోంబాలే ఫిలమ్స్ సమర్పణలో క్లీమ్ ప్రొడక్షన్స్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మహావతార్ నరసింహ. ఈ చిత్రానికి అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించారు. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా జూలై 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకొని, భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ఈ సినిమాని నేను రిలీజ్ చేసేలా అనుగ్రహించిన నరసింహ స్వామివారికి నమస్కారం. నిర్మాత విజయ్ ఫోన్ చేసి, ఈ సినిమాని తెలుగులో మీరు విడుదల చేయాలని అని అడిగారు వెంటనే ఓకే అన్నాను. సినిమా విడుదలైన రోజు మార్నింగ్ షోకి వచ్చిన రెస్పాన్స్‌ని దృష్టిలో పెట్టుకుని ఈవెనింగ్ కొన్ని షోస్ పెంచాం. ఈ సినిమా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడ్డారు. 2021లో సినిమాని మొదలుపెట్టి ఎన్నోఒడిదొడుకులు ఎదుర్కొని, పట్టుదలతో సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు. ఆ నరసింహ స్వామి వారే వారికి ఈ అద్భుతమైన విజయాన్ని అందించారు. ఎప్పుడూ థియేటర్స్ రాని ప్రేక్షకులు ఈ సినిమాని వీక్షిస్తున్నారు అని చెప్పారు.



## 'కూలీ' ట్రైలర్ రిలీజ్

సన్ పిక్చర్స్ పతాకంపై తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఈ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు సినిమా నటుడు నాగార్జున విలన్ పాత్రలో నటిస్తున్నారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి. రజనీకాంత్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కూలీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.ఒకడు పుట్టగానే వాడు ఎవడి చేతిలో చావాలో తలమీద రాసిపెట్టి ఉంటుంది' అనే నాగార్జున పవర్ ఫుల్ డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ గూస్ బంప్స్ తెప్పించింది. 'అదుగు పెడితే విజిల్లు మోగులే' అనే పవర్ ఫుల్ బీజీఎంతో దేవా పాత్రలో రజనీకాంత్ ఎంట్రీ అదిరిపోయింది. రజనీకాంత్ డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. సూపర్ స్టార్ అమీర్‌ఖాన్, కన్నడాస్టార్ ఉపేంద్ర ఎంట్రీలు అదిరిపోయాయి. సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్ పాత్రలు చాలా ఆసక్తికరంగా వున్నాయి. డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కూలీ కోసం చేసిన వరల్డ్ బిల్డింగ్ అద్భుతంగా వుంది. ఆయన నెక్స్ట్ లెవెల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. అనిరుధ్ బ్యాగ్రౌండ్ గూస్ బంప్స్ బీజీఎం ఇచ్చారు. గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రఫీ. విజువల్స్ గ్రాండియర్‌గా వున్నాయి. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ బాగుంది. మొత్తానికి ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలని డబుల్ చేసింది.

## నాపై ఇంత ప్రేమ చూపుతారని అనుకోలేదు

### సత్యదేవ్



విజయ్ దేవర కొండ కథా నాయకుడిగా నటించిన 'కింగ్డమ్'లో సత్యదేవ్ అన్నగా నటించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా థియేటర్లలో సక్సెస్ ఫుల్‌గా నడుస్తోంది. ఈ నేపథ్యంలో సత్యదేవ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

*** 'కింగ్డమ్' లాంటి భారీ సినిమాలో శివ అనే పవర్ ఫుల్ రోల్ చేశారు.. స్పందన ఎలా ఉంది?**

ఇప్పటిదాకా ఈ సినిమాకి వచ్చినన్ని ఫోన్ కాల్స్ నాకు ఎప్పుడూ రాలేదు. మొదటి షో నుంచి అందరూ ఫోన్లు చేసి అభినందిస్తూనే ఉన్నారు. గౌతమ్ నాకు 'కింగ్డమ్' కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా వెంటనే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాను. అంత నచ్చింది నాకు ఈ కథ. నా నమ్మకం నిజమై, ఇప్పుడు సినిమాకి ఇంతటి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది.

*** యాక్షన్ సీన్స్‌కి మంచి పేరు రావడం ఎలా అనిపించింది?**

ఎప్పుడైనా యాక్షన్ సీన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాము. ఇందులో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే.. నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది.

*** ఈ చిత్రంలో మీకు ఛాలెంజింగ్‌గా అనిపించిన సీన్ ఏంటి?**

విజయ్ నా తమ్ముడు అని తెలిసిన తర్వాత జైల్లో మా ఇద్దరి మధ్య సంభాషణ జరుగుతుంది. అసలు గౌతమ్ నా పాత్రను రాసిన తీరే అద్భుతంగా ఉంది. ఓ వైపు తమ్ముడు, మరోవైపు దివి ప్రజలు, ఇంకో వైపు ఒక నిజం తెలుసు కానీ ఎవరికీ చెప్పలేదు. ఇలా ఆ పాత్ర చుట్టూ ఎంతో ఎమోషన్ ఉంది. అందుకే డ్రామా అంతలా పండింది.

*** మురుగన్ పాత్ర పోషించిన వెంకటేష్ గురించి చెప్పండి?**

ఈ సినిమాలో విజయ్‌కి, నాకు ఎంతో పేరు వచ్చిందో వెంకటేష్ కి కూడా అంత పేరు వచ్చింది. అద్భుతంగా నటించాడు. షూటింగ్ సమయంలోనే బాగా నటిస్తున్నాడని మేమందరం అనుకున్నాం. ఇప్పుడు ప్రేక్షకులు కూడా అదే మాట చెప్తున్నారు. ఒక కొత్త నటుడికి ఇంత పేరు రావడం మామూలు విషయం కాదు.

*** విజయ్ దేవరకొండ గురించి ఏం చెప్తారు?**

విజయ్ తో నాకు అంతకముందు పరిచయం లేదు. కలిసిన తర్వాత తెలిసింది విజయ్ చాలా మంచి వ్యక్తి అని. తక్కువ సమయంలోనే మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. విజయ్‌ని నేను నిజంగానే ఒక బ్రదర్‌లా ఫీల్ అయ్యాను. విజయ్ అంత మంచి వ్యక్తి కావడం, నాతో అంత మంచిగా ఉండటం వల్లే. విజయ్ గొప్ప నటుడు. సన్నివేశాన్ని కానీ, సంభాషణలను కానీ అతను అర్థం చేసుకొని నటించే తీరు నన్ను ఆశ్చర్యపరిచింది.

*** నిర్మాత నాగవంశీ గురించి?**

నాగవంశీ గట్స్ ఉన్న ప్రొడ్యూసర్. ఒక కథను నమ్మి సినిమా చేద్దాం అనుకున్నారంటే.. ఎక్కడా వెనకడుగు వేయరు, ఏ విషయంలోనూ రాజీపడరు. పరిశ్రమలో వంశీ తనకంటూ ప్రత్యేక పంథాను సృష్టించుకున్నారు కాబట్టే.. సితార ఎంటర్టైన్మెంట్స్ ఇంత పెద్ద నిర్మాణ సంస్థగా ఎదిగింది. వంశీ గారంటే నాకెప్పుడూ గౌరవం ఉంటుంది.

*** తదుపరి ప్రాజెక్టులు?**

అరేబియన్ కడలి అనే సిరీస్ చేశాను. అమెజాన్ ప్రైమ్‌లో ఆగస్టు 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 'ఫుల్ బాటిల్' అనే సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది. వెంకటేష్ మహా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. 'ఆరంభం' ఫేమ్ అజయ్ నాగ్ తోనూ ఓ చిత్రం చేస్తున్నాను. వీటితో పాటు మరో రెండు సినిమాలు ఉన్నాయి.

## సులభ వ్యాపారం కోసం కొత్త మైనింగ్ విధానం: గడ్కరీ

నాగపూర్: పారిశ్రామిక వాటాదారులు సులభంగా వ్యాపారం చేయడం కోసమే కొత్త ప్రతిపాదిత గనుల తవ్వకం విధానం తీసుకువచ్చినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. మూడునెలల్ల అన్నిరకాల అనుమతులను పారిశ్రామికవేత్తలకు ఇవ్వడంద్వారా నాలుగో నెలనుండే పారిశ్రామికవేత్తలు తవ్వకాలు చేసి వాటిని బయటకు తీసే ప్రక్రియ ప్రారంభించడానికి వీలుగా ఉంటుందని ఆయన చెప్పారు. కొత్త విధానం వల్ల గనుల తవ్వకాల్లో ఉంటే అన్ని ఆటంకాలూ తొలగిపోతాయని, వాటిని తొలగించడంకోసమే కొత్త విధానం ప్రతిపాదించామని చెప్పారు. 'అభివృద్ధి భారతంలో విదర్భ ప్రయాణ ప్రణాళిక ఇండియా@100' అనే అంశంపై నాగపూర్‌లో జరిగిన ఒక సమావేశంలో మంత్రిగడ్కరీ మాట్లాడుతూ, విదర్భలోని గడ్చిరోలీజిల్లాలో గనుల తవ్వకాలు, స్టీలుకు సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం గనుల తవ్వకానికి కొత్త విధానం ప్రతిపాదించిందని చెప్పారు. 'ఈ గనుల తవ్వకం విధానం ఇటీవల కేంద్రమంత్రివర్గం ముందుకు ఆమోదం కోసం వచ్చిందని, ఐతే ప్రధాని మోదీ ఈ విధానంపట్ల పూర్తిగా సంతృప్తి చెందకపోవడంతో కొన్ని సలహాలు ఇచ్చారని, కొన్ని మార్పులు చేర్పుల సలహాలు ఇచ్చారని, తనతో ఈ విధానం గురించి చర్చించాలని మంత్రివర్గ కార్యదర్శికి మోదీ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

## ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కలకలం

### బర్త్‌డే పార్టీలో నిర్వహించిన టెస్టులో పాజిటివ్

### ఆరుగురు ఐటి ఉద్యోగుల అరెస్టు





ప్రజాపక్షం/రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లిలోని ఓ ఫామ్ హౌస్ బర్త్‌డే పార్టీలో ఐటీ ఉద్యోగుల గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్, విదేశీ మద్యం సేవిస్తున్నారన్న పక్క సమాచారంతో సమాచారంతో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడి చేసి భగ్నం చేశారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఉండే ఐటీ ఉద్యోగి అభిజిత్ తన బర్త్‌డే పార్టీ నిర్వహించేందుకు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామ సమీపంలోని సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు బర్త్‌డే వేడుకలు చేసుకుంటున్నారన్న పక్కా సమాచారంతో ఫామ్ హౌస్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలిన ఆరుగురు ఐటీ ఉద్యోగులైన అభిజిత్ తోపాటు సింప్సన్, పార్థు, గోయల్, యశ్వంత్, సేవియో డెన్నిష్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు. అదేవిధంగా సెరీన్ ఆచార్జ్ ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారి వద్ద నుండి సుమారు రెండు లక్షల విలువ చేసే ఎల్ఎస్‌డి బ్లాట్స్, హాష్ ఆయిల్ డ్రగ్స్, ఐదు విదేశీ మద్యం బాటిళ్లు, మూడు లగ్జరీ కార్లు, ఆరు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులకు నిందితులను అప్పగించగా ఈ మేరకు చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో ఐజిపిల కొరత తీరాలంటే పదేళ్లు ఆగాల్సిందే!



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజిపి)ల కొరత రాష్ట్ర ప్రభుత్వాన్ని వేధిస్తోంది. పోలీసు శాఖలో ఆయా విభాగాలలో 16 ఐజి స్థాయి పోస్టులు ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారు. అలాగే డిఐజి, ఎస్‌పి పోస్టులు కూడా ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఐజి పోస్టు స్థానాల్లో డిఐజి, ఎస్‌పి స్థాయి అధికారులతో పాటు రిటైర్డ్ అయిన అధికారులతో భర్తీచేసి నెట్టుకొస్తున్నారు. తెలంగాణకు గుండెకాయగా ఉండాల్సిన హైదరాబాద్ పోలీసు విభాగంలోని స్పెషల్ బ్రాంచ్ చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి ఉండాలి అయితే ఐజిల కొరత వల్ల ఈ పోస్టును కేవలం ఎస్‌పి స్థాయి అధికారి అపూర్వ రావుతో సర్దుబాటు చేశారు. అలాగే హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి ఉండా అయితే ఇక్కడ కూడా డిఐజి స్థాయి అధికారి జోయల్ డేవిస్‌తో సర్దుబాటు చేయక తప్పలేదు. ఇక సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఎఆర్) చీఫ్‌గా ఐజి స్థాయి అధికారి పోస్టు ఇది. అయితే ఎస్‌పి స్థాయి అధికారిణి రక్షితమూర్తితో భర్తి చేయకతప్పలేదు. అలాగే ఇంటెలిజెన్స్ సెక్యూరిటి వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ)కు కూడా ఐజి స్థాయి అధికారి ఉండాలి. అయితే ఐజిల కొరత కారణంగా ఈ పోస్టులో ఇటీవలే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఐజి)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన వివి కమలాసన్‌రెడ్డిని రీ రిక్రూట్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇక శాంతిభద్రతల విభాగంలో అత్యంత కీలకమైన మల్టీజోన్2 ఐజిగా సత్యనారాయణ ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఖాళీ అయిన ఈ పోస్టులో కూడా ఐజి స్థాయి అధికారిని నియమించలేదు. ఈ స్థానాన్ని డిఐజి స్థాయి అధికారి అయిన ఎక్బాల్ సిద్దిఖీతో భర్తి చేశారు. ఇకపోతే పోలీసు సంక్షేమ విభాగం చీఫ్‌గా అదనపు డిజి స్థాయి అధికారి పోస్టు ఇది అయితే లా అండ్ ఆర్డర్ ఎఐజి రమణకుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇక సిఐడి విభాగంలో కూడా ఐజి పోస్టులు ఖాళీగా ఉంది. హైదరాబాద్ సిసిఎస్ చీఫ్‌గా ప్రస్తుతం ఉన్న ఐజి విశ్వప్రసాద్ ఈ ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ స్థానం కూడా ఖాళీ అవుతుంది. ఈ స్థానాన్ని కూడా ఎస్‌పి లేదా డిఐజి స్థాయి అధికారులతో భర్తీ చేయాల్సిందే. ఐజీ పోస్టుల్లో ఐజిలుగా పనిచేస్తున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఐజి సుమతి ప్రస్తుతం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి)చీఫ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఐజి కె.రమేష్ నాయుడు రైల్వే, రోడ్ సేఫ్టీ, ఆర్గనైజేషన్, లీగల్ ఐజిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక ఐజి ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి మల్టీజోన్1 ఐజిగా పనిచేస్తున్నారు. విజిలెన్స్ విభాగంలో ఐజిగా ఎఆర్ శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రొవిజనింగ్, లాజిస్టిక్స్ ఐజిగా ఎం.రమేష్ బాధ్యతలు నెరవేరుస్తున్నారు. అయితే తెలంగాణలో ఐజిల కొరత తీరాలంటే పదేళ్లు ఆగాల్సిందేనని పలువురు అధికారులు అంటున్నారు.2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన సమయంలో గెజిట్‌లో ఎపికి 116 మంది ఐపిఎస్‌లు, తెలంగాణకు 95 మంది ఐపిఎస్‌లను కేటాయించారు. 11 ఏళ్ల క్రితం ఉన్న ఈ సంఖ్య అప్పట్లోనే అరకొరగా ఉండే. అయితే తెలంగాణలో అదనంగా 23 జిల్లాలు పెరగడంతో ఐపిఎస్‌ల కొరత మరింత పెరిగిపోయింది.

## కాలువలో పడిన కారు

(మొదటి పేజీ తరువాయి)

సహాయంతో మునిగిపోయిన వాహనం నుండి 11 మృతదేహాలను వెలికితీశారు. ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మరణించిన ప్రతి ఒక్కరి బంధువులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50,000 ఇవ్వబడుతుందని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారిలో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నారని పోలీసు సూపరింటెండెంట్ వినీత్ జైస్వాల్ తెలిపారు. బాధితులను బీనా (35), కాజల్ (22), మెహక్ (12), దుర్గేష్, నందిని, అంకిత్, శుభ్, సంజు వర్మ, అంజు, అనసూయ, సౌమ్యగా గుర్తించారు. కారు డ్రైవర్ సహా నలుగురిని రక్షించి ఆసుపత్రికి పంపినట్లు ఎస్‌పి తెలిపారు. ఉదయం వర్షం కారణంగా రోడ్డు బురుదమయమై జారిపోయేలా మారిందని ప్రత్యక్ష సాక్షి ఇటియాథోక్ నివాసి రాహుల్ వర్మ తెలిపారు. కాలువ పక్కన నిర్మించిన రోడ్డుపై కారు వెళ్తుండగా, డ్రైవర్ బ్రేక్ వేసినప్పుడు అదుపుతప్పి కాలువలో పడిపోయిందని ఆయన అన్నారు. తాము వెంటనే పోలీసులను, గ్రామస్తులను ఘటన స్థలానికి పిలిపించి తాదు సహాయంతో కారును బయటకు తీశామని చెప్పారు. ప్రమాదం నుండి బయటపడిన ఒక టీనేజ్ అమ్మాయి మాట్లాడుతూ తామందరం పృథ్వీనాథ్ ఆలయాన్ని సందర్శించబోతున్నామని, ఘటన జరిగిన సమయంలో మహిళలు, బాలికలు భజనలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడంతో మృతులకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు.

## దుర్వినియోగం చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. వలస కార్మికులను శాశ్వతంగా వలస వచ్చినవారు అని అభివర్ణించడం వారిని అవమానించడమేనన్నారు. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కులో తీవ్ర జోక్యం చేసుకోవడమేనని రాజ్యసభ ఎంపి పేర్కొన్నారు. వలస కార్మికుడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వారి స్వరాష్ట్రానికి వెళ్లి ఎందుకు బిహార్‌కు తిరిగి రాకూడదని ప్రశ్నించారు. వారు సాధారణంగా చేసే పని అదేనన్నారు. ఛఠ్ పూజ సమయంలో వలస కార్మికుడు బిహార్‌కు తిరిగి రాలేదా? అని అన్నారు. ఓటరుగా నమోదు కావడానికి ఒక వ్యక్తికి స్థిర, శాశ్వత చట్టబద్ధమైన ఇల్లు ఉండాలి. వలస కార్మికుడికి బిహార్‌లో (లేదా మరొక రాష్ట్రంలో) అలాంటి ఇల్లు ఉంటుంది. అతను/ఆమె తమిళనాడులో ఓటరుగా ఎలా నమోదు చేసుకోవచ్చు? అని చిదంబరం అన్నారు. వలస కార్మికుడి కుటుంబం బిహార్‌లో శాశ్వత ఇల్లు కలిగి ఉండి అక్కడే నివసిస్తుంటే, ఆ వలస కార్మికుడిని తమిళనాడుకు శాశ్వతంగా వలస వచ్చినవారుగా ఎలా పరిగణించవచ్చని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని, రాష్ట్రాల ఎన్నికల స్వభావాన్ని, విధానాలను మార్చడానికి ప్రయత్నిస్తోందని, ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాలు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే.

## రికార్డులు మాయం

(మొదటి పేజీ తరువాయి)

సంచలనం సృష్టిస్తోంది. అదీకాక.. ఈ రికార్డులన్నీ ఒక క్రమపద్ధతిలో మాయం చేసినట్లు ఆర్‌టిఐ దరఖాస్తు ద్వారా వెల్లడైందని జయంత్ పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు ఫిర్యాదు చేసినట్లు జయంత్ వివరించారు. ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతపెట్టడం తాను చూశానని.. అధికారులు సైతం అక్కడే ఉన్నారని జయంత్ సంచలన విషయం వెల్లడించారు. ఈ నేపథ్యంలో సదరు మృతదేహాన్ని సిట్ అధికారులు వెలికి తీయాల్సి ఉందన్నారు. అయితే ఈ యువతుల గల్లంతుపై పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి చాలా కాలంగా ఆర్‌టిఐను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఆ క్రమంలో ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెల్తంగడి పోలీసులను అడిగినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫొటోలు, వాల్ పోస్టర్లు, పోస్ట్‌మార్టం నివేదికలు అన్ని ఒక పథకం ప్రకారం పోలీసులు నాశనం చేశారని వివరించారు జయంత్. దీనిపై శనివారం సిట్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో యువతి మృతదేహం పోలీసులకు లభించిందని.. అయితే వారు ఆ మృతదేహాన్ని అత్యంత దారుణంగా పాతిపెట్టారని చెప్పారు. ఇప్పుడు మృతదేహాలకు సంబంధించిన అవశేషాలు లభించినా.. వాటిని వేటితో సరి పోల్చుతారని ఆర్‌టిఐ కార్యకర్త జయంత్ ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. దీనిపై ఇంతగా ఎవరు ప్రభావం చూపించారని ప్రశ్నించారు. ఈ రికార్డులను కంప్యూటర్ బ్యాక్ అప్ ద్వారా వెనక్కి తీయాల్సిన అవసరం ఉందని జయంత్ అభిప్రాయపడ్డారు. దేనికి ఆధారం లేకుండా నాశనం చేశారంటే ఎలా నమ్మాలని, దీనిపై క్షుణ్ణంగా దర్యాపు జరపాలన్నారు. మరో వైపు తన వెనుక ఎవరూ లేరని ఆర్‌టిఐ కమిషనర్ కుండబద్దలు కొట్టారు. ఈ అంశం తనపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అందుకే వీటిని తేల్చాలని తాను నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు.

## సోషల్ మీడియా గేమ్!

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు.వీరితో నిశ్చితార్థ ఒప్పందం అనంతరం ప్రకటనదారులనుండి ఎండార్స్‌మెంట్‌ల కోసం చెల్లింపులను స్వీకరించడం ద్వారా వారి సోషల్ మీడియా ఖాతాలను ఉపయోగించుకుంటోంది. ముఖ్యంగా సరిహద్దు దాటి, విదేశాలనుంచి అనేకమంది అనుచరులను పొందిన తర్వాత ఖాతా హ్యాండ్లరు ఈ చిత్రాలను పర్వతాలు లేదా చినార్ వృక్షాల వంటి ఇతర చిత్రాలతో భర్తీ చేసేవారని అధికారులు తెలియజేశారు. ఈ ప్రాంతంలో ఆన్‌లైన్ ప్రచార వాతావరణ, రాజకీయ ప్రతిపక్షాలు, రాడికల్ అంశాలు, ఆన్‌లైన్ ఖ్యాతి, సంపదను కోరుకునే అవకాశవాదుల మధ్య సరిహద్దులను చెరిపివేస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ధోరణి కలవరపెడుతున్నదని అధికారులు చెప్పారు. సున్నితమైన భద్రతా పరిస్థితిని వ్యక్తిగతంగా ఉపయోగించుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై నిఘాను ముమ్మరం చేయాలని పోలీసులు గట్టిగా నిశ్చయించుకున్నారు. ముఖ్యంగా వారి పిల్లల భవిష్యత్తుపై దీని ప్రభావం గురించి కుటుంబాలకు అర్థం అయ్యేలా చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల పోలీసుల అదుపులో ఉన్నటువంటి ఏడుగురు పిల్లలను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చిన తర్వాత విడుదల చేసినట్లు ఒక అధికారి తెలియజేశారు. కశ్మీర్‌లో రెచ్చగొట్టే చిత్రాలను ఉపయోగించే సోషల్ మీడియా ప్రభావశీలుల పెరుగుదల వెనక ఉన్న ప్రేరణల గురించి అధికారులు వివరించారు. ఆర్థిక, డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో కంటెంట్‌ను మానిటైజ్ చేయడం లక్ష్యం కానిచోట, నిశ్చితార్థం ఆదాయాన్ని అనుసరించడం అస్పష్టమైన బూడిద రంగుకు దారితీసింది. ఈ ప్రభావశీలురులలో ఎక్కువ మంది సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై బ్రాండ్ భాగస్వామ్యాలపై ఆధారపడ్డారని, అక్కడ వారు ఉత్పత్తిని ప్రమోట్ చేస్తారని లేదా వాటిని వారి కంటెంట్‌లో అనుసంధానిస్తారని అధికారులు చెప్పారు. మూడు సామాజిక వేదికలపై పనిచేస్తున్న ఇద్దరు ప్రముఖ ప్రభావశీలుర ప్రకారం,బ్లూటిక్ వెరిఫికేషన్ సిస్టమ్ ఉన్నప్పటికీ ఆదాయంషేరింగ్ మోడల్ అస్పష్టంగానే ఉన్నది. ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ పేరు చెప్పడానికి ఇష్టపడని వ్యక్తి ఈ ప్రక్రియను అస్పష్టంగా వర్ణించాడు. ఫ్రీక్వెన్సీ, చెల్లింపుల మొత్తాన్ని నిర్ణయించే అంశాలు ఒక మిస్టరీ అని చెప్పాడు. ఆన్‌లైన్ సెలబ్రిటీల కోసం అన్వేషణ తరచుగా బహిరంగంగా ఒక ప్రక్రియతో సులభం లేదా డబ్బు ఆర్జనతో ముడిపడి ఉంటుంది. ఇది కొన్నిసార్లు తప్పనిసరిగా హామీ ఇవ్వబడదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్,య్యూట్యూబ్ వంటి పెద్ద ప్లాట్‌ఫామ్‌లలో డబ్బు ఆర్జన అనేది ప్రత్యక్ష ప్రకటనల ఆదాయం కలయిక. సబ్‌స్క్రైబర్, బ్రాండ్ వారి సొంత నిబంధనలు, అడ్డంకులతో వ్యవహరిస్తాయి. ఒక సోషల్‌మీడియాకు ప్రొఫెషనల్ ఖాతా ఎంత అవసరం, 10,000మంది అనుచరులు, 60 రోజులలోపు వెయ్యి నిమిషాలు వీక్షించిన కంటెంట్ ఉండాలి. కాబట్టి కశ్మీర్‌లో ఫాలోవర్ల గణనలను పెంచడానికి, రెచ్చగొట్టే కంటెంట్‌ను ఉపయోగించే వ్యూహం అస్థిర డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రత్యక్ష పర్యవసానంగా కనిపిస్తున్నది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com